


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**రైతులపై జగన్ మొసలి కన్నీరు**

- ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నదాతకు అష్టకష్టాలు
- జగన్ ట్వీట్‌కు మంత్రి మండిపల్లి కౌంటర్

9

# పుష్కరాలకు ముందే 'పోలవరం'



- యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు పనులు పూర్తి
- విజన్‌తోనే అభివృద్ధి సాధ్యం..
- కోకాపేట భూముల ధరలే అందుకు ఉదాహరణ
- కూటమికి ప్రజాసంక్షేమమే పరమావధి
- 18 నెలల్లో పెన్షన్ల కోసమే రూ.50,763 కోట్లు ఖర్చు
- చింతలపూడి లిఫ్ట్ పూర్తి చేసి రైతులకు నీరిస్తాం
- వైఎస్సార్ కాంగ్రెస్ రాష్ట్రానికి చాలా ప్రమాదకరం
- సీఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన
- ఉంగుటూరు 'పేదల సేవలో' పింఛన్ల పంపిణీ

*ఏలూరు జిల్లా ఉంగటూరు నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గోపీనాథపట్నం గ్రామంలో కిడ్నీ బాధిత మహిళ గుడ్ల నాగలక్ష్మీకి పింఛను అందించారు. తమ ఇంటికి సీఎం వస్తున్నారన్న సమాచారంతో నాగలక్ష్మీ కొడుకు, కుమార్తె నాగపవన్, వాసవి చంద్రబాబుకు ఎదురెళ్లి స్వాగతం పలికారు. నాగపవన్, వాసవి చదువు వివరాల గురించి సీఎం ఆరా తీశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతోన్న నాగలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సీఎం... ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌కు సూచించారు. నాగలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.*

- వివరాలు 2లో...

## గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు..

# రాష్ట్ర నేతలుగా ఎదగాలి



- అదే టీడీపీ సిద్ధాంతం
- పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి
- వైసీపీ ఐదేళ్ల రాక్షస పాలన ఎలా ఉందో చూశాం
- మనం సైకోతో పోరాడుతున్నామనే విషయం గుర్తుంచుకోవాలి
- ప్రజల మనస్సులు గెలుచుకునే విధంగా పనిచేయాలి
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి
- మండల పార్టీ అధ్యక్షులతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం

4

## సమస్యలు తీర్చి.. అండగా ఉంటా



- అర్జీదారులకు మంత్రి లోకేష్ భరోసా
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ 76వ రోజు ప్రజాదర్బార్
- ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి

5



## ఢిల్లీలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం

నేడు కేంద్రమంత్రులతో భేటీ - మొంథా నష్టంపై సమగ్ర నివేదన 4

-తాళ్ల వలసలో డయేరియా-

## కేసుల నమోదుపై సీఎం ఆరా

- వృద్ధుని మరణానికి కిడ్నీ సమస్యలే కారణం
- మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో మృతిచెందాడు
- సీఎంకు వివరించిన వైద్యారోగ్య శాఖ అధికార్లు

3

## ప్రజలతో మమేకం కావాలి



- పార్టీ కార్యక్రమాలను జనంలోకి తీసుకెళ్లాలి
- బాధ్యతతో పనిచేస్తేనే గుర్తింపు
- సీఎం చంద్రబాబు పాలనా దక్షత, మంత్రి లోకేష్ పోరాట పటిమ స్ఫూర్తితో పనిచేయాలి
- టీడీపీ మండలాధ్యక్షుల శిక్షణా తరగతుల్లో నేతల పిలుపు
- విజయవంతంగా మొదటి రోజు శిక్షణ

9

తన వైఫల్యాలను

## ట్వీట్లతో జగనే గుర్తు చేస్తున్నాడు..

- మార్కెట్ వ్యవస్థను ధ్వంసం చేసిందే గత వైసీపీ సర్కారు
- మధ్యవర్తుల దందా అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం
- జగన్ అబద్ధాలనే ప్రచారం చేస్తున్నాడంటూ మంత్రి అచ్చెన్న ఫైర్
- రైతు బాగుకు ట్వీట్లు కాదు... చర్యలు ముఖ్యమని వ్యాఖ్య

8

# పుష్కరాలకు ముందే 'పోలవరం'

- యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు పనులు పూర్తి
- విజన్‌తోనే అభివృద్ధి సాధ్యం..
- కోకాపేట భూముల ధరలే అందుకు ఉదాహరణ
- కూటమికి ప్రజాసంక్షేమమే పరమావధి
- 18 నెలల్లో పెన్షన్ల కోసమే రూ.50,763 కోట్లు ఖర్చు
- చింతలపూడి లిఫ్ట్ పూర్తి చేసి రైతులకు నీరిస్తాం
- వైఎస్సార్ కాంగ్రెస్ రాష్ట్రానికి చాలా ప్రమాదకరం
- సీఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన
- ఉంగుటూరు 'పేదల సేవలో' పింఛన్ల పంపిణీ



ఏలూరు (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 18 నెలల్లో పెన్షన్ల పంపిణీ కోసమే రూ.50,763 కోట్లు ఖర్చు చేశామని, దేశంలో ఎక్కడా ఈ స్థాయిలో సంక్షేమం కోసం వెచ్చిస్తున్న రాష్ట్రం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీతో పేదల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించే అవకాశం ప్రజలు తమకు ఇచ్చారని.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే సూపర్ సిక్స్ విజయవంతంగా అమలు చేశామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం గోపీనాథపట్నంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తురాలు నాగలక్ష్మి ఇంటికివెళ్లి పింఛను అందజేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం ప్రజావేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

## పింఛన్ల పంపిణీలో రికార్డు సృష్టించాం

ఈనెల 14న కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు పూర్తవుతుంది. ఇప్పటి వరకూ పింఛన్ల కోసం రూ.50,763 కోట్లు ఖర్చు చేశాం. ఏటా రూ.32,143 కోట్లచొప్పున ఐదేళ్లలో రూ.లక్షా 65 వేల కోట్లు పింఛన్ల కోసమే ఖర్చు చేస్తున్నాం. పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, అతిపెద్ద రాష్ట్రం యూపీలోనూ ఈస్థాయిలో అక్కడి ప్రభుత్వాలు వెచ్చించటం లేదు. 63 లక్షల పైచిలుకుకు రూ.2,739 కోట్లు పెన్షన్ల రూపంలో అందిస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతీ వందమందిలో 13మందికి పెన్షన్లు అందిస్తున్నాం. ప్రతినెలా పింఛన్లు అందుకుంటున్న వారిలో 59 శాతంమంది మహిళలే. అంటే ఇప్పటివరకు ఇచ్చిన రూ.50 వేల కోట్లలో రూ.30 వేల కోట్లు ఒక్క మహిళలకే ఇచ్చాం. గత ప్రభుత్వంలో భర్త చనిపోతే భార్యకు పింఛన్ అందలేదు. కూటమి ప్రభుత్వంలో ఆ ఇబ్బందుల లేవు. ఈ నెలలో కొత్తగా 7,533 మందికి రూ.3 కోట్లతో వితంతు పింఛన్లు ఇస్తున్నాం. గడిచిన ఐదేళ్లలో ఒక్క నెల పింఛను తీసుకోకపోయి నా ఎగ్గొట్టేవారు. ప్రభుత్వంలో 2 నెలలుగా పెన్షన్ తీసుకోని 1,39,677మందికి రూ.114 కోట్లు, 3 నెలలుగా పెన్షన్ తీసుకోని 13,325 మందికి రూ.16 కోట్లు విడుదల చేశాం. 1984లో ఎన్టీఆర్ పింఛన్లకు శ్రీకారం చుట్టారు. దాన్ని క్రమంగా పెంచుతూ ప్రస్తుతం రూ.4000 ఇస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులున్నా బాధ్యతగా ప్రతి నెలా 1న ఠంచనుగా పింఛను అందిస్తుంటే... గత ప్రభుత్వంలో ఐదేళ్లు ముక్కుతూ, మూలుగుతూ రూ.250 మాత్రమే పెంచారు అని సీఎం చంద్రబాబు అన్నారు.

## అర్హులందరికీ సంక్షేమం వర్తింపు

"ఓవైపు సంక్షేమం అమలు చేస్తూనే మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే వారందరికీ తల్లికి వందనం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నాం. జనాభా సమతౌల్యం కోసం ఆలోచన చేయాలి. అప్పుడే దేశం, రాష్ట్రం అగ్రస్థానంలో నిలుస్తాయి. కానీ కాలక్రమంలో జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. దీపం-2 కింద ఏటా 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటి వరకు 2.85 కోట్ల సిలిండర్లు ఉచితంగా అందించాం. ఇందుకోసం రూ.2,104 కోట్లు ఖర్చు చేశాం. స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సులో నేటివరకు మహిళలు 25కోట్ల ప్రయాణాలు చేశారు. గత ఐదేళ్లలో స్కూళ్లలో కనీసం సరిపడా టీచర్లు కూడా లేరు. కూటమి ప్రభుత్వం వచ్చాక మెగా డీఎస్సీతో 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

## అన్నదాత అభివృద్ధికి పంచసూత్రాలు

వ్యవసాయంచేసే రైతు నష్టపోకుండా ఉండేందుకు పంచసూత్రాలు అమలు చేస్తున్నాం. వాటర్ సెక్యూరిటీ, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు ద్వారా సాగును లాభసాటి చేసేందుకు ప్రణాళిక అమలు చేస్తున్నాం. డిసెంబర్ 3న రైతన్నా మీకోసం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సమాజంలో ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. వాటికి తగ్గనట్టు మనంకూడా సాగు విధానం మార్చుకోవాలి. రైతులు డిమాండ్ ఆధారిత పంటలను సాగుచేయాలి. ఆరోగ్య సమస్యల భయంతో ప్రపంచవ్యాప్తంగా అన్నం తినేవారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. సమీకృత వ్యవసాయ విధానాలను అవలంబించాలి. టెక్నాలజీ సాయంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇచ్చేందుకుచర్యలు తీసుకున్నాం. ఆక్వా కల్చర్ అభివృద్ధి చెందేం దుకు రూ.850కోట్ల వ్యయాన్ని ప్రభుత్వం భరిస్తుంది. ధాన్యం కొనుగోలు చేసిన 24నుంచి 48 గంటల్లోనే డబ్బులు రైతుల అకౌంట్లలో వేస్తున్నాం. జిల్లాలో వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇస్తూనే పరిశ్రమలు తీసుకొస్తున్నాం. కొబ్బరి, కోకో, కాఫీలాంటి పంటలకు ఈప్రాంతం అనువైనది. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కూడా రావాలి. దశాబ్దాలుగా నెలకొన్న కొల్లేరు సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తాం. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం. అన్ని చెరువులకు నీరందింస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



## 20లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు

మరో 15 ఏళ్లు కూటమి అధికారంలో ఉండాలని మిత్రులు పవన్‌కల్యాణ్ ఎప్పుడూ అంటుంటారు. ఇటీవల విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. విశాఖ నగరానికి గూగుల్ డేటా సెంటర్ వచ్చిందంటే అందుకుప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయతే కారణం. దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాక రూ.1.40 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం మొదటి సారి. ప్రతినియోజకవర్గంలో మూడు నెలలకు ఓసారి జాబ్ మేళాలు నిర్వహిస్తాం. 2027 నాటికి గోదావరి పుష్కరాలకంటే ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. పోలవరం పూర్తయితే నీటి ఎద్దడి ఉండదు. పొలాలకు రేట్లు పెరుగుతాయి. హైదరాబాద్‌లో చేసిన అభివృద్ధి ఫలాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు కోకాపేటలో ఎకరా రూ.10 వేలు ఉంటే నేడు రూ.160 కోట్ల వరకూ వెళ్లింది. అభివృద్ధి జరిగితే భూముల ధరలు పెరుగుతాయి. కియా కార్ల పరిశ్రమరాకతో అనంతపురం పెనుగొండ ప్రాంతంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అక్కడ ఎకరం రూ.10 లక్షలు ఉండే భూమి ఇప్పుడు కోట్లలో పలుకుతోంది. ఏపీ అభివృద్ధి లక్ష్యంగా మూడు ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయి. 2028 నాటికి అమరావతి ఫేజ్ 1 పనులు పూర్తవుతాయి. ప్రపంచంలోనే సుందర నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతాం. తిరుపతిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

## గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి ఊసే లేదు

గత పాలకులకు దోచుకోవడం, దాచుకోవడమే తెలుసు. అభివృద్ధి అంటే వారికి నచ్చదు. గతంలో నేను ముఖ్యమంత్రిగాచేసిన అభివృద్ధిని తర్వాత వచ్చినవాళ్లు అడ్డుకోలేదు. గత పాలకులు మాత్రం రాష్ట్రాన్ని గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చారు. గంజాయి డాన్‌గా మారిన ఓ మహిళ కూడా ఇప్పుడు బయటపడ్డారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంత ప్రమాదకరమో ఈ ఘటన ఒక్కటే చాలు. బాబాయిని గొడ్డలితో చంపి వేరే వారిపై నెపం నెట్టే తరహా నేరాలు రాష్ట్రంలో నడిపిస్తున్నారు. గత ప్రభుత్వంలో దేవాలయాలపై దాడులు జరిగాయి. ఆలయాలు, ప్రార్థనా మందిరాలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం. జనవరికల్లా గుంతలు పడిన రోడ్లన్నీ మరమ్మతులు చేస్తాం. ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ సంజీవని ప్రాజెక్టును తీసుకొచ్చాం. ప్రతి ఒక్కరి హెల్త్ కార్డులను డిజిటలైజ్ చేసే ప్రక్రియ చేపట్టాం. తలసరి ఆదాయం రూ.58 లక్షలకు పెంచడమే లక్ష్యంగా ముందుకెళుతున్నాం. ప్రధాని మోదీ సమర్థ నాయకత్వంలో 2047 నాటికి ప్రపంచంలో నెంబర్ వన్‌గా మనదేశం నిలుస్తుంది. అప్పటికి మన స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. అనంతరం ప్రజావేదిక సభలో పీ4 కార్యక్రమానికి సంబంధించి బంగారు కుటుంబాలను, మార్గదర్శులను సీఎం అభినందించారు. అంతకుముందు ప్రజా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



స్థానికంగా ఓ ఔత్సాహిక ఆక్వా రైతు చేస్తున్న సమీకృత ఆక్వా, వ్యవసాయ సాగును పరిశీలించి ప్రశంసిస్తున్న సీఎం








ఏలూరు జిల్లా ఉంగటూరు నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గోపీనాథపట్నం గ్రామంలో కిడ్నీ బాధిత మహిళ గుడ్ల నాగలక్ష్మీకి పింఛను అందించారు. తమ ఇంటికి సీఎం వస్తున్నారన్న సమాచారంతో నాగలక్ష్మీ కొడుకు, కుమార్తె నాగపవన్, వాసవి చంద్రబాబుకు ఎదురెళ్లి స్వాగతం పలికారు. నాగపవన్, వాసవి చదువు వివరాల గురించి సీఎం ఆరా తీశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతోన్న నాగలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సీఎం... ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌కు సూచించారు. నాగలక్ష్మి కుటుంబానికి అండగా ఉంటామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.









# -తాళ్ల వలసలో డయేరియా- కేసుల నమోదుపై సీఎం ఆరా

**వృద్ధుని మరణానికి కిడ్నీ సమస్యలే కారణం - మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో మృతిచెందాడు - సీఎంకు వివరించిన వైద్యారోగ్య శాఖ అధికార్లు**

అమరావతి (చైతన్య రథం): శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం తాళ్లవలస గ్రామంలో డయేరియా కేసులు నమోదు కావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఈమేరకు గ్రామంలోని పరిస్థితిని సీఎంకు వైద్యారోగ్య శాఖ అధికారులు వివరించారు. తాళ్లవలస గ్రామంలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వరకు ఆరుగురు వ్యక్తులు అస్వస్థతకు గురవగా వారిని టెక్కలి ఆసుపత్రికి తరలించామని చెప్పారు. సోమవారం మరో ముగ్గురు ఆసుపత్రిలో చేరారని అధికారులు సీఎంకు వివరించారు. బాధితులంతా వేర్వేరు కుటుంబాలకు చెందినవారని, ప్రస్తుతం ఆసుపత్రిలో ఐదుగురు చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని, ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. అయితే చిన్నారావు (70) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ ఆదివారం మరణించారని తెలిపారు. చిన్నారావు మృతికి డయేరియా కారణం కాదని వైద్యారోగ్య శాఖ అధికారులు చెప్పారు. చిన్నారావు మూత్రపిండాల వ్యాధితో బాధపడేవారని... మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ వల్ల గుండెపోటు వచ్చి మృతి చెందారని వైద్యులు నిర్ధారించినట్టు అధికారులు సీఎంకు తెలిపారు. గ్రామంలో ఉన్న ఒక బావి ద్వారా 5 పబ్లిక్ కుళాయిలకు నీటి సరఫరా అవుతోందని... అలాగే మరో 2 చేతి పంపుల నీరు సరఫరా అవుతోందని వివరించారు. ఈ నీటిని ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా పరీక్షించగా, ఎక్కడా కలుషితం లేదని, నీరు తాగడానికి సురక్షితమేనని తేలిందని అధికారులు చెప్పారు. అయినా ముందు జాగ్రత్త చర్యగా బావినుంచి నీటి సరఫరాను నిలిపివేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లా పంచాయతీ ఆఫీసర్, ఎస్ఈ (ఆర్‌డబ్ల్యుఎస్) క్షేత్రస్థాయిలోనే ఉండి పారిశుధ్యం, నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. డయేరియా ప్రబలడానికిగల అసలు కారణాన్ని కనుగొనేందుకు డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఎపిడెమియాలజిస్ట్ గ్రామంలోనే ఉండి పరిశీలిస్తున్నారని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నాయని అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. తాళ్లవలస గ్రామస్థులు



ఎందుకు అనారోగ్యం పాలవుతున్నారో గుర్తించాలని సీఎం ఆదేశించారు. గ్రామస్థులకు సరఫరా అయ్యే నీటిలో ఎక్కడైనా మలినాలు కలుస్తున్నాయా...? లేక ఇతర కారణాలా...? అనేది విశ్లేషించాలని సూచించారు. గ్రామస్థులందరికీ సురక్షితమైన మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు... సమీప గ్రామాలపైనా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



### గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు..

# రాష్ట్ర నేతలుగా ఎదగాలి

- అదే టీడీపీ సిద్ధాంతం
- పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి
- వైసీపీ ఐదేళ్ల రాక్షస పాలన ఎలా ఉందో చూశాం
- మనం సైకోతో పోరాడుతున్నామనే విషయం గుర్తుంచుకోవాలి
- ప్రజల మనస్సులు గెలుచుకునే విధంగా పనిచేయాలి
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి
- మండల పార్టీ అధ్యక్షులతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం



అమరావతి (చైతన్యరథం): గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్రస్థాయి నేతలుగా ఎదగాలనేది పార్టీ సిద్ధాంతం, విధానం అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రజల మనస్సులు గెలుచుకునే విధంగా పనిచేయాలి. స్థానిక ప్రజలతో అనుబంధం ఏర్పరచుకోవాలి. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపు ఇచ్చారు. మంగళగిరి లోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా మండల పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులకు శిక్షణా తరగతుల్లో భాగంగా "కాఫీ కబుర్లు" పేరుతో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అనేది యూనివర్సిటీ లాంటిందన్నారు. ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడు 2012లో మండల పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్రస్థాయి నేతలుగా, ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, ఉప ముఖ్యమంత్రులుగా పనిచేయాలనేది పార్టీ సిద్ధాంతం, విధానం. పార్టీ లేకపోతే మనం ఎవరం లేము. మనకు గుర్తింపు, గౌరవం దక్కుతున్నాయంటే కారణం తెలుగుదేశం పార్టీ. ఈ విషయాన్ని విస్మరించకూడదు. పార్టీ అనేది సుప్రీం అని యువనేత లోకేష్ అన్నారు.

### పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి

మండల పార్టీ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా మిమ్మల్ని నియమించింది పార్టీ. ప్రజలు మిమ్మల్ని ఎంచుకున్నారు కాబట్టి పార్టీ నియమించింది. పార్టీకి నిబద్ధతతో పనిచేయాలి. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి. పార్టీ కుటుంబం లాంటింది. చిన్న, చిన్న సమస్యలు సహజం. పార్టీలో సంస్కరణల కోసం నేను రెండేళ్లు పోరాడాను. ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ తూచా తప్పకుండా సదరు నిర్ణయాలను పాటించాలి. పార్టీ నేతలు అలక వీడాలి. సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకురావాలని లోకేష్ సూచించారు.

### స్థానిక ప్రజలతో అనుబంధం ఏర్పరచుకోవాలి

వైసీపీ ఐదేళ్ల రాక్షస పాలన ఎలా ఉందో చూశాం. గతంలో ఒక్క అనంతపురం జిల్లాలోనే 67 మంది టీడీపీ కార్యకర్తలను హత్య చేశారు. మన అధినేత చంద్రబాబుని సైకో జగన్మోహన్ రెడ్డి అక్రమంగా అరెస్ట్ చేయించారు. మనం సైకోతో పోరాడుతున్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అందరం ఒకే లక్ష్యంతో కలిసికట్టుగా పనిచేయాలి. అప్పుడే విజయాలు సాధిస్తాం. క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జ్‌లు, కుటుంబ సాధికార సారథులతో కలిసి కూర్చొని సమస్యలను పరిష్కరించుకోవాలి. ప్రజల మనస్సులు గెలుచుకునే విధంగా పనిచేయాలి.అహంకారం వద్దని ప్రజలు చెబుతున్నారు. మనం ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. స్థానిక ప్రజలతో అనుబంధం ఏర్పరచుకోవాలని లోకేష్ ఉద్బోధించారు.

### ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి

వారంలో ఒకరోజు పార్టీ కేంద్ర కార్యాలయంలోనే ఉంటాను. సమయం కేటాయిస్తాను. మీ నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం. ప్రతిఒక్కరు 'మై టీడీపీ' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ద్వారానే పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటాం. పెన్షన్ పంపిణీ, తదితర పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొనాలి. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. దేశంలో ఏరాష్ట్రంలో కూడా ఈ స్థాయిలో పెన్షన్లు ఇవ్వడం లేదు. చేసే పని చెప్పుకోవాలి. ఓర్పు, సహనంతో ప్రజలతో మమేకం కావాలి. పనిచేసే వారిని ప్రోత్సహిస్తాం. జీవితాంతం నేర్చుకోవాలనే ఆలోచనవస్తే విజయవంతం అవుతాం. కష్టం లేనిదే ఫలితం రాదు. నేను పాదయాత్ర చేయడం వల్లే ఈ స్థాయికి వచ్చా. అందరూ కష్టపడాలి. అప్పుడే ఫలితాలు వస్తాయని మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు.

మొదటి రోజు శిక్షణ తరగతుల కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వంద మంది వరకు మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. అంతకుముందు మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను నాలుగు విభాగాలుగా విభజించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రులు ఎన్.అమర్‌నాథ్ రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీషవారికి పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, మండల పార్టీ అధ్యక్షుల విధులు, బాధ్యతల పై మార్గదర్శనం చేశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల అభిప్రాయాలను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు నివేదించారు.





## ఢిల్లీలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం

- నేడు కేంద్రమంత్రులతో భేటీ
- మొంథా నష్టంపై సమగ్ర నివేదన

న్యూఢిల్లీ (చైతన్యరథం): దేశ రాజధాని ఢిల్లీ చేరుకున్న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్, హోంమంత్రి వంగలపూడి అనితకు సోమవారం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సానా సతీష్, కేశినేని శివనాథ్, అప్పల నాయుడు, బస్తిపాటి నాగరాజు, భరత్, లావు కృష్ణ దేవరాయలు, పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, దగ్గుమల్ల ప్రసాద్ రావు, టీడీపీ సీనియర్ నేతలు కంభం పాటి రామ్మోహన్‌రావు, కనకమేడల రవీంద్రకుమార్ తదితరులు మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికారు. మంత్రులు లోకేష్, అనిత మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలవనున్నారు. మొంథా తుపాను ప్రభావంతో జరిగిన నష్టం అంచనా సమగ్ర నివేదికను కేంద్ర మంత్రులకు నివేదించనున్నారు.







# సమస్యలు తీర్చి.. అండగా ఉంటా

- అర్జీదారులకు మంత్రి లోకేష్ భరోసా
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి లోకేష్ 76వ రోజు ప్రజాదర్బార్
- ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సమస్యలపై వచ్చిన వారికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. సమస్యలు పరిష్క రించి అండగా ఉంటామని హామీఇచ్చారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మంత్రి నారా లోకేష్ 76వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేష్‌ను స్వయంగా కలిసి సమస్యలు విన్నవించేం దుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వినతులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**వాయిద్య కళాకారుల పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టండి**


దేవాదాయ శాఖ కింద రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో ఖాళీగా ఉన్న నాదస్వరం, డోలు, శృతి, తాళం వాయిద్య కళాకారుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అఖిల భారత నాయిబ్రాహ్మణ హక్కుల పరిరక్షణ సేవ, సంక్షేమ, జాతి ప్రక్షాళన సమితి ప్రతినిధులు.. మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. వివిధ దేవాలయాల్లో సంప్రదాయ నిత్య కైంకర్య సేవలు, పూజల కోసం.. నాదస్వరం, డోలు, శృతి, తాళం నేర్చుకుని, వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులై, డిప్లమో అర్హత కలిగిన పూర్వ విద్యార్థులకు ఆయా పోస్టుల్లో అవకాశం కల్పించడంతో పాటు వయస్సు సడలింపు ఇవ్వాలని కోరారు.


గత 70 ఏళ్లుగా బంజరు భూముల్లో నివాసం ఉంటున్న తమకు ఇంటి పట్టాలు మంజూరు చేసి అండగా నిలవాలని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేటకు చెందిన గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

అన్నమయ్య జిల్లా ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన కోటావూరులో 60 కుటుంబాలు భూములు, ఇళ్లు కోల్పోయాయని.. బాధితుల సమస్యలు పరిష్కరించడంతో పాటు త్వరతగతిన నష్టపరిహార నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ముంపు గ్రామ రైతులు విన్నవించారు.

టీడీపీ సానుభూతిపరుడిననే కక్షతో వైసీపీ పాలనలో తనపైన, తన కుటుంబంపైన 42 అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం గోవిందపల్లికి చెందిన మహాదేవి జయశంకర్ కోరారు.

ఆయా విజ్ఞప్తులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.








## ఆరోజు పిలిచి ఎంపి సీటు ఇచ్చారు...!

# చంద్రబాబు నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉంది!





(చైతన్యరథం ప్రతినిధి - అమరావతి)

అనంతపురం జిల్లాలోని మారుమూల కుగ్రామంలో సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన కాల్వ శ్రీనివాసులు చంద్రబాబునాయుడు ప్రోత్సాహంతో అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చారు. పార్లమెంటు సభ్యుడిగా, రాష్ట్రమంత్రిగా, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా సమర్థవంతంగా సేవలందించారు రాయదుర్గం శాసనసభ్యుడు కాల్వ శ్రీనివాసులు. తన లాంటి ఎంతోమందికి రాజకీయాల్లో అవకాశాలు కల్పించిన విజనరీ లీడర్ చంద్రబాబు గారి మార్గదర్శకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందని అంటున్నారు. రాయలసీమను జగన్ కేవలం ఓట్లకోసం ఉపయోగించుకుంటే... చంద్రబాబు నాయుడు అభివృద్ధిని పరిచయం చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నారని అంటున్న టిడిపి సీనియర్ నేత కాల్వ శ్రీనివాసులు మనోగతం ఆయన మాటల్లోనే...!

### మీ రాజకీయ ప్రవేశం ఎలా జరిగింది?

అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలం అగ్రహారం అనే మారుమూల కుగ్రామంలో సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబంలో నేను జన్మించాను. ఒక్కమాటలో చెప్పాలంటే నేను రాజకీయాల్లోకి ఇష్టపూర్వకంగా రాలేదు, బాబు గారు తీసుకువచ్చారు. 1999లో చంద్రబాబునాయుడు రాజకీయాల్లో తటస్థులను తీసుకురావాలని నిర్ణయించినపుడు నన్ను హైదరాబాద్ పిలిపించి 45 నిమిషాలు మాట్లాడారు. ఈనాడు రిపోర్టర్ గా ఉద్యోగంలో హ్యాపీగా ఉన్నాను, నాకు రాజకీయాలెందుకు సార్ అన్నాను. నీలాంటి వారు రావాలి, 3రోజులు సమయం ఇస్తున్నాను, ఆలోగా వచ్చి నిర్ణయం చెప్పమన్నారు. వెంటనే రామోజీరావు గారి దగ్గరకు వెళ్లి చెప్పగానే ఆయన ఆశీర్వదించి పంపించారు. ఒకవేళ రాజకీయాల్లోకి వెళ్లాక నీకు ఏదైనా కష్టమనిపిస్తే ఈనాడు తలుపులు నీకోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని భరోసా ఇచ్చారు. వెంటనే బాబుగారి వద్దకు వచ్చి అంగీకారం తెలియజేయగా, అనంతపురం పార్లమెంటు స్థానం నుంచి పోటీచేసే అవకాశం ఇచ్చారు. తొలి ప్రయత్నంలోనే అనంతపురం నుంచి 24,600 ఓట్ల మెజారిటీతో గెలుపొందాను. ఆ తర్వాత 2017లో నాకు రాష్ట్ర గృహనిర్మాణ మంత్రిగా అవకాశం ఇచ్చారు. గత 21 సంవత్సరాలుగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యునిగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నాను. నా లాంటి ఎంతోమంది సామాన్యులకు చంద్రబాబునాయుడు రాజకీయ అవకాశాలను కల్పించి, అసామాన్యులుగా మార్చారు. చంద్రబాబు గారి లాంటి విజనరీ లీడర్ నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉంది.

### పార్టీలోకి కొత్తరక్తం రావాలంటున్నారు?

లోకేష్ గారి అభిప్రాయంతో నేను నూటికి నూరుశాతం ఏకీభవిస్తున్నాను. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువనాయకత్వానికి అవకాశం ఇవ్వాల్సిందే. సీనియర్ల మార్గనిర్దేశకత్వం, ప్రత్యర్థులను ధీటుగా ఎదుర్కొనే యువరక్తం జోడెడ్ల బండిలా పార్టీని ముందుకు నడిపించాలి. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినపుడు 80శాతం మంది కొత్తవారికే అన్న ఎన్టీఆర్ అవకాశం ఇచ్చారు. 1999లో చంద్రబాబుగారు తటస్థలు, మేధావులను రాజకీయాల్లోకి రప్పించి నాలాంటి వారికి అవకాశం ఇచ్చారు. 2024 ఎన్నికల్లో ఎక్కువమంది కొత్తవారికి అవకాశం లభించింది. రాజకీయాల్లో వస్తున్న మార్పును ఆహ్వానించేలా నాయకుల మైండ్ సెట్ లో మార్పు రావాలి. పార్టీ పదవుల నుంచి నామినేటెడ్ పోస్టుల వరకు సామాజిక సమతుల్యత పాటిస్తున్న పార్టీ తెలుగుదేశం.

### బిసిలు, దళితులకు ప్రాధాన్యత ఇచ్చిందెవరు?

బిసిలకు పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ. వెనుకబడిన వర్గాలు, దళితులకు అధికారంలోకి భాగస్వామ్యం కల్పించింది టిడిపి మాత్రమే. గత ప్రభుత్వంలో అధికారమంతా కేవలం ముగ్గురు రెడ్ల చేతిలో కేంద్రీకృతమైంది. దీనివల్ల మిగిలిన సామాజికవర్గాలకు ప్రభుత్వపాలనలో నిర్ణయాధికారం ఉండేది కాదు. అధికారాన్ని అంతటినీ కొంతమంది చేతిలో పెట్టి వ్యవస్థలను నాశనం చేశారు. దీనివల్ల అరాచకం పెరిగిపోయి సామాన్యులు సజావుగా జీవనం సాగించలేని పరిస్థితులు కల్పించారు. ఒకరకంగా అప్రకటిత జగన్ జమానాలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది. ఇక మళ్లీ జగన్ పాలన వస్తే బతకలేమన్న భయానక పరిస్థితులు కల్పించారు. వ్యవస్థను వాలంటీర్ల చేతిలో పెట్టి గ్రామస్థాయి రాజకీయ నాయకత్వాన్ని నిర్వీర్యం చేశారు. చివరికి వైసిపి వారు సైతం గ్రామాల్లో గౌరవప్రదంగా రాజకీయం చేయలేని దుస్థితి నెలకొంది. ఫలితంగానే గత ఎన్నికల్లో వైసిపిని 11 సీట్లకు పరిమితం చేశారు.

### కూటమి ప్రభుత్వం వచ్చాక ఎలా ఉంది?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబానికి భద్రత లభించింది. ప్రజలు స్వేచ్ఛగా జీవనం సాగిస్తున్నారు, గతంలో మాదిరి దౌర్జన్యాలు, దాడులు లేవు. భద్రతతోపాటు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ప్రజలకు




అందుతున్నాయి. ఏదైనా అయితే తమను చందబాబు కవచంలా నిలచి కాపాడతారన్న భరోసా ప్రజలకు లభించింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమాన్ని ప్రజాప్రభుత్వం అమలు చేస్తోంది. కేవలం 17నెలల్లో రూ.50వేలకోట్లకు పైగా పించన్లను అందించిన ప్రభుత్వం మరెక్కడా లేదు. ఇదొక చరిత్ర. ఎన్నికల సమయంలో తాము ఇంటికి పెద్దకొడుకులా ఉంటానని చెప్పిన చంద్రబాబు ఆచరణలో అమలుచేసి చూపిస్తున్నారు. పేదరికంతోపాటు ప్రజల్లో ఆకలిబాధలు ఉండకూడదని చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. ఇది ఆయనకు గల చిత్తశుద్ధికి నిదర్శనం.

### ప్రస్తుతం ప్రజల్లో సంతృప్తస్థాయి ఎలా ఉంది?

ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారు. జగన్మోహన్ రెడ్డికి రూ.2వేల పెన్షన్ 3వేలు చేయడానికి అయిదేళ్ల సమయం పట్టింది. రూ.10లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నప్పటికీ చంద్రబాబుగారు గత ఏడాది నాలుగోసారి సిఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వృద్ధాప్య పెన్షన్ ను ఒకేసారి 4వేలకు పెంచారు. వికలాంగుల పెన్షన్ ను 6వేలకు, డయాలసిస్ పేషెంట్ల పెన్షన్ 10వేలకు, తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికి పరిమితమైన వారికి రూ.15వేల పెన్షన్ అందిస్తున్నారు. సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు గారు. ఇది ఎవరికీ సాధ్యం కాదు.


### సీమకు ఎవరి హయాంలో మేలు జరిగింది?

రాయలసీమ వెనుకబాటు తనాన్ని ఓట్లకోసం మాత్రమే ఉపయోగించుకున్న స్వార్థపరుడు జగన్మోహన్ రెడ్డి. ఆయన రాయలసీమకు తీరని ద్రోహం చేశారు. గత ఏడాది చంద్రబాబు గారు అధికారంలోకి వచ్చాక హంద్రీనీవా విస్తరణ పనులను పరుగులు తీయించారు. ఏడాదిలో ప్రధానకాల్వ విస్తరణ పనులకు సుమారు రూ.3,500 కోట్లకు పైగా ఖర్చుచేశారు. ఒక సాగునీటి ప్రాజెక్టుపై అతితక్కువ సమయంలో ఇంత భారీగా ఖర్చుచేయడం ఒక చరిత్ర. దీనివల్ల 50 టిఎంసిల నీరు ఉపయోగించుకునే అవకాశం కలిగింది. దీనిద్వారా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల రైతాంగానికి భారీ మేలు జరిగింది. రాష్ట్రం చివరన ఉన్న కుప్పానికి సైతం నీళ్లు అందించగలిగారు. 2014-19 నడుమ హంద్రీనీవా, గాలేరి- నగరి ప్రాజెక్టులపై చంద్రబాబు గారు 12వేల కోట్లు ఖర్చుపెడితే, జగన్ ప్రభుత్వం అయిదేళ్లలో ఖర్చుచేసింది కేవలం రూ.2,046 కోట్లు మాత్రమే. ఎత్తిపోతల పథకానికి రూ.350 కోట్లు బకాయిలు పెట్టి సాగునీటి రంగాన్ని జగన్ పూర్తిగా నిర్లక్ష్యంచేశారు.

### రాయలసీమ అభివృద్ధికి ఏం చేస్తున్నారు?

రాష్ట్రంలో చంద్రబాబు గారి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాయలసీమలో ప్రజల జీవన స్థితిగతుల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. గతంలో కియా పరిశ్రమ ద్వారా అనంతపురం జిల్లాలో జీవన ప్రమాణాలు మెరుగుపర్చారు. ఈసారి కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడపజిల్లా కొప్పర్తిలో పారిశ్రామికవాడల ఏర్పాటుతో అనేక పరిశ్రమలు వస్తున్నాయి. సోలార్, డిఫెన్స్ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తుండటంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కేంద్రాన్ని ఒప్పించి పండ్లతోటల అభివృద్ధికి పూర్వోదయ పథకాన్ని మంజూరు చేయించారు. దీనిద్వారా రాయలసీమ ప్రాంతం హార్టికల్చర్ హబ్ గా మారబోతోంది. పెద్దఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు రాబోతున్నాయి. గత అరాచక పాలనలో ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు యువనేత లోకేష్ గతంలో ఎవరూ చేయనివిధంగా రాయలసీమలో సుదీర్ఘ పాదయాత్ర చేశారు. పాదయాత్ర సందర్భంగా కడప వేదికగా రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. ఆ డిక్లరేషన్ లోని హామీలను అమలు చేసేందుకు ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది.





# భారత భవితకు..
# క్వాంటమ్ వారధి చంద్రబాబు

మార్పు అనే పదానికి కొత్త అర్థాన్ని ఇవ్వగలిగే టెక్నాలజీలు చాలా అరుదు. ఇంటర్నెట్ ఒకప్పుడు అలా చేసింది. స్మార్ట్‌ఫోన్లు ప్రపంచాన్ని మన చేతిలో పెట్టాయి. ఇప్పుడు అదేస్థాయి విప్లవాన్ని తెచ్చేందుకు సిద్ధంగా ఉంది క్వాంటమ్ టెక్నాలజీ. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ స్థాపనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కేవలం ఒక ప్రాజెక్టు కాదు.. దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపే వ్యూహాత్మక అడుగు. ఇది ఆంధ్రప్రదేశ్‌ను భారత క్వాంటమ్ పటంలోనే కాదు, ప్రపంచ టెక్నాలజీ మ్యాప్‌లో కీలక కేంద్రంగా నిలబెట్టే అవకాశం.

### తెలుగుగడ్డపై సాంకేతిక విప్లవాలు

1990ల చివరిలో ఉమ్మడి రాష్ట్రం ఐటీరంగంలో సాధించిన వేగవంత అభివృద్ధి యాదృచ్ఛికం కాదు. దూరదృష్టి కలిగిన పరిపాలన, ధైర్యమైన నిర్ణయాల ఫలితమది. నేడు అలాంటి మరో అవకాశాన్ని క్వాంటమ్ ఇండస్ట్రీ రూపంలో రాష్ట్రానికి తెచ్చి పెట్టింది ప్రభుత్వం. ఐటీ తరహా మరో ప్రగతిని సాధించాలంటే, దానిని మించి ప్రపంచాన్ని ముందుకు నడిపించే తదుపరి పెద్ద తరంగాన్ని పట్టుకోవాలి. ఆ తరంగమే క్వాంటమ్. ఈ వాస్తవాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా గ్రహించింది. 156 క్యూబిట్ల శక్తితో పనిచేయబోయే హెరాన్ ప్రాసెసర్ ఆధారిత క్వాంటమ్ సిస్టమ్-2.. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీల భాగస్వామ్యంతో రూపొందుతున్న ఈ క్వాంటమ్ కంప్యూటర్ దేశ చరిత్రలోనే అత్యంత శక్తివంతమైందిగా నిలవనుంది. భారతదేశం ఇప్పటి వరకు చిన్నస్థాయి క్వాంటమ్ సిస్టంలపైనే ప్రయోగాలు చేస్తూ వస్తే, ఈ అమరావతి వ్యవస్థ అమెరికా, చైనావంటి అగ్రదేశాలు ఉపయోగిస్తున్న హార్డ్‌వేర్ లీగ్‌లోకి మన అడుగును ప్రవేశపెడుతోంది. దీనివల్ల సైబర్ సెక్యూరిటీ నుంచి రక్షణ వ్యవస్థల వరకు, వైద్య పరిశోధనల నుంచి వాతావరణ అంచనాల వరకు అనేక రంగాల్లో కొత్త అవకాశాలు తెరుచుకుంటాయి.

### ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో సమగ్ర విద్యా ప్రణాళిక

రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం టెక్నాలజీకి ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా 2025-26 విద్యా సంవత్సరం నుంచే ఇంజనీరింగ్ మరియు సాంప్రదాయ డిగ్రీ కళాశాలల్లో క్వాంటం టెక్నాలజీస్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో మైనర్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెడుతూ సమగ్ర పాఠ్య ప్రణాళికను ఉన్నత విద్యా మండలి రూపొందించింది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపి) 2020 మరియు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) మార్గదర్శకాలకు అనుగుణంగా, క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం టెక్నాలజీస్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోసం నిర్దిష్టమైన పాఠ్య ప్రణాళిక చట్రాన్ని ప్రత్యేక నిపుణుల కమిటీతో రూపొందించి దాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్‌సిహెచ్‌ఈ) ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. విద్యార్థులకు అధ్యాపకులే నిజమైన మార్గదర్శకులు కనుక క్వాంటం టెక్నాలజీని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు వీలుగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపి)ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించింది. మరోవైపు క్వాంటం కంప్యూటింగ్ ప్రాథమిక అంశాలను, వాటి బోధనా ప్రాముఖ్యతపట్ల విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు వీలుగా అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ - 2025 కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే సెమీఫైనల్స్ పూర్తయ్యాయి. త్వరలో ఫైనల్స్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఉన్నత విద్యా మండలి సిద్ధంగా ఉంది. మరోవైపు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంనుంచి క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు అమలవుతోంది. క్వాంటమ్ కంప్యూటింగ్ ల్యాబ్‌లు అమెజాన్, మైండ్ ట్రీ, గూగుల్‌వంటి సంస్థలకున్నాయి. వాటిని వర్చువల్ విధానంలో బోధనకు వినియోగించుకునే అవకాశాన్ని అధ్యాపకులు విద్యార్థులు వినియోగించుకుంటున్నారు.

**నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపి) 2020 మరియు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) మార్గదర్శకాలకు అనుగుణంగా, క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం టెక్నాలజీస్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోసం నిర్దిష్టమైన పాఠ్య ప్రణాళిక చట్రాన్ని ప్రత్యేక నిపుణుల కమిటీతో రూపొందించి.. దాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు ఏపీ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో వర్శిటీలు, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశాం. క్వాంటం టెక్నాలజీని క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు వీలుగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపి)ని ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నాం. క్వాంటం కంప్యూటింగ్ ప్రాథమిక అంశాలు, వాటి బోధనా ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ -2025ను విజయవంతంగా నిర్వహించాం.**

### సెకన్ల వ్యవధిలో సమాచారం

ఒక బలమైన పాస్‌వర్డ్‌ను క్రాక్ చేయడానికి ఉన్నత శ్రేణి సూపర్ కంప్యూటర్లకు ఏళ్లు పట్టినా, క్వాంటమ్ కంప్యూటర్‌కు కొన్ని సెకన్లే చాలు. అదే సమయంలో ఇటువంటి యంత్రాలు సృష్టించే ఎన్‌క్రిప్షన్ మాత్రం శత్రు దేశ హ్యాకర్లకు దాదాపు అసాధ్యమే. కాబట్టి క్వాంటమ్ టెక్నాలజీ ప్రతిసారీ ప్రమాదం కాదు. సరైన దారిలో వినియోగిస్తే అది దేశ రక్షణకు అత్యంత శక్తివంతమైన ఆయుధం. ఈ విప్లవాన్ని విజయవంతం చేయాలంటే విద్యా వ్యవస్థను కొత్త దిశకు తీసుకెళ్లడం తప్పనిసరి. అందుకే 2025-26 విద్యా సంవత్సరం నుంచే ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ మరియు సాంప్రదాయ డిగ్రీ కళాశాలల్లో క్వాంటమ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మైనర్ ప్రోగ్రామ్‌ల ప్రారంభాన్ని సమయోచిత నిర్ణయంగా భావించి ముందుకు వెళ్తున్నాం. విద్యార్థులు మారకపోతే భవిష్యత్తు మారదు. ఈ సూత్రాన్ని ప్రభుత్వ విద్యా ప్రణాళిక స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ పోగ్రామ్‌లు, వర్చువల్ క్వాంటమ్ ల్యాబ్‌లు, క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌వంటి కార్యక్రమాలు కేవలం ప్రారంభం మాత్రమే. ఈ మార్పు చివరికి ప్రపంచమార్కెట్ కోసం భారత ప్రతిభను సరికొత్తగా సిద్ధం చేస్తుంది.

### శక్తివంతమైన వ్యవస్థగా ఆవిర్భవిస్తుంది

క్వాంటమ్ టెక్నాలజీ అనేది భౌతిక శాస్త్రం, ఇంజనీరింగ్, గణితశాస్త్రాల సంగమం. సూపర్ పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్ వంటి సూత్రాల ఆధారంగా పనిచేసే క్యూబిట్లు ప్రపంచంలోని అత్యంత క్లిష్ట సమస్యలను వేగంగా పరిష్కరించగలవు. 20 క్యూబిట్ల క్వాంటమ్ సిస్టమ్ లక్షకుపైగా సాధ్యమైన విలువలను లెక్కించగలదంటే 156 క్యూబిట్ల వ్యవస్థ ఎంత శక్తివంతంగా ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. అమెరికా, చైనా, ఫిన్లాండ్, కెనడావంటి కొద్ది దేశాలు మాత్రమే క్వాంటమ్ రేసులో ముందున్న తరుణంలో భారత్ కూడా వేగంగా ఆ స్పేస్‌లో ప్రవేశిస్తోంది. నేషనల్ క్వాంటమ్ మిషన్ నేపథ్యంలో అమరావతి వ్యాలీ నిర్మాణం 2026 జనవరి 1నాటికి ప్రారంభం కానుండటం దేశ దిశను మార్చే మైలురాయి. డేటా సెంటర్లు, రీసెర్చ్ ఇంక్యుబేటర్లు, టెక్ పార్కులు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి యూనిట్లు, హార్డ్‌వేర్ మాన్యుఫ్యాక్చరింగ్.. ఈ మొత్తం ఎకోసిస్టమ్ ఏర్పడితే అమరావతి కేవలం రాజధానిగానే కాకుండా దేశం యొక్క క్వాంటమ్ నర్వ్ సెంటర్‌గా ఎదుగుతుంది.

### ఏఐ -క్వాంటమ్ అనుసంధానమే కీలకం

ఏఐ మరియు క్వాంటమ్ అనుసంధానం అంటే భవిష్యత్తు వజ్రాయుధం. వచ్చే పదేళ్లు ఈ రంగాల్లో జరిగిన పురోగతి ప్రపంచపటాన్ని మార్చబోతోంది. శ్రీహరికోట స్పేస్ సిటీ, ఓర్వకల్లు డ్రోన్ సిటీ, విశాఖ మెడ్‌టెక్ పార్క్, అమరావతి క్వాంటమ్ వ్యాలీ.. ఇవన్నీ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక టెక్నాలజీ హబ్‌గా నిలబెట్టే పునాదులు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ దిశ స్పష్టంగా కనిపిస్తోంది. భారత విజన్‌కు అనుగుణంగా క్వాంటమ్ మిషన్, యాక్షన్ ప్లాన్, రోడ్ మ్యాప్‌ను రూపొందించిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. విశాఖ వేదికగా జరిగిన సిఐఐ సదస్సులో 23 అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే భాగస్వామ్యానికి ముందుకు రావడం ఈ దిశలో విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది.

### ఏపీ దిశను మార్చే ప్రయాణం

అమరావతి క్వాంటమ్ వ్యాలీ కేవలం ఒక ప్రాజెక్టు కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ దిశను మార్చే ప్రయాణం. ఆంధ్రప్రదేశ్ భావి పౌరుల బంగారు భవితే లక్ష్యంగా ఈ ప్రయాణం సాగుతోంది. విశ్వవ్యాప్తంగా ఆవిష్కృతమవుతున్న సాంకేతిక విప్లవాలను మన రాష్ట్ర విద్యార్థులు అందుకోవడానికి వేస్తున్న వ్యూహాత్మక అడుగు ఇది. రాష్ట్ర ప్రగతికి, విద్యార్థుల భవితకు.. అమరావతి క్వాంటం వ్యాలీ అద్భుతమైన పునాదిని వేస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. అంతేకాదు, భారత సాంకేతిక పురోగతిలో కీలకమైన అధ్యాయం కూడా ఇదే. రేపటి ప్రపంచాన్ని రూపొందించడంలో మన రాష్ట్రం పోషించబోయే పాత్రకు ఇది తొలి పేజీ.



- ప్రొఫెసర్ కొత్త మధుమూర్తి
చైర్మన్, ఏపీ ఉన్నత విద్యా మండలి

**క్వాంటమ్ టెక్నాలజీ అనేది భౌతిక శాస్త్రం, ఇంజనీరింగ్, గణితశాస్త్రాల సంగమం. సూపర్ పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్ వంటి సూత్రాల ఆధారంగా పనిచేసే క్యూబిట్లు ప్రపంచంలోని అత్యంత క్లిష్ట సమస్యలను వేగంగా పరిష్కరించగలవు. 20 క్యూబిట్ల క్వాంటమ్ సిస్టమ్ లక్షకుపైగా సాధ్యమైన విలువలను లెక్కించగలదంటే 156 క్యూబిట్ల వ్యవస్థ ఎంత శక్తివంతంగా ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చు. అమెరికా, చైనా, ఫిన్లాండ్, కెనడావంటి కొద్ది దేశాలు మాత్రమే క్వాంటమ్ రేసులో ముందున్న తరుణంలో భారత్ కూడా వేగంగా ఆ స్పేస్‌లో ప్రవేశిస్తోంది. నేషనల్ క్వాంటమ్ మిషన్ నేపథ్యంలో అమరావతి వ్యాలీ నిర్మాణం 2026 జనవరి 1నాటికి ప్రారంభం కానుండటం దేశ దిశను మార్చే మైలురాయి. డేటా సెంటర్లు, రీసెర్చ్ ఇంక్యుబేటర్లు, టెక్ పార్కులు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి యూనిట్లు, హార్డ్‌వేర్ మాన్యుఫ్యాక్చరింగ్.. ఈ మొత్తం ఎకోసిస్టమ్ ఏర్పడితే అమరావతి కేవలం రాజధానిగానే కాకుండా దేశం యొక్క క్వాంటమ్ నర్వ్ సెంటర్‌గా ఎదుగుతుంది.**



# తన వైఫల్యాలను ట్వీట్లతో జగనే గుర్తు చేస్తున్నాడు..

- మార్కెట్ వ్యవస్థను ధ్వంసం చేసిందే గత వైసీపీ సర్కారు
- మధ్యవర్తుల దందా అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం
- జగన్ అబద్ధాలనే ప్రచారం చేస్తున్నాడంటూ మంత్రి అచ్చెన్న ఫైర్
- రైతు బాగుకు ట్వీట్లు కాదు... చర్యలు ముఖ్యమని వ్యాఖ్య

అమరావతి (చైతన్య రథం): రైతులపట్ల నిజమైన బాధ, వాళ్ల కోసం కట్టుబాటున్న నాయకుడు ట్వీట్లలో కాదు, నేలమీద చర్యల్లో కనిపించాలని, నేడు వైఎస్ జగన్ చేస్తున్న ట్వీట్లు ఆయన ఐదేళ్ల పాలనలో వ్యవసాయ రంగాన్ని ఎలా దెబ్బతీశారో ప్రజలకు గుర్తు చేస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.రైతుకోసం ఏ ఒక్క ఉపశమన చర్య తీసుకోకుండా, మార్కెట్ వ్యవస్థను దెబ్బతీసి, పంటలు పాడైపోయినా కనీస గిట్టుబాటు ధర అందకుండా చేసి, రాష్ట్రాన్ని అట్టడుగుస్థాయికి తీసుకొచ్చింది గత ప్రభుత్వమేనని ఒక ప్రకనలో పేర్కొన్నారు.

గతంలో ఉల్లి ధరలు తగ్గితే 25వేలు ఉన్న పరిహారాన్ని కూటమి ప్రభుత్వం హెక్టార్‌కి 50 వేలకు పెంచి 104కోట్ల రూపాయలను రైతులకు అందచేయబోతున్నాం అని తెలిపారు. గతంలో అరటి టన్ను 25 వేలు ఉందంటావు ప్రభుత్వ ఖజానా నుండి రైతులకు ఇచ్చావా... మార్కెట్‌లో ధర ఉంది రైతులకు గిట్టుబాటు ధర లభించింది,అందుకు నీ గొప్ప వలన రేట్ వచ్చింది అని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఉచిత భీమా పేరు చెప్పి రైతుల జీవితాలతో ఆడుకున్న నువ్వు రైతుల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. నీలా మోసం చేయటం మాకు చేతకాదని... కేవలం 2% మాత్రమే రైతులు కడితే మిగతా ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. గత ప్రభుత్వంలో భీమా చెల్లించకుండా, రైతులకు ఆశ చూపి నిట్టనిలువునా ముంచిన ఘనత జగన్ కే దక్కుతుందన్నారు.రైతుల కోసం ప్రత్యేక రైళ్లు ఎప్పటినుండో అందుబాటులో ఉన్నాయని, అదేదో జగన్ మాత్రమే చేసిన పనిలా చెప్పుకోటం విచిత్రంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో డ్రిప్ ఇరిగేషన్‌కు ఎస్సి,



ఎస్టీ రైతులకు 100%, రాయలసీమ ప్రాంతాలకు 90%, ఇతర ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులకు 70% సబ్సిడీ అందచేస్తున్నామని, గత ప్రభుత్వం ఎగణామంపెట్టిన 1200కోట్లబాకీలను కూటమి ప్రభుత్వం చెల్లించటమే కాకుండా, డ్రిప్ ఇరిగేషన్‌లో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇన్పుట్ సబ్సిడీ ఎప్పటిది అప్పుడే చెల్లిస్తున్నామని, ఇప్పటివరకు 1,75,000 రైతుల నుండి 11 లక్షల 71 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 24గంటల్లో రైతులఖాతాల్లో 2776కోట్ల రూపాయలను జమ చేశామని తెలిపారు. జగన్ హయాంలో ధాన్యాన్ని అమ్ముకున్న రైతులు డబ్బుల కోసం చకోర పక్షుల వలే ఎదురు చూసేవారు. గత 5ఏళ్ళు రైతుల నోట్లో మట్టి కొట్టావు, ఇప్పుడు ధరలు పడిపోతున్నాయి అని గ్లోబల్ ప్రచారం చేస్తు, మార్కెట్లు పతనమయ్యేందుకు కారకుడవు అవుతున్నావు. నీ తప్పుడు ప్రచారాలను సమర్ధవంతంగా ఎదుర్కొని తీరుతామని అన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ మూడు నెలల్లోనే రైతాంగం పునఃప్రాణం పోసుకునేలా చర్యలు తీసుకున్నామని, మధ్యవర్తుల దందాలను అరికట్టడానికి మార్కెట్ ఇన్టర్వెన్షన్ ప్రారంభించామని తెలిపారు.పంట కొనుగోళ్లను పారదర్శకంగా చేసే విధంగా మార్కెటింగ్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరిస్తున్నాం. రైతులను ఐదు సంవత్సరాలు గాలిలోకి వదిలేసి, ఇప్పుడు సోషల్ మీడియాలో Save AP Farmers అనే హ్యాష్‌ట్యాగ్ పెట్టడం బాధ్యత లేకపోవడమే. మాటలతో కాదు చర్యలతో రైతాంగాన్ని కాపాడతాం. రైతుల నమ్మకాన్ని తిరిగి నిలబెట్టడం, ప్రతి పంటకు గిట్టుబాటు ధర అందేవిధంగా వ్యవస్థను బలోపేతం చేయడం కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# సంకల్పబలం.. పేదల సేవలోనే పాలన బలం

సంక్షేమ రాష్ట్రం అంటే కేవలం పథకాలు ప్రకటించడం మాత్రమే కాదు. ఆ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి చేరేలా చేసి, వారి జీవితాల్లో గౌరవాన్నీ, భరోసాని పెంచడమే నిజమైన సంక్షేమ పాలన. ఈ దారిలో ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. పదిహేడు నెలల స్వల్పకాలంలోనే పేదల గుండెల్లో విశ్వాసం నింపేలా తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి.

అందులోనూ ప్రత్యేక గుర్తింపందుకున్నది 'ఎన్టీఆర్ భరోసా పింఛన్'. పేదరికం, వృద్ధాప్యం, అనారోగ్యం.. ఇలాంటి పరిస్థితులు ఒక మనిషిని కుంగదీసే ప్రధాన కారణాలు. అలాంటి సందర్భాల్లో పౌరుడికి కనీస జీవన గౌరవం కాపాడటం ప్రభుత్వ ధర్మం. ఆ ధర్మాన్ని నిర్వర్తించడంలోనే ఈ పింఛన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

గత 17 నెలల్లో కేవలం సామాజిక పింఛన్ల కోసమే రూ.50,763 కోట్ల భారీ వ్యయం. ఇది కేవలం గణాంకం కాదు, కోట్లాది కుటుంబాలను గౌరవంతో బ్రతికించే జీవనాధారం. ఏ రాష్ట్రం కూడా ఈ స్థాయిలో ఆర్థిక భారం తీసుకుని సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఈ నిర్ణయాలు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంకల్పబలాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

డీబీటీ ద్వారా లబ్ధిదారుల చేతులకు నేరుగా ప్రతి నెలా నగదు చేరేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇది దేశంలోనే అతిపెద్ద నగదు బదిలీ సంక్షేమ కార్యక్రమంగా గుర్తింపు పొందడం ఏపీకి గర్వకారణం. మధ్యవర్తులు లేకుండా, అవినీతి లేదా లీకేజీలకు తావులేకుండా –పింఛన్ నేరుగా అర్హుల ఇంటి గుమ్మం వద్దకు చేరుతోంది.

ప్రస్తుతం ఏటా వృద్ధాప్య పింఛన్‌దారులకు రూ.48 వేలు, డయాలసిస్ రోగులకు ఏడాదికి రూ.1.2 లక్షలు, మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు రూ.1.8 లక్షలను ప్రభుత్వం అందిస్తోంది. ఈ సంఖ్యలు కేవలం సాయంగా కానివి.. జీవితాంతం పోరాటం చేస్తున్న వారి భుజంపై ధైర్యంగా పెట్టిన చేయిలాంటివి. "ఈ ప్రభుత్వం మా జీవన గౌరవం తిరిగి ఇచ్చింది" అని పింఛన్ పొందుతున్న వేలాదిమంది పెద్దలు చెబుతారు.

ఇంకా ముఖ్యమైన అంశం ఈ పింఛన్ వ్యవస్థ పార్టీలకతీతంగా అమలవుతోంది. ఇది రాజకీయ పార్టీల ఓటు రాజకీయం కాదు. మానవతావాదం. పేదరికం కళ్ల ముందున్నప్పుడు, పింఛన్ అర్హుడా? ఏ పార్టీకి ఓటేశాడు? అన్నది ప్రశ్న కాదు. అర్హత ప్రమాణాలు నిర్దిష్టంగా ఉండే ఈ వ్యవస్థలో కొన్నిచోట్ల అనర్హులకు లబ్ధి చేరినట్టు ప్రభుత్వం గుర్తించి, వెంటనే సరిదిద్దే చర్యలు చేపడుతోంది. ఈ పారదర్శక ధోరణే సంక్షేమ కార్యక్రమాలకు బలాన్నిస్తుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ నేతలకు చేసిన సూచనలు –పార్టీ నిబద్ధతను స్పష్టం చేయకపోదు. "ప్రజల్లో ఉండండి. వారి సమస్యలు తెలుసుకోండి. పరిష్కారానికి నిలబడండి. మనం చేస్తున్న సేవను ప్రజలకు వివరించండి" అన్న చంద్రబాబు పిలుపు.. పాలనా వ్యవస్థ ప్రజాధారితమై ఉండాలనే తత్వాన్ని తేటతెల్లం చేస్తోంది.

## ఎన్నికల లాభం కోసం వృద్ధుల ప్రాణాలను పణంగా పెట్టిన జగన్ పాలన

2024 సాధారణ ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకున్న ఘోర వాస్తవం ఇప్పటికీ ప్రజల మనసుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తుంది. పింఛన్లు వాలంటీర్ల ద్వారా కాకుండా ప్రభుత్వ సిబ్బంది ద్వారానే పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ స్పష్టంగా ఆదేశించినప్పటికీ, అప్పటి ప్రభుత్వం దాన్ని ప్రచార ఆయుధంగా మార్చుకుంది. వాలంటీర్లు ఉన్నప్పుడే పింఛన్ వస్తుందని అబద్ధాల హడావిడి చేసి, వృద్ధులను, దివ్యాంగులను ఎండలో అటుఇటు తిరిగేలా చేసిన పాపానికి జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పలేదు.

ప్రజా జీవితాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే ఎన్నికల ప్రయోజనాల కోసం వృద్ధుల కన్నీళ్లను చవిచూసింది. పింఛన్ రావడం ఆలస్యమైతే చంద్రబాబునే కారణమని మాయ ప్రచారం చేసి ఓట్ల కోయడమే లక్ష్యంగా పని చేయడం అమానుషం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి అవమానం కూడా. ఈ ఘటనల దారుణ ఫలితంగా 46మంది వృద్ధులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదానికి బాధ్యత ఎవరు? అధికారం కోసం నిస్సహాయుల ప్రాణాలను బలి తీసుకున్న నేత పేరు జగన్ అని ప్రజలు మరచిపోరు.

ఇది ఒక్కటే కాదు. నేడు కూడా తమ పాలనలో వెలుగులోకి వచ్చిన విషపూరిత మద్యం కుంభకోణం నుంచి దృష్టి మళ్లించేందుకు, దివ్యాంగుల పింఛన్లు రద్దు చేస్తున్నారని అబద్ధపు ఆరోపణలు చేసి ప్రజల్లో కలవరపెడుతున్నారు. వైసీపీ పాలనలో అర్హతలేని తమ కార్యకర్తలకు దివ్యాంగ పింఛన్లు ఇచ్చి, నిజమైన అర్హుల నోరుకొట్టిన వాస్తవాన్ని దాచడానికి దీనికంటే మరో నాటకం అవసరం లేకపోయింది. అయితే, ఈసారి ప్రజలు మోసపోరని స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేస్తూ పారదర్శక పరిశీలన నిర్వహిస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించడం ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది. అర్హత ఉన్న ఏ ఒక్క దివ్యాంగుడి పింఛన్ రద్దుకాదని ఆయన స్పష్టంగా చెప్పడం.. వారికిచ్చిన గౌరవం కొనసాగుతుందని స్పష్టమైన హామీ.

## అబద్ధాల రాజకీయం కాదు.. పేదల హక్కులు ముందుండాలి

జగన్ పాలనలో ఐదేళ్ల కాలంలో పింఛన్ల కోసం మొత్తం రూ.84 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ వాస్తవం గాల్లో ఊగే అబద్ధపు ప్రచారాలకు గట్టి సమాధానం నిలుస్తుంది. బడ్జెట్ సంఖ్యలు అబద్ధం చెప్పవు. మోసం చేసే వారు మాత్రమే అబద్ధాలపై రాజకీయాలను నిర్మించేందుకు ప్రయత్నిస్తారు. ఎన్నికల నాటకాల్లో వృద్ధుల బాధను, దివ్యాంగుల కన్నీళ్ళను కూడా ఓట్లు తినే ఆయుధాలుగా మార్చిన పాలనను ప్రజలు ఎప్పటికీ మరవరు.

అదే నేడు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న దిశ పూర్తిగా భిన్నం. చంద్రన్న పాలనలో రావలసిన ఐదేళ్లలోనే పింఛన్ కేటాయింపులను భారీ పరిమాణంలో పెంచి రూ.1,70,000 కోట్లతో ముందుకు సాగుతున్నారు. అంటే పూర్వ ప్రభుత్వ కాలంతో పోలిస్తే రెట్టింపు బడ్జెట్. సంక్షేమానికి మాటలు కాదు –మూలధనం కావాలన్న సత్యాన్నే ఈ ప్రభుత్వం నిరూపిస్తోంది.

ఈ స్థిరమైన ప్రయోజనం కోసం కూటమి ప్రభుత్వానికి అండగా నిలవడం ప్రతి పింఛన్‌దారుడి, ప్రతి కుటుంబసభ్యుడి బాధ్యత. ఎందుకంటే ప్రభుత్వం సృష్టించిన భరోసా నిలబడేనా లేదా కూలిపోతుందా అనేది నేరుగా మన కుటుంబ భవిష్యత్తుతోనే ముడిపడి ఉంది. అర్హులందరికీ పింఛన్లు అందేలా, పేదల హక్కులు కుట్ర రాజకీయాలకు బలైపోకుండా ఉండాలంటే.. ప్రతి పౌరుడూ అప్రమత్తంగా ఉండాలి. ఇది కేవలం ప్రభుత్వ విజయకథ కాదు. ఇది సమాజం గెలుపు. పేదల గౌరవం నిలబడితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

**- సాయి కల్యాణ్,**
**అనలిస్టు**

| | దివ్యాంగులు | కిడ్నీ/తలసేమియా తదితరులు | పూర్తి వైకల్యం |
|---|---|---|---|
| 2014-19 చంద్రన్న పాలనలో | రూ.500 నుంచి రూ.3వేలకు పెంచారు | రూ.5000 | రూ.5000 |
| 2019-2024 జగన్ పాలనలో | ఒక్క రూపాయి కూడా పెంచలేదు | 0 | 0 |
| 2024 చంద్రన్న పాలనలో | రూ.3000 నుంచి రూ.6వేలకు పెంచారు | రూ.5000 నుంచి రూ.10 వేలకు పెంచారు | రూ.5000 నుంచి రూ.15 వేలకు పెంచారు. |

| | కాంగ్రెస్/జగన్ పాలనలో | టీడీపీ పాలనలో |
|---|---|---|
| 1983కు ముందు | పింఛన్లు లేవు | -- |
| 1984 | -- | రూ.30లతో ఎన్టీఆర్ ప్రారంభించారు |
| 1989-94 | కాంగ్రెస్ పాలనలో పింఛన్ పెంచలేదు | -- |
| 1994-2004 | -- | రూ.45లు పెంచి రూ.75 చేసిన చంద్రన్న |
| 2004-14 | రూ.125 పెంచిన కాంగ్రెస్ | -- |
| 2014-19 | -- | రూ.1800 పెంచిన చంద్రన్న |
| 2019-24 | రూ.250 చొప్పున నాలుగు విడతల్లో రూ.1000లు మాత్రమే పెంచిన జగన్. వాయిదాల్లో పెంచడం వల్ల ఒక్కొక్క పింఛన్‌దారు రూ.28 వేలు నష్టపోయారు. | -- |
| 2024 జూలైనుంచి | -- | రూ.1000 ఒకేదఫాలో పెంచిన చంద్రన్న, ప్రారంభంలో బకాయిలతో కలిపి రూ.7వేలు చెల్లింపు. |
| మొత్తం | రూ.1,125 | రూ.2,875 |
| | రూ.4000 | |

# ప్రజలతో మమేకం కావాలి

- పార్టీ కార్యక్రమాలను జనంలోకి తీసుకెళ్లాలి
- బాధ్యతతో పనిచేస్తేనే గుర్తింపు
- సీఎం చంద్రబాబు పాలనా దక్షత, మంత్రి లోకేష్ పోరాట పటిమ స్ఫూర్తితో పనిచేయాలి
- టీడీపీ మండలాధ్యక్షుల శిక్షణా తరగతుల్లో నేతల పిలుపు
- విజయవంతంగా మొదటి రోజు శిక్షణా తరగతులు





అమరావతి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బ్యాక్ బోన్ అని... పార్టీ కష్టకాలంలోనూ కేసులను ఎదుర్కొని ధైర్యంగా నిలబడి పార్టీ బలోపేతానికి కృషి చేశారని మంత్రులు, పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ మండలాధ్యక్షులు 110 మందికి శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులు టీడీపీ మానవ వనరుల అభివృద్ధి విభాగం ఛైర్మన్, శాసనమండలి ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు ఆధ్వర్యంలో జరిగాయి. ఉదయం 6 గంటలకు యోగాతో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వేపాడ చిరంజీవిరావు జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, పల్లా శ్రీనివాసరావు శిక్షణా తరగతుల్లో ప్రారంభోపన్యాసం చేశారు. నాయకుడి నుండి సామాన్య కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ నిత్యం తమను తాము మెరుగుపరుచుకున్నప్పుడే పార్టీ ఒక వటవృక్షంలా ఎదుగుతుందని, దానికి ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయని తెలిపారు. సీఎం చంద్రబాబు పాలనా దక్షత, మంత్రి నారా లోకేష్ పోరాట పటిమ నుండి కార్యకర్తలు స్ఫూర్తి పొందాలని పిలుపు ఇచ్చారు.

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న పాఠాలను తమ గ్రామం, మండలం, రోజువారీ క్షేత్రస్థాయి పనుల్లో ఆచరణలో పెట్టాలని సూచించారు. కార్యకర్తలు చురుగ్గా ఉంటూ, వ్యవస్థీకృతంగా పనిచేస్తూ, నిత్యం ప్రజలతో మమేకమైనప్పుడే పార్టీ అజేయ శక్తిగా మారుతుందని ఉద్బోధించారు.

మండల పార్టీ అధ్యక్షులను నాలుగు గ్రూపులుగా విభజించి పార్టీ నిర్మాణం, పార్టీ సిద్ధాంతం, పార్టీ ప్రస్థానం వంటి విషయాలను వివరించారు. ఈ శిక్షణ తరగతుల్లో మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వ సలహాదారు, ఎంఏ షరీఫ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

**బాధ్యతతో పనిచేస్తే గుర్తింపు: హెూం మంత్రి అనిత**

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ మనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తే మనకు గుర్తింపు అదే వస్తుందని హెూంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. పార్టీ క్రమశిక్షణ, బాధ్యతలు ఎలా నిర్వర్తించాలి, మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం, కార్యకర్తలను ఉత్సాహపూర్వకంగా నడిపించడం వంటి అంశాలను శిక్షణ తరగతుల్లో వివరించారు. ఏ రాజకీయ పార్టీకైనా కార్యకర్తలే బలమని... కానీ కార్యకర్తలకు ఏ రాజకీయ పార్టీ ఇవ్వలేని గౌరవ, మర్యాదలు తెలుగు దేశం పార్టీతోనే సాధ్యమని అన్నారు.

**ఎన్ని సమస్యలు వచ్చినా పార్టీ నిలబడింది: మంత్రి నిమ్మల రామానాయుడు**

1983లో టీడీపీ దేశ రాజకీయాల్లోనే ఒక ప్రభంజనం సృష్టించిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అధికారంలో ఉంటే ప్రజా సంక్షేమం కోసం పాటుపడటం, ప్రతిపక్షంలో ఉంటే ప్రజా సమస్యలపై పోరాటం చేయడం టీడీపీ చరిత్ర. గెలుపు, ఓటములతో పనిలేకుండా నమ్మిన సిద్ధాంతం కోసం బలంగా నిలబడ్డే కార్యకర్తలు టీడీపీకి ఉన్నారు. సామాన్యులను కూడా నాయకులను చేసిన చరిత్ర చంద్రబాబుదని మంత్రి నిమ్మల పేర్కొన్నారు.

**ప్రధానులకు ఎంపిక చేసిన పార్టీ టీడీపీ: కొమ్మారెడ్డి పట్టాభిరామ్**

అన్న నందమూరి తారక రామారావు పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి దేశ రాజకీయాల్లోనే ఒక ప్రభంజనం సృష్టించారని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ అన్నారు. 1984లో లోక్‌సభలో ప్రతిపక్ష హెూదా పాత్రను టీడీపీ సమర్థవంతంగా పోషించింది. ఒక ప్రాంతీయ పార్టీ పార్లమెంట్‌లో ప్రతిపక్ష హెూదా పొందడం దేశ చరిత్రలోనే రికార్డ్. సీఎం చంద్రబాబు యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉండి హెచ్.డి. దేవెగౌడ, ఐ.కె. గుజ్రాల్ వంటి వారిని ప్రధాన మంత్రులుగా ఎంపిక చేయడంలో కీలక పాత్ర వహించారు. జాతీయ రాజకీయాల్లో కింగ్‌మేకర్‌గా నాడు, నేడు చంద్రబాబు అవతరించారు. అలాంటి పార్టీకి మండల స్థాయిలో మీరు పనిచేస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

**దేశంలోనే ప్రత్యేకమైన గుర్తింపు: దేవినేని**

తెలుగుదేశం పార్టీకి ఉన్న చరిత్ర, సంస్థాగత నిర్మాణం మరే ఇతర పార్టీలకు లేదని మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. అలాగే దేశంలో మరే ఇతర ప్రాంతీయ, జాతీయ పార్టీల్లో కూడా పార్టీ క్యాడర్‌కు తెలుగుదేశం పార్టీ ఇచ్చినంత గౌరవం, మర్యాద ఇతర పార్టీలు ఇవ్వలేదు. తాత ఎన్టీఆర్, తండ్రి చంద్రబాబుల రాజకీయ వారసత్వాన్ని పునికిపుచ్చుకొని మంత్రి నారా లోకేష్ పార్టీ కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో 65 లక్షల ఉన్న పార్టీ సభ్యత్వం నేడు కోటి దాటిందంటే అది పార్టీ కోసం లోకేష్ చేస్తున్న కృషికి, ఆయన పట్టుదలకు నిదర్శనం. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూనే ప్రభుత్వ కార్యక్రమాలను చక్కదిద్దుతున్నారని దేవినేని అన్నారు.

**కష్టాల్లోనూ తోడుగా: కాలవ శ్రీనివాసులు**

ప్రభుత్వంలో ఉంటే అధికారాన్ని అనుభవించడం, ప్రతిపక్షంలో ఉంటే ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, పార్టీ క్యాడర్‌ను కలవకుండా మాజీ సీఎంలు కేసీఆర్, జగన్ లు ఫామ్ హౌసులకే పరిమితం అయ్యారని పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యలపై పోరాడారు, పార్టీ కార్యకర్తలకు అండగా ఉన్నారు. నాయకుడంటే కష్టాల్లోనూ తోడుగా నిలబడేవాడు. అలాంటి నాయకుడే మన చంద్రబాబు. అతి సాధారణ కార్యకర్తలు నేడు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, పొలిట్‌బ్యూరో మెంబర్లుగా ఉన్నారంటే అది చంద్రబాబు నాయకత్వ గొప్పతనం. పార్టీ కోసం పనిచేసిన సామాన్యులకు అగ్రతాంబూలం ఇవ్వడం చంద్రబాబుకే సాధ్యం. రిపోర్టర్ స్థాయిలో ఉన్న తనను గుర్తించి సీఎం చంద్రబాబు ఎంపీ టికెట్ ఇచ్చారని కాలవ గుర్తుచేశారు.

**ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**

సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి - ఉచిత బస్సు ప్రయాణాలు, తదితర పథకాలను గ్రామ, మండల స్థాయిలో ప్రజలకు చేరవేయడం, కమిటీల నియామకాలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు వివరించారు. కార్యకర్తల మధ్య ఐక్యత పెంచడానికి రూపొందించిన అంశాలను వివరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మండలాధ్యక్షుల పాత్ర కీలకమని... క్షేత్ర స్థాయిలో పర్యటించి, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

# రైతులపై జగన్ మొసలి కన్నీరు



- ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్నదాతకు అష్టకష్టాలు
- జగన్ ట్వీట్‌కు మంత్రి మండిపల్లి కౌంటర్

అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల పాలనలో రైతులను అష్టకష్టాలు పెట్టిన జగన్ రెడ్డి నేడు వారిపై మొసలి కన్నీరు కారుస్తున్నారని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. రైతులు, వ్యవసాయం గురించి జగన్ చేసిన ట్వీట్‌పై మంత్రి మండిపల్లి స్పందించారు. జగన్ హయాంలో రైతులకు సూక్ష్మ సేద్యం లేదు, ఎరువులు ఏనాడూ సకాలంలో అందించలేదు. పంటల బీమా అస్తవ్యస్తంగా అమలు చేశారు. ఐదేళ్ల పాటు రైతులకు యంత్రాలు, పరికరాలు పనిముట్లు అందించలేదు. ట్వీట్లు చేసి మహానుభావుడు అనిపించుకోవాలనేది జగన్ తాపత్రయం. నేలను నమ్ముకున్న రైతన్నలు జగన్ ట్వీట్లు చూస్తూ కూర్చోరు. ప్రతి చిన్న సమస్యను భూతద్దంలో హలో ఇండియా అంటూ చాటి చెప్పి జగన్ అక్కసు వెళ్లగక్కుతున్నారు. తన హయాంలో రైతులు పంటలను రోడ్డుమీద పారబోసిన సంగతి మర్చిపోయారా. కేజీ టమోటా రూ.2కి పడిపోయి, రైతుల కంటతడి పెట్టినప్పుడు జగన్ ఎక్కడున్నారు. ఆలుగడ్డకి, ఉల్లిగడ్డకు తేడా ఎప్పటికీ జగన్ అర్థం కానట్లే.. రైతుల వాస్తవ పరిస్థితులు కూడా ఎన్నటికీ అర్థం కావు. కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం సమంజసం కాదు. మీ హయాంలో మార్కెట్ యార్డులను అస్తవ్యస్తం చేసి దళారీలు రాజ్యమేలటం అనేది నిజం కాదా? కూటమి ప్రభుత్వం రైతుకు తోడుగా ఉంటుంది. వైసీపీ ప్రభుత్వం రైతులను శత్రువుగా చూసింది. రైతు గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతుపై ప్రేమ చూపించడం, అధికారంలో ఉన్నప్పుడు కరువు ప్రాంతాలను పరదాల చాటున చూడటం జగన్ స్టైల్. రైతులను మోసం చేసిన నాయకుడే దేశానికి బోధనలు చేస్తే మేధావులు, నాయకులు, ప్రజలు నవ్వుతారని మంత్రి మండిపల్లి చురకలు వేశారు.

# అభివృద్ధి, సంక్షేమం జోడుగుర్రాలుగా పాలన

**- పేద ప్రజల ఆనందమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం: హోంమంత్రి అనిత ఉద్ఘాటన**

విజయవాడ (చైతన్యరథం): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి సోమవారం పింఛన్ల పంపిణీలో మంత్రి అనిత పాల్గొన్నారు. అనంతరం తూర్పు నియోజకవర్గంలోని రామలింగేశ్వరనగర్ లో రిటైనింగ్ వాల్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నియోజకవర్గంలో పెన్షన్లు పంపిణీ చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రతి నెల ఏదో ఒక నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నామన్నారు. పెన్షన్ తీసుకునేవాళ్ళు ఆడవారే ఎక్కువమంది ఉన్నారు. భారతదేశంలో ఎక్కువ మొత్తంలో ఫించన్ ఇచ్చేది ఆంధ్రప్రదేశ్ మాత్రమే. అభివృద్ధి-సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. పేద ప్రజల ఆనందమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యం. దిత్వా తుపానుని సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. వర్షాలు వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఎలాంటి తుపాను వచ్చినా ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నాం. విపత్తుల సమయాల్లో ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి అనిత సూచించారు.



# సంక్షేమ పింఛన్లలో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ

- **ఏడాదికి రూ.34 వేల కోట్లు ఖర్చు**
- **గత ప్రభుత్వంలో ఒక్క స్పౌజ్ పెన్షన్ కూడా ఇవ్వలేదు**
- **రాయితీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తున్న కూటమి ప్రభుత్వం**
- **ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

అద్దంకి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని సంక్షేమ ప్రభుత్వం పేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇచ్చేందుకే ఏడాదికి రూ.34 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా అద్దంకి మండలం, మైలవరం గ్రామ పంచాయితీ పరిధిలోని ఏలేశ్వరపాలెంలో సోమవారం నాడు మంత్రి గొట్టిపాటి సామాజిక పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయా... సచివాలయ సిబ్బంది సరిగా ఇస్తున్నారా అంటూ ప్రజల నుంచి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం స్పౌజ్ పింఛన్లను ఒక్కటి కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు లక్ష ఎనిమిది వేల స్పౌజ్ పింఛన్లను మంజూరు చేసినట్లు వివరించారు. సంక్షేమ పథకాల అమలుకు కేరాఫ్‌గా సీఎం చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 65 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్నామన్నారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం



చేశారు. మైలవరం గ్రామ పంచాయితీ పరిధిలో ఒక రైతుకు సబ్సిడీపై ట్రాక్టర్‌ను ఈ సందర్భంగా అందజేశారు. అన్నదాతకు ఉపయుక్తంగా ఉండేందుకు 90 శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు అయితే 100శాతం సబ్సిడీతో కొన్ని వ్యవసాయ పనిముట్లను అందిస్తున్నామని మంత్రి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు చేసి కూడా రైతులకు డబ్బులు ఇవ్వకుండా మొండి చెయ్యి చూపితే., కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ధాన్యం కొనుగోలు డబ్బులను 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

**ప్రభుత్వ విద్యాలయాల్లో మరింత మెరుగైన విద్య....**

అద్దంకి మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 162 మంది విద్యార్థులకు సోమవారం నాడు మంత్రి గొట్టిపాటి సైకిళ్లను ఉచితంగా అందజేశారు. విద్యార్థులకు సైకిళ్లను అందించడంలో ఆర్థిక సహాయం చేసిన NREDCAP, ASSIST సంస్థలను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ASSIST సేవా సంస్థ అద్దంకి నియోజకవర్గం వ్యాప్తంగా సైకిళ్ల పంపిణీకి ముందుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. సైకిళ్ల పంపిణీ సందర్భంగా విద్యార్థులతో మంత్రి గొట్టిపాటి ముచ్చటించారు. ప్రైవేటు విద్యకు దీటుగా, డీఎస్సీ ద్వారా 16,300 మంది వెల్ క్వాలిఫైడ్ ఉపాధ్యాయులను భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేశామని ఆయన తెలిపారు. విద్యార్థులు అందరూ కష్టపడి చదవాలన్నారు. ఉద్యోగాల కోసం పోటీతత్వం పెరిగిందని మంత్రి గుర్తు చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు అందరూ 500పైగా మార్కులు తెచ్చుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు సక్రమంగా పాఠశాలలకు రావడం కోసమే, అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు 5,300 మందికి పైగా ఉచితంగా సైకిళ్లను అందించామని మంత్రి తెలిపారు.

**మరింత నాణ్యంగా మధ్యాహ్న భోజనం...**

విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని మరింత నాణ్యంగా అందిస్తామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి తనిఖీ చేశారు. ఆహార నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆహారం మరింత నాణ్యంగా ఉండాలని మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలును కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుందన్నారు. భోజన నాణ్యతను విద్యార్థుల తల్లిదండ్రులూ పరిశీలించాలని సూచించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో కూటమి నేతలతో పాటు, సైకిళ్ల పంపిణీలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పేదల సేవలో కూటమి ప్రభుత్వం

- **ప్రతి నెలా 1న ఇంటివద్దనే పెన్షన్ అందజేత**
- **హామీ మేరకు రూ.4 వేలకు పింఛన్ పెంపు**
- **గతంలో పెన్షన్ల పేరుతో వంచన చేసిన వైసీపీ**
- **పింఛన్ల పంపిణీలో మంత్రి కొల్లు రవీంద్ర**

మచిలీపట్నం (చైతన్యరథం): పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా పెన్షన్ల పంపిణీని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని 16వ డివిజన్‌లో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణతో కలిసి సోమవారం మంత్రి పెన్షన్లు పంపిణీ చేశారు. పలువురి ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించారు. వారి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద గృహ నిర్మాణానికి మంజూరైన నిధుల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందించడం సంతోషంగా ఉందన్నారు. పేదలకు ఆర్థిక సాయం అందించే విషయంలో కూటమి ప్రభుత్వం తర్వాతే ఎవరైనా అన్నారు. మచిలీపట్నంలో సుమారు 30 వేల మందికి తెల్లవారు జామునే పెన్షన్లు అందించాం. రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల మందికి ఇంటి వద్ద పెన్షన్లు అందించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ప్రతి నెలా సుమారు రూ.2700 కోట్ల రూపాయలు పెన్షన్ల కోసమే ఖర్చు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు సుమారు రూ. 54 వేల కోట్లు పెన్షన్ల రూపంలో పంపిణీ చేశాం. అన్న ఎన్టీఆర్ రూ.30తో పెన్షన్లను ప్రారంభిస్తే దాన్ని తర్వాత రూ.75 చేసిన ఘనత చంద్రబాబుదే. తర్వాత వచ్చిన పాలకులు రూ.200 చేయడానికి పదేళ్లు సమయం తీసుకున్నారు. 2014లో చంద్రబాబు అధికారంలోకి రాగానే రూ.200 పెన్షన్‌ను ఒక్కసారిగా రూ.2000కు పెంచారు. రూ.3000 ఇస్తానని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి విడతల పేరుతో దగా చేశాడు. కానీ కూటమి 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చాక ఒకే సారి రూ.4000 చేశాం. అది కూడా జూన్లో ప్రమాణ స్వీకారం చేస్తే.. ఏప్రిల్ నుండే అమలు చేసి మూడు నెలల బకాయిలు కలిపి జులైలో రూ.7000 చొప్పున అందించాం. అది పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అని మంత్రి రవీంద్ర అన్నారు.



**సూపర్ సిక్స్ సూపర్ హిట్**

పెన్షన్లతో పాటుగా సంక్షేమ పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్ వంటి పథకాలన్నింటినీ సూపర్ సక్సెస్ చేశాం. ప్రజల కోసం ఆలోచించే ప్రజా ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. ఇలాంటి ప్రభుత్వంపై వైసీపీ నేతలు కుట్రలు చేయాలని చూస్తున్నారు. ఈ కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పట్టణాధ్యక్షుడు లోగిశెట్టి స్వామి, కార్పొరేటర్లు సుధాకర్, సమత కీర్తి, నీరజ, నాయకులు గొర్రెపాటి గోపీ



# విశాఖ కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ పర్యాటకానికి కొత్త శోభ చేకూరింది. సుమారు రూ.7 కోట్ల నిధులతో విశాఖ నగరంలోని కైలాసగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విశాఖలో పర్యాటకానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. విశాఖను పర్యాటక రాజధానిగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా తట్టుకునేలా గ్లాస్ బ్రిడ్జి డిజైన్ చేశాం. త్వరలో కైలాసగిరిపై త్రిశూల్ ప్రాజెక్టు కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి 40 ఎంఎం మందం కలిగిన ల్యామినేటెడ్ గాజును వినియోగించారు. జర్మనీ నుంచి దీన్ని దిగుమతి చేసుకున్నారు. ఒకేసారి 500 టన్నుల బరువు మోయగలదు. గంటకు 250 కి.మీ వేగంతో గాలులు వీచినా తట్టుకోగలదు. ఒకేసారి 40 మంది పర్యాటకులు దీనిపైకి ఎక్కి ప్రకృతి అందాలు వీక్షించవచ్చు.

# ఏపీ సినిమాటోగ్రఫీలో నూతన శకం

- గ్లోబల్ బ్రాండ్‌గా నిలుస్తున్న తెలుగు సినిమాలు
- సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా ఏపీని నిలుపుతాం
- సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని ఆవిష్కరిస్తాం
- సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025లో మంత్రి కందుల దుర్గేష్

ముంబయి (చైతన్యరథం): సినిమా షూటింగ్‌లకు, పర్యాటకానికి ప్రధాన కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఒక కొత్త అధ్యాయాన్ని రచిస్తున్నామని ఈ క్రమంలో ఏపీ సినిమాటోగ్రఫీకి కొత్త శకం ఆరంభమైందని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. ముంబయి జుహూలోని జేడబ్ల్యూ మారియట్ హోటల్‌లో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న రెండురోజుల 'సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ – 2025'లో తొలిరోజు సోమవారం మంత్రి కందుల దుర్గేష్ కీలక ప్రసంగం చేశారు. ఏపీలో సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని ఆవిష్కరించడానికి వేగంగా పని చేస్తున్నామని తెలిపారు. ఇది ప్రొడక్షన్ నుండి ఎగ్జిబిషన్ వరకు తెలుగు సినిమా పరిశ్రమను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఒక విజనరీ డాక్యుమెంట్‌గా అభివర్ణించారు. భారతదేశ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో పెట్టుబడులు పెడితే అవసరమైన ప్రోత్సాహం, భరోసా కల్పిస్తామని, కలిసి పనిచేద్దామని ఇన్వెస్టర్లకు మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

### తెలుగు సినిమా - గ్లోబల్ బ్రాండ్

హిందీ తర్వాత భారతదేశంలో తెలుగు సినీ పరిశ్రమ రెండవ అతిపెద్దదిగా నిలిచిందన్నారు. ఇది జాతీయ చలనచిత్ర పరిశ్రమకు దాదాపు 20% వాటాను అందిస్తోందని స్పష్టం చేశారు. 'బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, కల్కి 2898 ఏడీ, పుష్ప సిరీస్ లు, సలార్, ఓజీ' వంటి ప్రపంచ స్థాయి సినిమాలు కథాకథనం, విజువల్ ఎఫెక్ట్స్, నిర్మాణ నాణ్యతలో అద్భుతంగా ఉండి బాక్సాఫీస్ కలెక్షన్లలో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేసి తెలుగు సృజనాత్మకతకు నిదర్శనంగా నిలిచాయని, తెలుగు సినిమాను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చాయని తెలిపారు. తమిళనాడు తర్వాత అత్యధికంగా ఏపీలో 1,103 స్క్రీన్లు ఉన్నాయని, ఈ రంగానికి తమ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు.

### త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాల పునరుద్ధరణ

మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ నేపథ్యంలో ఏపీని దేశంలోనే సినిమా షూటింగ్‌లకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా మారుస్తామని స్పష్టం చేశారు. ప్రొడక్షన్ నుండి ఎగ్జిబిషన్ వరకు పరిశ్రమను బలోపేతం చేసేందుకు సమగ్రమైన కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ'ని త్వరలో ఆవిష్కరిస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ఫిల్మ్ సిటీలు, ఆధునిక స్టూడియోలు, డబ్బింగ్, రీ–రికార్డింగ్ సౌకర్యాలు నిర్మించే వెంచర్లకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుందని భరోసానిచ్చారు. షూటింగ్‌ల కోసం ప్రభుత్వ, బహిరంగ ప్రాంతాల్లో అనుమతులు వేగంగా, పారదర్శకంగా, అవాంతరాలు లేకుండా




లభిస్తాయని వెల్లడించారు. రాష్ట్ర కళాకారులు, సాంకేతిక నిపుణులను గౌరవించేందుకు ప్రతిష్టాత్మక నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను త్వరలో పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

### విస్తృత ప్రయోజనాలు

భారతీయ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ (ఎం అండ్ ఈ) రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి ఏపీ ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. ఏపీలో పర్యాటక, ఆతిథ్య రంగాలకు 'పరిశ్రమ హోదా' కల్పించడం వల్ల అన్ని రకాల రాయితీలకు త్వరితగతిన అర్హత లభిస్తుందని స్పష్టం చేశారు. 2029 నాటికి రూ.25,000 కోట్ల ప్రైవేట్ పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఇప్పటికే దాదాపు రూ.24,000 కోట్ల పెట్టుబడులు సిద్ధంగా ఉన్నాయని, మరో రూ.6,000 కోట్లకు పైగా పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతులు లభించాయని వివరించారు. వేగంగా పెరుగుతున్న జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల డిమాండ్ ను తీర్చేందుకు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 3500 గదులను 50 వేలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా భూమి కొనుగోలు/లీజుపై 100 శాతం స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, అర్హత కలిగిన పర్యాటక ప్రాజెక్టులకు ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీల మినహాయింపును అందిస్తున్నామన్నారు. అంతేగాక ప్రాజెక్ట్ స్థాయిని బట్టి 15 సంవత్సరాల వరకు 100 శాతం స్టేట్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (ఎస్జీఎస్టీ) రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తున్నామని, ఇది నిరంతర ఆదాయ ప్రయోజనాన్ని నిర్ధారిస్తుందని పేర్కొన్నారు. ఎంఎస్‌ఎంఈ ప్రాజెక్టులకు 25% వరకు, భారీ/మెగా ప్రాజెక్టులకు 10% వరకు ప్రత్యక్ష మూలధన రాయితీలు అందుబాటులో ఉన్నాయని, ఇవి ప్రారంభ పెట్టుబడి వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తాయని వివరించారు. అంతేగాక హాస్పిటాలిటీ యూనిట్లకు పారిశ్రామిక రేట్లకే విద్యుత్ అందించబడుతుందని, విద్యుత్ సుంకం నుండి ఐదేళ్ల మినహాయింపు ఉంటుందని తద్వారా నిర్వహణ వ్యయం తగ్గుతుందని మంత్రి దుర్గేష్ వివరించారు.

### గ్లోబల్ హబ్‌గా ఏపీ

ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే 'స్వర్ణాంధ్ర విజన్' తమ లక్ష్యమని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఏఐ, విఎఫ్ఎక్స్, గేమింగ్ వంటి రంగాలకు ఏపీని గ్లోబల్ హబ్‌గా ('ఆంధ్రా వ్యాలీ') మార్చేందుకు భారీగా పెట్టుబడి పెడుతున్నామని వెల్లడించారు. బీచ్‌ల నుండి నదుల వరకు, తీర్థయాత్రల నుండి హిల్ స్టేషన్ల వరకు ఆంధ్రప్రదేశ్ సహజ సౌందర్యం, సాంస్కృతిక వారసత్వాల అద్భుతమైన ప్రదేశాలకు నెలవని మంత్రి దుర్గేష్ వివరించారు. ఆయా ప్రాంతాల్లో పటిష్టమైన "హబ్–అండ్–స్పోక్" మోడల్ ద్వారా అడ్వెంచర్, ఎకో, టెంపుల్, ఫిల్మ్ టూరిజం వంటి 21 థీమాటిక్ సర్క్యూట్‌లలో విభిన్నమైన పెట్టుబడి మార్గాలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ తరుణంలో ప్రపంచ పర్యాటక ప్రచారానికి సినిమాలు అత్యంత శక్తివంతమైన సాధనాల్లో ఒకటిగా భావించి సినిమా, సాంస్కృతిక, పర్యాటక రంగాల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లతో పాటు తాను ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు.

సుస్థిరమైన, పారదర్శకమైన, వ్యాపార అనుకూలమైన పరిపాలన ఏపీ ఆర్థిక వ్యవస్థకు పునాది అన్నారు. బాధ్యతాయుతమైన తమ విజన్‌ను నమ్మే ప్రతి పెట్టుబడిదారుడికి ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు కల్పిస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. భారతీయ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాన్ని 100 బిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడంలో కలిసి పనిచేద్దామని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

### ప్రముఖులతో భేటీ

సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్‌లో భాగంగా మత్రి కందుల దుర్గేష్ ఉదయం సీఐఐ అధికారి సంజయ్ కత్వానీతో భేటీ అయ్యారు. అనంతరం ప్రస్తుత ఏఐ యుగంలో మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం భవిష్యత్తు వృద్ధికి రోడ్‌మ్యాప్‌ను రూపొందించే ప్రతిష్టాత్మక చర్చలో సీఐఐ జాతీయ మండలి సభ్యులు రాజన్ నవానితో పాటు సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ బిజినెస్ హెడ్ నచికేత్ పంత్వైద్య, ఐబీడీఎఫ్ సెక్రటరీ జనరల్ అవినాష్ పాండే, షెమారో ఎంటర్‌టైన్‌మెంట్ సీఈవో హిరెన్ గడా, రేడియో మిర్చి సీఈవో యతీష్ మెహ్రిషి, జేడ్ల్యూ మారియట్ వ్యవస్థాపకులు, సీఈవో బిరెన్ ఘోష్‌లతో కలిసి పాల్గొన్నారు.

అనంతరం మంత్రి దుర్గేష్, పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట కలిసి యూట్యూబ్(ఇండియా) ఎండీ గుంజన్ సోనితో కలిసి చర్చించారు. సినిమా రంగ మౌలిక సదుపాయాల బలోపేతంపై క్యూబ్ సినిమా ఫౌండర్ సెంథిల్ కుమార్, కేంద్ర సమాచార, ఫిల్మ్, బ్రాడ్ కాస్టింగ్ జాయింట్ సెక్రటరీ డా. అజయ్ నాగభూషణ్, భారతీయ నటులు, నిర్మాత ప్రొసెంజిత్ ఛటర్జీ, స్టోరీ రైటర్, ప్రొడ్యూసర్ కె. రవి, ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అభయ్ కుమార్ సిన్హా తదితర ప్యానలిస్ట్‌లకు టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట ఫీచర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అదే విధంగా బేసిక్ ప్లై స్టూడియో, పాప ఫిల్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, పిక్చర్ పర్‌ఫెక్ట్, రాలెట్టా, కల్పవన స్టూడియోస్ ప్రతినిధులతో, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్ మెంట్ పార్క్స్ ఇండస్ట్రీస్ సెక్రటరీ జనరల్ అనిల్ పాద్వాల్, ఇమాజికా వరల్డ్ సీఈవో ధిమంత్ భక్షి, డొమెస్టిక్ బిజినెస్ అండ్ మైస్, థామస్ కుక్ ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఆమన్ మహజన్, తదితర ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, అందిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి దుర్గేష్ వివరించారు.

# పేదల సంక్షేమమే పరమావధి

**- పింఛన్ల పంపిణీలో మంత్రి నారాయణ**



నెల్లూరు (చైతన్యరథం): ఇచ్చిన మాటకు కట్టుబడి, పేద ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ప్రభుత్వం తమదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా సోమవారం నెల్లూరు నగరంలోని 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో పర్యటించిన మంత్రి నారాయణ జోరువానలో సైతం ఇంటింటికీ వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను వందశాతం అమలు చేయడమే కాకుండా చెప్పని పనులను సైతం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా పరిపాలన సాగిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించనప్పటికీ సీఎం చంద్రబాబు అపార అనుభవంతో కేవలం పింఛన్ల కోసమే ఇప్పటివరకు 50వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చించామన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన ఠంచనుగా రాష్ట్రవ్యాప్తంగా 68లక్షల మందికి నిరాటంకంగా పించన్లు అందజేస్తున్నామన్నారు. అదేవిధంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండరు తో పాటు ఉచిత బస్సు ప్రయాణం వంటి అన్ని పథకాలను అమలు చేస్తున్నామన్నారు. త్వరలో మరో వంద అన్న క్యాంటిన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నందన్, ఇతర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రూ.4 వేలు పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ

**నిరుపేదలకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు గొప్పవరం: మంత్రి కొలుసు పార్థసారథి**

నూజివీడు (చైతన్యరథం): దేశంలో అత్యధిక మొత్తంలో.. నెలకు రూ. 4 వేల చొప్పున సామాజిక పింఛన్ అందిస్తున్న రాష్ట్రం మనదేనని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం మర్రిబందం గ్రామంలో ఉదయం 7 గంటలకే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను ఇంటింటికి స్వయంగా వెళ్ళి లబ్ధిదారులకు మంత్రి పార్థసారథి స్వయంగా అందజేశారు. మంత్రికి గ్రామ ప్రజలు, మహిళలు, ఘనస్వాగతం పలికారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన కొన్ని సమస్యలను మంత్రి అక్కడికక్కడే పరిష్కరించారు. కొందరు ఇల్లు కావాలని అడగగా దరఖాస్తులు పెట్టుకుంటే వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నూజివీడు మండలంలో పింఛన్లు, ఇళ్ల స్థలాల అవసరం ఉన్న లబ్ధిదారులను గుర్తించి మంజూరుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి, ప్రతినెల ఇంటింటికి వెళ్ళి నిరుపేద కుటుంబాలకు అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్‌ను వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, పనిచేసే ప్రభుత్వానికి, పనిచెయ్యని ప్రభుత్వానికి తేడాను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఏ ఆదరణ లేక నిరాదరణకు గురైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పట్ల కూటమి ప్రభుత్వానికి మానవతా దృక్పథంతో వ్యవహరిస్తోందన్నారు. గత ప్రభుత్వం హంగుఆర్భాటాలు, రంగులు మీద పెట్టిన శ్రద్ధ.. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులపై పెట్టలేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుపేదల ఇంటికి స్వయంగా వెళ్ళి పింఛన్ల సొమ్మును అందిస్తున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఈ విధంగా చేయలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకపోయినా.. కూటమి ప్రభుత్వాన్ని దీవించిన అన్ని వర్గాలు ప్రజలకు మేలు చేయాలని ఉద్దేశంతోనే అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రానికి మంచి ప్రజాపాలన అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం బటన్ నొక్కి డబ్బులు పంచడమే గొప్ప పని అని ప్రచారం చేసుకుందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధిని రెండు కళ్ళుగా భావిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందన్నారు. పలు భారీ పరిశ్రమలను తీసుకువస్తూ యువతకు ఉద్యోగ కల్పన, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రూ. 6 లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. 16 వేలకు పైగా ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకాలు జరిగాయని తెలిపారు. రానున్న 5 సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

# ప్రభుత్వ వైద్యులుగా ప్రజాసేవ

- అందుకు ప్రతి విద్యార్థి సన్నద్ధం కావాలి
- వైద్యరంగంపై పీఎం, సీఎం ప్రత్యేక శ్రద్ధ
- మెడికోస్‌కు మంత్రి సత్యకుమార్ పిలుపు
- మంత్రిగా నేనూ మెడికల్ స్టూడెంట్‌నేనని వ్యాఖ్య




విజయవాడ (చైతన్య రథం): వైద్య విద్యను పూర్తిచేశాక ప్రభుత్వ వైద్యరంగంలో సేవలందించేందుకు ముందుకు రావాలని వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. నిరుపేదలకు సేవచేసే భాగ్యం ప్రభుత్వ వైద్యరంగంలో కలుగుతుందన్నారు. 'నన్ను డాక్టర్‌ని చేయాలని నా సోదరి తపన పడింది. కానీ ఆరోగ్య మంత్రినయ్యాను. మంత్రి అయ్యాక వైద్యారోగ్య శాఖకు సంబంధించి అనేక విషయాల్ని డాక్టర్లు, ప్రొఫెసర్లు, సిబ్బందినుంచి ఇంకా నేర్చుకుంటూనే ఉన్నాను. నేను కూడా మెడికల్ స్టూడెంట్‌నే...' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ చమత్కరించారు. కృష్ణా జిల్లా చిన అవుట్‌పల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్దార్ధ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ -2025 బ్యాచ్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. వైద్యరంగానికి ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రాధాన్యతనిచ్చారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

సమాజంలో ఏ వృత్తికీ లేనంత గౌరవం, ప్రాధాన్యత వైద్యవృత్తికి ఉందన్నారు. రానురాను వైద్య వృత్తిలో విలువలు తగ్గుతున్నాయని, వ్యాపారమైపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య విద్యనభ్యసించిన మీరంతా అంకిత భావంతో పనిచేయాలన్నారు. వైద్యవృత్తికి మానవతావాదాన్ని, సేవాభావాన్ని అద్ది ఆరోగ్యకరమైన, సంతోషకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడిననాడే వైద్యులకు గౌరవం పెరుగుతుందన్నారు. పదేళ్ల కాలంలో 73,000 ఎంబిబియస్ సీట్లు రావడంలోనూ, పీజీ సీట్లు రెండురెట్లు పెరగడంలోనూ ప్రధాని మోదీ కృషి ఉందన్నారు. అలాగే రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ స్కీంను తీసుకొచ్చి, ఖరీదైన చికిత్సల్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా అందించాలని సీఎం చంద్రబాబు సంకల్పించారన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. ప్రధాని మోడీ దిశానిర్దేశంలో 2047నాటికి అభివృద్ధిలో దేశం రెండో స్థానానికి చేరుకోవడం ఖాయమన్నారు. జీవితంలో వినోదం అవసరమని, వినోదమే జీవితం కాదనే వాస్తవాన్ని నేటి యువత తెలుసుకోవాలని, భారత నిర్మాణంలో యువతే కీలక పాత్ర పోషించాలని మంత్రి హితవు పలికారు. యువత గురుతర బాధ్యతను గుర్తుచేసిన మంత్రి.. వైద్య విద్యార్థుల్ని తన ప్రసంగంతో ఎంతగానో ఉత్తేజపరిచారు

### పునాదుల్లోనే మెడికల్ కాలేజీలు

గత ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అరకొర వసతులు నెలకొన్నాయని, మరికొన్ని కాలేజీలు పునాదులకే పరిమితమయ్యాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ సందర్భంగా దుయ్యబట్టారు. రూ.8,500 కోట్లకు గాను, కేవలం రూ.1550 కోట్లు మాత్రమే గత ప్రభుత్వం ఖర్చుపెట్టిందన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. పేద వైద్య విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యనందించాలన్న ఉద్దేశంతోనే పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

పీపీపీ విధానంలో చేపట్టడం వల్ల గతంలో ఉన్న ఆలిండియా కోట్ల సీట్ల కేటాయింపు ఉండదని, దీంతో 110 సీట్లు అదనంగా రాష్ట్ర విద్యార్థులకు దక్కుతాయన్నారు. ప్రస్తుతమున్న ప్రభుత్వాసుపత్రుల్ని బలోపేతం చేయడంతో పాటు కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను నిర్మిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

డాక్టర్ పిన్నమనేని సిద్దార్ధ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ (మేజర్) ఎమ్మీ భీమేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, సిద్దార్ధ అకాడమీ ప్రెసిడెంట్ మాలినేని రాజయ్య, సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

# సమరానికి సన్నద్ధం - శిక్షణే మన ఆయుధం

## రాజకీయ పాఠశాల ప్రజాస్వామ్యానికి పునాది..

ఒక డాక్టర్ ఆపరేషన్ చేయాలన్నా, ఒక పైలట్ విమానం నడపాలన్నా, చివరికి ఒక చిన్న ఉద్యోగం చేయాలన్నా ఎన్నో ఏళ్ల చదువు, కఠిన శిక్షణ అవసరం. కానీ, దురదృష్టవశాత్తూ కోట్లాది ప్రజల భవిష్యత్తును నిర్ణయించే, దేశాన్ని నడిపించే రాజకీయ నాయకులకు మాత్రం ఎటువంటి అర్హతా ప్రమాణాలు గానీ, అధికారిక శిక్షణ గానీ లేకపోవడం మన వ్యవస్థలోని ఒక పెద్ద వైరుధ్యం. నేటి తరుణంలో రాజకీయ పార్టీలకు, నాయకులకు, కార్యకర్తలకు వ్యవస్థాగతమైన శిక్షణ అత్యంత ఆవశ్యకం.

### మారుతున్న రాజకీయ ముఖచిత్రం

గతంలో రాజకీయం అంటే కేవలం ప్రజాసేవ అనే భావన ఉండేది. కానీ నేడు అది సంక్లిష్టమైన పాలనా ప్రక్రియగా మారింది. చట్టసభల్లో జరుగుతున్న అర్థం లేని గొడవలు, వ్యక్తిగత దూషణలు, సోషల్ మీడియాలో కార్యకర్తల మధ్య జరుగుతున్న అసభ్యకరమైన యుద్ధాలు చూస్తుంటే... రాజకీయ వ్యవస్థలో 'పరిణతి' లోపించిందని స్పష్టమవుతోంది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి 'శిక్షణ' ఒక్కటే మార్గం.

### కార్యకర్తలకు దిశానిర్దేశం

ఏ పార్టీకైనా కార్యకర్తలే వెన్నెముక. కానీ చాలా సందర్భాల్లో వారికి పార్టీ జెండా మోయడం తప్ప, పార్టీ ఎజెండా (సిద్ధాంతం) ఏంటో తెలియడం లేదు. కేవలం భావోద్వేగాలను రెచ్చగొట్టి వారిని వాడుకోవడం కాకుండా, వారికి రాజకీయ విజ్ఞానాన్ని అందించాలి. ప్రజలతో ఎలా మమేకం కావాలి? సోషల్ మీడియాను బాధ్యతాయుతమైన ప్రచార అస్త్రంగా ఎలా వాడాలి? ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు ఎలా తీసుకెళ్లాలి? అనే అంశాలపై కార్యకర్తలకు శిక్షణ ఇస్తే, వారు రాజకీయ రౌడీలుగా కాకుండా, సామాజిక సేవకులుగా తయారవుతారు.

### నాయకత్వానికి సాన

కేవలం ధనబలం, వారసత్వం ఉంటే నాయకులు కాలేరు. చట్టసభల్లో (అసెంబ్లీ/పార్లమెంట్) అడుగుపెట్టే నాయకులకు రాజ్యాంగం, బడ్జెట్ కేటాయింపులు, చట్టాల రూపకల్పనపై కనీస అవగాహన ఉండాలి. అధికారుల నుండి పని రాబట్టుకోవడం, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడం ఒక కళ. ఈ నైపుణ్యాలు అబ్బాలంటే నాయకులకు నాయకత్వ శిక్షణ తప్పనిసరి. సమస్యను వినడం, సహనంతో సమాధానం చెప్పడం వంటివి శిక్షణ ద్వారానే అలవడతాయి.

### సంస్కరణ దిశగా అడుగులు

పాశ్చాత్య దేశాల్లో రాజకీయాల్లోకి రావాలనుకునే వారికి ప్రత్యేక కోర్సులు, స్కూల్స్ ఉంటాయి. మన దేశంలో కూడా ప్రతి రాజకీయ పార్టీ తమ నిధుల్లో కొంత శాతాన్ని 'శిక్షణ, పరిశోధన' కోసం తప్పనిసరిగా కేటాయించాలి. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, ఇది ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగాలి.

### మన దేశంలోనే మంచి ప్రయత్నాలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనైనా, విభజన తర్వాతైనా... రాజకీయ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడంలో తెలుగుదేశం పార్టీ ఒక ప్రత్యేకమైన ఒరవడిని సృష్టించింది. ఒక కార్పొరేట్ సంస్థ తమ ఉద్యోగులకు ఎలాగైతే శిక్షణ ఇస్తుందో, పార్టీ క్యాడర్‌కు కూడా అదే స్థాయిలో శిక్షణ ఇవ్వడం ఆ పార్టీ ప్రత్యేకత

మన తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ శిక్షణ గురించి మాట్లాడితే ముందుగా గుర్తుకు వచ్చేది తెలుగుదేశం పార్టీ. 1982లో ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పుడు చైతన్యం తీసుకువస్తే, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు ఆ చైతన్యానికి 'శిక్షణ'ను జోడించారు. పార్టీ కార్యాలయాన్ని (ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్) కేవలం రాజకీయ చర్చలకే కాకుండా, నాయకత్వ శిక్షణా కేంద్రంగా మార్చారు.

**మహానాడు - ఒక వర్క్‌షాప్:** ప్రతి ఏటా జరిగే 'మహానాడు' కేవలం సభలా కాకుండా, తీర్మానాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించే ఒక పెద్ద వర్క్‌షాప్‌లా జరుగుతుంది.

**టెక్నాలజీలో శిక్షణ:** పార్టీ సభ్యత్వ నమోదు దగ్గరి నుంచి, ట్యాబ్‌ల వాడకం, జూమ్ కాన్ఫరెన్స్‌ల నిర్వహణ, డేటా విశ్లేషణ వంటి సాంకేతిక అంశాల్లో బూత్ స్థాయి కార్యకర్తకు కూడా శిక్షణ ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదే.

**నాయకత్వ పాఠశాల:** నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రజా సమస్యల విశ్లేషణపై తరచూ క్లాసులు నిర్వహించడం వల్ల... తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో విషయ పరిజ్ఞానం ఎక్కువగా కనిపిస్తుంది.

### కేస్ స్టడీగా లోకేష్ పంథా

గతంలో పార్టీ శిక్షణ అంటే మైకుల ముందు ఉపన్యాసాలు దంచడమే అనుకునేవారు. కానీ, తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆ పంథాను పూర్తిగా మార్చేశారు. తన కార్పొరేట్, విదేశీ విద్యా అనుభవాన్ని జోడించి రాజకీయ శిక్షణను 'హైటెక్'గా తీర్చిదిద్దారు.

డేటా ఆధారిత రాజకీయం: కార్యకర్తలకు కేవలం ఉద్వేగం ఉంటే సరిపోదు, చేతిలో సమాచారం (డేటా) ఉండాలని యువనేత లోకేష్ బలంగా నమ్ముతారు. అందుకే కార్యకర్తలకు ట్యాబ్‌లు ఇచ్చి, ఓటర్ల డేటాను ఎలా విశ్లేషించుకోవాలో, పోలింగ్ సరళిని ఎలా గమనించాలో సాంకేతిక శిక్షణ ఇప్పించారు.

**డిజిటల్ సైన్యం (ఐటీడీపీ):** సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను తిప్పికొట్టడానికి యువ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించారు. కంటెంట్ క్రియేషన్, డిజిటల్ క్యాంపెయినింగ్ వంటి అంశాల్లో వారికి మెళకువలు నేర్పించారు.

**వర్చువల్ ట్రైనింగ్:** కోవిడ్ సమయంలో గానీ, ఇతర క్లిష్ట సమయాల్లో గానీ... 'జూమ్' వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా వేల మంది కార్యకర్తలతో ఒకేసారి సమావేశమై, వారికి దిశానిర్దేశం చేయడం లోకేష్ తీసుకొచ్చిన కొత్త సంప్రదాయం.

**పనితీరు మదింపు:** కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగుల పనితీరును సమీక్షించినట్లుగానే... టెక్నాలజీ సాయంతో నాయకుల, కార్యకర్తల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించి (ఐవీఆర్ఎస్, సర్వేల ద్వారా), వెనుకబడిన వారికి మెరుగైన శిక్షణ ఇచ్చే పద్ధతిని ఆయన అమలు చేస్తున్నారు.

పూణెలోని 'MIT School of Government' భారతీయ చాత్ర సంసద్ (Student Parliament) ద్వారా యువతకు రాజకీయ శిక్షణ ఇస్తోంది. ఇలాంటివి ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగాలి.

### శిక్షణ లేకపోతే జరిగే అనర్థాలు..

సర్పంచ్ జం భర్త (ఒష్ట్రవ్రాతీశీఇఎ వాఝునవతీ): గ్రామీణస్థాయిలో మహిళా సర్పంచ్‌లు గెలిచినా, వారికి శిక్షణ లేకపోవడం వల్ల వారి భర్తలే పెత్తనం చెలాయిస్తున్నారు. సరైన శిక్షణ ఇస్తే, ఆ మహిళా నాయకురాలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలదు.

బ్యూరోక్రాట్ల ఆధిపత్యం: ఒక మంత్రికి తనశాఖపై, చట్టాలపై పట్టులేకపోతే, ఐఏఎస్ అధికారులు రాసిచ్చిన స్క్రిప్టును మాత్రమే చదువుతారు. శిక్షణ పొందిన నాయకుడు అయితే, అధికారులను ప్రశ్నించి, ప్రజలకు మేలు జరిగేలా విధానాలను మార్చగలడు.

రాజకీయం అంటే అధికారం చెలాయించడం కాదు, ప్రజలకు జవాబు దారీగా ఉండటం అని నేర్పించ గలిగితేనే మన ప్రజాస్వామ్యం పరిణతి చెందుతుంది. ఆయుధాలు లేని సైనికుడు యుద్ధంలో ఎలా ఓడిపోతాడో, విషయ పరిజ్ఞానం లేని నాయకుడు కూడా పాలనలో విఫలమవుతాడు. అందుకే... రాజకీయాలకు 'క్లాస్' కావాలి, అప్పుడే పాలనలో 'క్వాలిటీ' పెరుగుతుంది. దేశప్రగతికి అది బలమైన పునాది అవుతుంది.

ఎస్‌పీ సాహెబ్
టీడీపీ అధికార ప్రతినిధి



# పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కూటమి లక్ష్యం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



సంతబొమ్మాళి, (చైతన్యరథం): ఒకటో తేదీన పింఛన్ల పంపిణీతో గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు గ్రామంలో ప్రజా సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. 18 నెలలో పింఛన్లు కోసం రాష్ట్ర ప్రభుత్వం 51 వేల కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు.దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పండుగను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని చెప్పారు.పేదల జీవితాల్లో వెలుగులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. స్వయంగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. దివంగత నేత నందమూరి తారకరామారావు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలోనే పింఛన్ల వ్యవస్థ బలోపేతమైందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం పింఛన్ మొత్తాన్ని అందిస్తుందని చెప్పారు. తెలుగుదేశం పార్టీ హయాంలోరూ. 2,875 పెంచగా, గత ప్రభుత్వాలు కేవలం రూ. 1,125 మాత్రమే పెంచాయని విమర్శించారు. జనవరి 1 నుంచీ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నూతన పింఛన్లు మంజూరు చేస్తామని, ప్రతి నెలా ఒకటో తేదీ పేద ప్రజలకు పండుగలా మారిందని అన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులు పెరిగిన పింఛన్లతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు.గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో 2014- 2019 మధ్య కాలంలో నిర్మించిన ఇళ్లకు గత ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని విమర్శించారు. సుమారు రూ. 5 కోట్ల విలువైన పలు అభివృద్ధి, రహదారి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గొదలాం వద్ద వీరభద్రపురం రహదారిని ప్రారంభించారు. అనంతరం అక్కడే ఆర్ అండ్ బి రహదారి, కొల్లిపాడు వద్ద ఆర్ అండ్ బి రహదారి, మలగాం పంచాయతీ, చెరువు గట్టుపేట గ్రామం వద్ద కొల్లిపాడుకు వెళ్లే రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడం జరుగుతుందని వెల్లడించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, మౌలిక సదుపాయాల కోసం రూ.4 వేల కోట్ల రూపాయలతో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి 4 గంటల్లోనే వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో ధాన్యం డబ్బులు కోసం రైతుల నెలల తరబడి వేచి చూసేవారని, కూటమి ప్రభుత్వం 4 గంటల్లోనే వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. గత వైకాపా ప్రభుత్వం భూ సర్వే పేరుతో భూములను తారుమారు చేశారని, ధ్వజమెత్తారు. సక్రముగా సర్వే చేయకపోవడంతో సమస్యలు వచ్చాయని అన్నారు. భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని, సర్వ చేయమని అధికారులకు ఆదేశించడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లపాటు దుర్మార్గమైన పాలన సాగిందని అన్నారు.పార్టీ ఉనికి కోసమే వైసీపీ నాయకుల అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖ అధికారులు, తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో భాగంగా విజయనగరం మండలం గుండాలపేట గ్రామం, పట్టణంలో 25వ డివిజన్ (సున్నపుబట్టీల వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు)లో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు



# సంక్షేమానికి చిరునామా కూటమి ప్రభుత్వం

### పెన్షన్లు పంపిణీలో ఎమ్మెల్యే నజీర్

గుంటూరు, (చైతన్యరథం): ఒకటో తేదీ వచ్చిదంటే అవ్వతాతలు, వితంతువులు, దివ్యాంగుల చిరునవ్వులు కనిపిస్తాయని, ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను వారి ఆత్మ గౌరవాన్ని కాపాడుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక 12 డివిజన్ లోని అహ్మద్ నగర్, ఆరో డివిజన్లోని రాజావారి తోటలో సోమవారం ఉదయం సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ శకం నడుస్తోందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధితోపాటు సంక్షేమం పరుగులు తీస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకునే వారు మరణిస్తే తిరిగి మళ్లీ ఇవ్వడానికి ఆరు నెలలపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. పింఛన్ తీసుకుంటూ భార్యాభర్తల్లో ఒకరు మరణిస్తే స్పౌజ్ కింద భాగస్వామికి మరుసటి నెల నుంచే అందిస్తున్నామని వెల్లడించారు. గత జగన్ ప్రభుత్వంలో నాలుగేళ్లకు కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు ఒక్కసారి పెంచిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చీష్టి, హఫీజ్, అబ్దుల్ సలీం, దుర్గ, బద్రి, యస్ యస్ పి జాద, అన్వార్, గఫార్ పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు పాలనలో రాజధాని అమరావతికి ఆధ్యాత్మిక శోభ

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్



అమరావతి, (చైతన్యరథం): సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారు నివసించే తిరుమలను, భక్తుల విశ్వాసాన్ని నాశనం చేసి వైసీపీ ప్రభుత్వం దేవుడితోనే ఆటలాడిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం ఆగ్రహించడం వల్లే జగన్‌మోహన్ రెడ్డి పార్టీ 11 స్థానాలకు పరిమితమై ప్రజల తీర్పుతో నేలమట్టమైందని ఆయన వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కలిసి తిరుమల ప్రతిష్టను దిగజార్చారని ఆరోపించారు. రూమ్ బుకింగ్ అవకతవకలు నుంచి వీఐపీ దర్శనాల్లో అనుచిత కేటాయింపులు, ప్రసాదం తయారీలో నాణ్యత కోల్పోవడం, లడ్డూలలో కల్తీ నెయ్యి వాడకం, అనుమానాస్పద టెండర్లు వంటి అనేక అక్రమాలు గత ప్రభుత్వ పరిపాలనలో వెలుగు చూసాయని, ఇవి దేవస్థాన పరిరక్షణకు తూట్లు పొడిచే చర్యలని ఆయన గుర్తుచేశారు. తిరుమలలో భక్తుల సంఖ్య పెరిగినా సేవల నాణ్యత ఘోరంగా పడిపోవడం వైసీపీ పాలనలోని భ్రష్టుపట్టిన వ్యవస్థకి నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమలను ఉపయోగించుకోవడం అపరాధమే కాకుండా అపచారం కూడా అని నరహరి వరప్రసాద్ వ్యాఖ్యానించారు. భగవంతుని కోపమే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు తుడిచిపెట్టేయడానికి కారణమైందని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే తిరుమల తిరుపతి దేవస్థాన (టీటీడీ) పరిపాలనలో పారదర్శకత, శుద్ధి, నాణ్యత పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో చోటుచేసుకున్న అవకతవకలను నిర్మూలించేందుకు టెండర్ వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా మార్చి, లడ్డూ తయారీలో నాణ్యత పెంచేందుకు కఠిన నిర్ణయాలు అమలు చేశారు. వీఐపీ దర్శనాల్లో నియంత్రణలు తీసుకొచ్చి సాధారణ భక్తులకు ఎక్కువ అవకాశాలు కల్పించే విధంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించారు. దర్శనం, వసతి, ప్రసాదం వంటి సేవలన్నింటిని డిజిటైజ్ చేసి ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థను బలోపేతం చేశారు. భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాల కోసం కొత్త అతిథి గృహాలు, కాంప్లెక్స్‌లు నిర్మాణం ప్రారంభించడంతో పాటు పాత వసతి గృహాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. గత నెల 27న, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతిలోని వెంకటపాలెంలో రూ. 260 కోట్లతో విస్తరణ పనులకు ప్రారంభోత్సవం చేసి అమరావతిని ఆధ్యాత్మిక రాజధానిగా మలుస్తున్న చంద్రబాబుతిరుమలలో భక్తుల రద్దీ నిర్వహణలో ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి క్యూలైన్‌లను సురక్షితంగా, సమర్థవంతంగా మార్చారు. శ్రీవారి మెట్టల మార్గం భద్రత కోసం అదనపు సిబ్బంది, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ధార్మిక కార్యక్రమాల నాణ్యతను పెంచి, ఆలయ సేవలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. టీటీడీ నిర్వాహక వ్యవస్థలో క్రమశిక్షణ పునరుద్ధరించి, అధికారులను బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకున్నారు. తిరుమల ప్రతిష్టను పునరుద్ధరించడంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు భక్తుల విశ్వాసాన్ని తిరిగి నిలబెట్టి టీటీడీ పరిపాలనలో సమగ్ర సంస్కరణలను బలోపేతం చేస్తున్నారన్నారు.



విజయనగరం పట్టణంలో బాలాజీ జంక్షన్ వద్ద గల సుఖీభవ హాస్పిటల్ క్యాథ్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమములో పాల్గొన్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

# ప్రజాస్వామ్య వ్యవస్థలో మీ సేవలు మైలురాయి కావాలి

## రాజ్యసభ కొత్త ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు శుభాకాంక్షలు



కాకినాడ, (చైతన్యరథం): రాజ్యసభ కొత్త ఛైర్మన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన సీపీ రాధాకృష్ణన్‌కు తెలుగుదేశం పార్టీ తరపున రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ సమావేశంలో మాట్లాడిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో, రాజ్యసభ కార్యక్రమాలకు టీడీపీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అత్యున్నత బాధ్యతను నిర్వర్తించడానికి రాధాకృష్ణన్‌కి ఉన్న విస్తృత అనుభవం, ప్రజాసేవ పట్ల అంకితభావం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలపరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమంపై చర్చలు నిర్మాణాత్మకంగా, సమర్థవంతంగా సాగేందుకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు తెలిపారు. రాధాకృష్ణన్ పదవీకాలం ఫలప్రదంగా, ప్రభావవంతంగా సాగాలని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక కొత్త మైలురాయిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

# యూహెచ్‌సీల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## యూహెచ్‌సీ చైర్మన్ల సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం, (చైతన్యరథం): అర్బన్ హెల్త్ సెంటర్ల (యూహెచ్‌సీ) ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడం జరుగుతోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని 8 యూహెచ్‌సీల చైర్మన్లతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమావేశమయ్యారు. యూహెచ్‌సీల్లో సమస్యలు, ఏమైనా అవరాలు ఉన్నాయోనని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అర్బన్ హెల్త్ సెంటర్లకు చైర్మన్లను నియమించి సౌకర్యాలు మెరుగుపరచడం జరిగిందన్నారు. యూహెచ్‌సీలకు వచ్చే వారి నుంచి అలాగే ప్రజల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని ఆయా యూహెచ్‌సీల చైర్మన్లకు సూచించారు. యూహచ్‌సీలను నిత్యం పర్యవేక్షించి మందులను తనిఖీ చేసి కాలపరిమితి దగ్గర పడే మందులను గుర్తించి ఆ సమాచారాన్ని సంబంధిత అధికారులకు చెప్పాలన్నారు. నిత్యం శానిటేషన్ సక్రమంగా చేసేలా పర్యవేక్షించాలని యూహెచ్‌సీల చైర్మన్లకు సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులకు కానీ, యూసీహెచ్‌సీ, పీహెచ్‌లకు అందిస్తున్న, కల్పిస్తున్న సౌకార్యాల పట్ల ప్రజలు చాలా సంతృప్తిగా ఉన్నారని, రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రి, యూహెచ్‌సీల పట్ల ప్రజలకు నమ్మకం పెరిగి... ఓపీ కూడా బాగా పెరిడగిందన్నారు. వైద్య పరంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో యూహెచ్‌సీల చైర్మన్లు చెల్లుబోయిన సూర్య నారాయణమూర్తి, చొప్పెర్ల భద్రరావు, బుడ్డిగ గోపాలకృష్ణ, రాయుడు గణేష్, బేసరి చిన్ని, అనుసూరి వెంకట శ్రీనివాసరావు, శ్కెలేంధర్ కుమార్ జైన్ పాల్గొన్నారు.



# ప్రతి నెలా రాష్ట్రమంతా పెన్షన్ల పండగ

## వర్షంలో సైతం ఇంటింటికీ కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కాకినాడ, (చైతన్యరథం): ప్రతి నెలలా ఒకటో తేదీ రాష్ట్రంలో పండుగ వాతావరణాన్ని తలపిస్తూ అర్హులైన ప్రతి పౌరుడి ఇంటి వద్దకే పెన్షన్లు చేరే విధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలన కొనసాగిస్తోందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.సోమవారం స్థానిక 30 వ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో వర్షాన్ని లెక్కచేయకుండా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వయంగా పాల్గొని వృద్ధులు, వితంతువులు, వికలాంగుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ మొత్తాన్ని కాకినాడ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, అదనపు కమిషనర్ కేటీ. సుధాకర్, హెల్త్ ఆఫీసర్ పృధ్వి చరణ్ లతో కలిసి అందజేశారు. ఇంటివద్దనే పెన్షన్ అందుకోవడంతో లబ్ధిదారులు భావోద్వేగానికి గురై ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నెలలో ఒకటో తేదీ ప్రజలకు పండుగలా మారిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ గౌరవంగా, ఎవరి ఇబ్బంది లేకుండా ఇంటి వద్దకే పెన్షన్లు అందించే వ్యవస్థను కూటమి ప్రభుత్వం స్థిరపరచిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఉదయం 7 గంటల నుండి 11 గంటలలోపు రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ పంపిణీని పూర్తి చేయడం జరుగుతుందని, పెన్షన్ పంపిణీ కార్యక్రమం పట్ల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బచ్చు శేఖర్, అద్దేపల్లి గంగరాజు, పాబోలు పున్నయ్య, మురళి, పంది లక్ష్మి, చెక్కా రమేష్, వైకుంఠరావు, నాగలక్ష్మి, సుబ్రహ్మణ్యం, వంకాయల కృష్ణ, అపరంజి, నారాయణ, కుమార్, పంది సతీష్, తదితరులు పాల్గొన్నారు.



నగర పంచాయతీ ఐదవ వార్డులో సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా

# పావు కాసూ.. తిరకాసు కూతలు ఆపు!

## మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిపై మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనంద రెడ్డి ఫైర్



మాచర్ల, (చైతన్యరథం): పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ గత ఆదివారం మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, పిన్నెల్లి ఇచ్చిన స్క్రిప్ట్ చదివాడని విమర్శించారు. మాచర్ల గురించి ఏం తెలుసని మాట్లాడావని మహేష్ రెడ్డిని నిలదీశారు. చరిత్ర తెలుసుకొని మహేష్ రెడ్డి మాట్లాడితే మంచిది అని అన్నారు. నాపై చేసిన వ్యాఖ్యలను నువ్వు నిరూపిస్తే రాజకీయంగా తప్పుకుంటాననీ, ఒక అవినీతిపరుడు, దోపిడి దారుడు, విగ్రహాల దొంగ మీ పార్టీకి జిల్లా అధ్యక్షుడు అని గుర్తుంచుకోవాలన్నారు. నరసరావుపేటలో ప్రభుత్వ భూములను బలవంతంగా లాక్కొని కన్వెన్షన్ సెంటర్ కట్టుకొని, కాసు సెంట్రల్ మాల్ కట్టడానికి మీకు అన్ని డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయి అని ప్రశ్నించారు. గురజాలలో అడ్డ దిడ్డంగా దోచుకున్న డబ్బుతో నరసరావుపేటలో కన్వెన్షన్ మాల్ కట్టింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. ఒకప్పుడు మీది పుల్లు కాసు తరువాత అరకాసు ఇప్పుడు నువ్ పావు కాసువి మహేష్ రెడ్డి మహేష్ రెడ్డి అని ఎద్దేవా చేశారు.ఆయన చెప్పేవన్నీ గురువింద సామెతలా ఉన్నాయన్నారు. మాచర్లలో పిన్నెల్లి బ్రదర్స్ చేసిన అకృత్యాలు అంతా ఇంతా కాదు, మహేష్ రెడ్డిని నరసరావుపేట దొంగ అనాలో గురజాల దొంగ అనాలో అర్థం కావడం లేదన్నారు. మా పార్టీలో ఉన్న ఒక డిఫెక్టర్ ద్వారా వెల్దుర్తి జంట హత్యలకు పిన్నెల్లి పురిగొల్పారని ఆరోపించారు. పల్నాడు ప్రశాంతంగా ఉండాలనే మేము ఇప్పటి వరకు శాంతంగా ఉన్నామన్నారు. ఇప్పుడు మాకు అధికారం లేదా, కత్తులు, గొడ్డళ్లు మా దగ్గర లేవా అని ప్రశ్నించారు. మహేష్ రెడ్డి ఇంకోసారి అవాకులు చవాకులూ పేలితే సహించేది లేదనీ, అధికారంలో ఉన్న ఐదేళ్లు మాచర్లలో ఒక్క కొత్త సిమెంటు రోడ్డు అయినా వేశారా అని ప్రశ్నించారు. అర్థంపర్థం లేని అసత్య ఆరోపణలు చేస్తూ కారు కోతలు కూస్తే నాలుక కోస్తామని మాజీ ఎమ్మెల్యే క్యాష్ మహేష్ రెడ్డిని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సాగించిన హత్యాకాండ నీకేం తెలుసనని కాసును ఉద్దేశించి ప్రశ్నించారు. అన్ని వర్గాల పైన పిన్నెల్లి సోదరులు సాగించిన దమనకాండకు అన్ని రుజువులు ఉన్నాయన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంటే నీ సన్నాయి నొక్కులు ఏంటి అని నిలదీశారు.. పిన్నెల్లి సోదరులపై అక్రమ కేసులు పెట్టి ఇరికిస్తున్నారని నువ్వు మాట్లాడటం హాస్యస్పదమన్నారు. ఉన్నావ నరేంద్ర కేసులో ఎరపతినేని శ్రీనివాసరావుని ఎలా ఇరికించారని సూటిగా ప్రశ్నించారు. కాసు కన్వెన్షన్, మెమోరియల్ ట్రస్ట్ పేరుతో నువ్వు చేస్తున్న సామాజిక దోపిడీ, గోల్‌మాల్ అవినీతిపై సీబీఐ, ఈడీ ఎంక్వయిరీ కోరతామన్నారు. పిన్నెల్లి ఒక విగ్రహాల దొంగ అని ఈ దొంగకు సామాజిక దోపిడీదారుడైన కాసుల రెడ్డి తోడయ్యారని ఎద్దేవా చేశారు. మాచర్లలో జరుగుతున్న అభివృద్ధిపై కాసు, పిన్నెల్లి చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దోపిడీ దొంగకు వైసీపీలో జిల్లా అధ్యక్షుడు ఇవ్వటం శోచనీయం విమర్శించారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకొని, ఎవరో ఇచ్చిన స్క్రిప్టు చదవకుండా సత్యం గ్రహిస్తే మంచిదని హితవు పలికారు. ఈ సమావేశంలో నరసరావుపేట శాసనసభ్యుడు చదలవాడ అరవింద్ బాబు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పెన్షన్ల పంపిణీలో దేశానికే ఆదర్శంగా ఏపీ

## పించన్ల పంపిణీలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, (చైతన్యరథం)): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 18నెలల కాలంలో పింఛన్ల పంపిణీలో రికార్డులు సృష్టించి, దేశంలోనే సంక్షేమ పథకాల అమల్లో ఏపీని నెంబర్-1స్థానంలో నిలిపిందని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. అయిదేళ్ల పాలనలో 3లక్షల మంది అర్హులైన వారికి పింఛన్లు ఎగ్గొట్టడం జగన్ చరిత్ర అయితే, 63.25లక్షలమంది పింఛన్లు ఇస్తూ కూడా అర్హులైన ప్రతిఒక్కరికీ న్యాయం చేయాలన్నది చంద్రబాబు సంకల్పం అన్నారు. వినుకొండ నియోజక వర్గంలో బొల్లాపల్లి మండలం వడ్డెంగుంటలో సోమవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛను సొమ్ము మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవీ మాట్లాడుతూ "ప్రజలకు మెరుగైన సంక్షేమ కార్యక్రమాలను అందించడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. 1వ తేదీన ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య 90శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తున్నామన్నారు.

### మరో 3 నెలల్లో ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లు

ఈ సందర్భంగా మరో 3 నెలల్లో ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వబోతుందని, అందుకు ముందు గా రేషన్ కార్డులు జారీ చేస్తోందని తెలిపారు చీఫ్‌విప్ జీవీ. అర్హులైన ప్రతిఒక్కరు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి ఏటా రూ.33వేల కోట్లు పింఛన్లకు ఖర్చు చేస్తున్నామని, గడిచిన 18నెలల్లో 50వేల 763కోట్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం వెచ్చించామన్నారు. గతంలో ఒక్క నెల లేకున్నా పింఛన్ ఇచ్చే వారు కాదని, ఇ ప్పుడు 3నెలలకోసారి తీసుకుని వెసులుబాటు కల్పించామన్నారు.

రూ.210 కోట్లతో వినుకొండ శాశ్వత మంచినీటి పథకం

2019లో వినుకొండకు తీసుకుని వచ్చిన మంచినీటి పథకాన్ని పూర్తి చేయకుండా గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని వాపోయిన చీఫ్‌విప్ జీవీ ఫలితంగానే నాడు తెచ్చిన 161 కోట్ల కేటాయింపు లు మురిగిపోయాయన్నారు. మళ్లీ చంద్రబాబు, మంత్రి నారాయణ సహకారంతో రూ.210 కోట్లు నిధులు తెచ్చామని త్వరలో వినుకొండ పట్టణం దాహార్తి తీర్చుతామన్నారు. వినుకొండ శాశ్వత మంచినీటి పథకం, గ్రామీణ మంచినీటి పథకం అన్నీ పూర్తి చేసి ప్రతి ఇంటికి రక్షిత మం చి నీరు అందిస్తామన్నారు.

### విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం రాగానే మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీ, ప్రతిఊరిలో విలేజ్ క్లీనిక్ ఏర్పాటు విద్యవైద్యంపై తమ ప్రాధాన్యతకు నిదర్శనంగా పేర్కొన్నారు చీఫ్‌విప్ జీవీ. అన్ని ప్రభుత్వ బడుల్లో కావాల్సినంత మంది టీచర్లను పెట్టిన కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దు తున్న మంత్రి లోకేష్ కృషిని అభినందిస్తున్నారని అన్నారు. స్థానికంగా రూ36 లక్షలతో హెల్త్ క్లీనిక్ కూడా ప్రారంభించడం కూడా సంతోషంగా ఉందన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రభుత్వ ఆస్పత్రుల్ల జ్వరం బిళ్లలు దొరకని దుస్థితి నుంచి ఇప్పుడు అన్నీ మార్చుతున్నట్లు తెలిపారు.

### గుంతలు పూడ్చని దుస్థితి నుంచి కొత్తరోడ్లు

గత ప్రభుత్వంలో రోడ్లపై గుంతలు పూడ్చడానికి కూడా నిధులు ఇవ్వలేదని, కూటమిప్రభుత్వం రాగానే 20వేల కి.మీ. రోడ్లు బాగు చేయడం తమ పనితీరుకి నిదర్శనంగా చెప్పారు చీఫ్‌విప్ జీవీ. తాము 18ఏళ్ల క్రిత కలవల చెరువు రోడ్ వేస్తే వైకాపా అయిదేళ్లలో గుంతలు కూడా పట్టించు కోలేదని, ఇప్పుడు మళ్లీ తామే కొత్త రోడ్ వేస్తున్నామన్నారు. గాంధీనగర్ సంఘం నుంచి పలుకూరు వరకు 4.5 కోట్లతో రోడ్ వేసేందుకు నిధులు తీసుకొచ్చి పనులు ప్రారంభించా మన్నారు. బొల్లాపల్లి మండలం కారంపూడి, దుర్గి ఆర్%ు%బీ రోడ్ కోసం కూడా రూ.5కోట్ల నిధులు తీసుకొచ్చామని, ఇలా ఎక్కడ అవసరం ఉంటే ఎక్కడ తప్పక ప్రభుత్వం తరపున రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమాభివృద్ధి సాధనే సీఎం చంద్రబాబు లక్ష్యం

## పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వెల్లడి

పెనమలూరు, (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంతో కోట్లాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేస్తున్నామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పేర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గం తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో 70.78 లక్షల తాడిగడప మున్సిపాలిటీ సాధారణ నిధులతో పోరంకి సర్కిల్ కేసీపీ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్ గారు మాట్లాడుతూ, ప్రజలకు సేవచేస్తే, నాయకులను తమ కుటుంబసభ్యులుగా భావించి గౌరవిస్తారన్నారు.

కష్టపడి పనిచేస్తే కాస్త అలసిపోతామేమోకానీ, ప్రజల ఆదరాభిమానం ముందు ఎంత కష్టమైనా ఇబ్బంది ఉండదని అన్నారు. కూటమిప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆశీస్సులతో ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్న ఆలోచనతో పని చేస్తున్నామన్నారు. పెనమలూరు నియోజకవర్గ పరిధిలో తాడిగడప మున్సిపాలిటీలో గడచిన కూటమి ప్రభుత్వ పాలనలో కోట్లాది రూపాయలు వివిధ శాఖల ద్వారా మౌలిక సదుపాయాలు రోడ్లు డ్రెయిన్లు నిర్మాణం చేయగలిగామని, తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు రవాణా సౌకర్యం ప్రశాంత వాతావరణం ఉండేలా తీర్చిదిద్దే ప్రయత్నానికి ప్రజల సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజల కళ్లల్లో ఆనందం.. వైసీపీ నేతల నేత్రాల్లో నిప్పులు!

## పెన్షన్ల పంపిణీలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు పరిశీలన



చిలకలూరిపేట, (చైతన్యరథం): సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా రూ.55 వేలకోట్ల సాయం పేదలకు అందించడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు రికార్డు సృష్టంచారని, పేదల పక్షపాత ప్రభుత్వం పనితీరు ఎలా ఉంటుందో దేశానికి చూపించారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. పేదల సేవలో భాగంగా సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలోని 30, 31 వార్డులతో పాటు చిలకలూరిపేట మండలం రాజాపేట, నాదెండ్ల మండలం మల్లయ్యపాలెం, యడ్లపాడు మండలం కారుచోల గ్రామాల్లో పర్యటించిన ప్రత్తిపాటి.. తొలుత అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రాజాపేట గ్రామంలో రూ.9.80 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణపనులకు, కారుచోల గ్రామంలో రూ.6 లక్షలతో చేపట్టిన ప్రాథమిక పాఠశాల భవనం మరమ్మతుల పనులకు శంకుస్థాపన చేశారు. తరువాత పేదల ఇళ్లకు వెళ్లిన ప్రత్తిపాటి.. లబ్ధిదారులకు పింఛన్లు అందించి ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన కల్పించారు. అనంతరం పలుచోట్ల ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తొలుత పింఛన్ల అందించిన అనంతరం పట్టణంలో మీడియాతో మాట్లాడారు. మేనిఫెస్టో అమల్లో చంద్రబాబు కూటమిప్రభుత్వాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ లు పట్టువదలని విక్రమార్కుల్లా పనిచేస్తున్నారని, ప్రతి ఇంటికి పెద్దకొడుకుగా అండగా ఉంటానన్న హామీని చంద్రబాబు నిలబెట్టుకున్నారని, మేనిఫెస్టో హామీల అమల్లో కూటమిప్రభుత్వాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని ఈ సందర్భంగా ప్రత్తిపాటి తెలిపారు.. రాష్ట్రంలో 1.40 కోట్ల కుటుంబాలుంటే 67 లక్షల కుటుంబాలకు చంద్రబాబు పింఛన్లు అందిస్తున్నారన్నారు. దేశంలో 28 రాష్ట్రాలుంటే 25 రాష్ట్రాలు రూ.1000 లోపు మాత్రమే పింఛన్లు అందిస్తున్నాయన్నారు. దేశంలో 25 రాష్ట్రాల్లో మాత్రమే రూ.1000 లోపు మాత్రమే పింఛన్లు ఇస్తున్నట్టు చెప్పిన ప్రత్తిపాటి. ఒక్క ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే చంద్రబాబు ప్రభుత్వం పేదలకు రూ.4 వేలకు పైబడి పింఛన్ అందిస్తోందన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, వివిధ రకాల వ్యాధిగ్రస్తులకు రూ.15 వేలకు పింఛన్లు మంజూరు చేస్తోందన్నారు. ఈ నెల పంపిణీతో ప్రభుత్వం రూ. 55వేల కోట్లను పింఛన్ల రూపంలో పేదలకు అందించి చరిత్ర సృష్టించిందన్నారు. మనసులేని నాయకుడు, పేదలకు మంచి చేయడానికి మనసొప్పని నాయకుడు గనుకే జగన్ పింఛన్ల పంపిణీలో ప్రజలకు తీవ్ర అన్యాయం చేశాడని ప్రత్తిపాటి చెప్పారు. తనకు కమీషన్ రాదనే రూ.1000 పింఛన్ పంపిణీని రూ.250 చొప్పున పెంచి నాలుగేళ్లు సాగదీశాడన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా కూటమిప్రభుత్వం పేదలకోసం రూ.50వేల కోట్లకు పైగా పింఛన్ల రూపంలో ఇవ్వడం గర్వించాల్సిన అంశమని నియోజకవర్గ జనసేన ఇన్ ఛార్జ్ తోట రాజా రమేశ్ అన్నారు. మనసున్న నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అమలుచేస్తున్న పథకాలు, రాష్ట్ర అభివృద్ధికోసం పడుతున్న కష్టానికి కేంద్రప్రభుత్వ సహకారాలు ఉండటంపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో గానీ, ప్రజలకు అండగా నిలవడంలో గానీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పనితీరుపై ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, టీడీపీ నాయకులు కందిమల్ల రఘురామారావు , మద్దినేని సుబ్బారావు, మద్దిబోయిన శివ, షేక్ మస్తాన్ వలి, ముల్లా కరీముల్లా, గంజి శ్రీనివాసరావు, పోపూరి వెంకయ్య, మద్దూరి శ్రీనివాస రెడ్డి, వార్డు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, ఎంపీడీవోలు, ఎమ్మార్వో లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభంలోనూ ప్రజలకు సంక్షేమం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే



గిద్దలూరు, (చైతన్యరథం): సంక్షోభంలోనూ ప్రజలకు, సంక్షేమాన్ని అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా కంభం మండలం, లింగోజీపల్లె గ్రామంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఇంటింటికీ తిరిగి, లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించారు. గత 5 ఏళ్లు జగన్ మోహన్ రెడ్డి పెన్షనర్లను దారుణంగా మోసం చేశారని, రూ.1000/- పెంచేందుకు జగన్ రెడ్డికి నాలుగేళ్లు పట్టిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్క సంతకంతో రూ.1000/- పెంచిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కంభం మండల పార్టీ అధ్యక్షులు తోట వెంకట శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డి, సొసైటీ బ్యాంకు చైర్మన్ కేతం శ్రీను, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరెపల్లి మల్లిఖార్జున, లింగోజీపల్లె గ్రామ నాయకులు తాటికొండ వెంకటేశ్వర్లు, కాశయ్య, మండల ఎంపీడీఓ వీరభద్రాచారి మండల తహసీల్దార్ కిరణ్, సచివాలయ సిబ్బంది స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# కోలాహలంగా పెన్షన్ల పంపిణీ

## కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి



కొండపి, (చైతన్యరథం): ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలో టంగుటూరు మండలం, మల్లవరప్పాడు పంచాయతీలో శివపురం గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని వారి చేతుల మీదుగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటుగా అధికారులు కూటమి నాయకులు కూడా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు పంపిణీ జరిగింది.



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో భాగంగా ఒంగోలు నగరంలోని 12వ డివిజన్ మరాఠిపాలెంలో ఇంటింటికి వెళ్లి కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఉడా చైర్మన్ షేక్ రియాజ్, మేయర్ సుజాత స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

# సీఎం సహాయ నిధి పేదలకు సంజీవని

## మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి



నెల్లూరు, (చైతన్యరథం): పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, పేద కుటుంబాలు వైద్యకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అందులో భాగంగా 55 మందికి 41,52,181 రూపాయల చెక్కులు అందచేశారు. సీఎంఆర్ఎఫ్ మంజూరుకు సహకరించిన మంత్రి నారాయణకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు సీఎం సహాయనిధి పేదలపాలిట సంజీవనిగా మరిందన్నారు. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండత అండగా భరోసా కల్పించిందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి ఎంతో సహాయపడుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకొన్న వారందరికీ సహాయనిధి మంజూరు చేస్తున్నారన్నారన్నారు. సిటీ నియోజకవర్గంలో ఏడాదిలో 263 మందికి 2,79,70,395 రూపాయల చెక్కులు అందచేసామని.. పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు గారు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. గతప్రభుత్వం చేసిన అవకతవకలను సరిచేసి పాలనను గాడిలో పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు పాల్గొన్నారు.



తాళ్లూరు మండలం, కొర్రపాటి వారి పాలెం లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి ల పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. డాక్టర్ లక్ష్మీతో పాటు టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, ఎమ్మార్వో వెంకటరమణారావు, ఎంపీడీఓ అజిత, రెవిన్యూ, హౌసింగ్, సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం

## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



సర్వేపల్లి, (చైతన్యరథం): నియోజకవర్గంలో ప్రతి నెలా 38687 మందికి రూ. 16.73 కోట్లు, జిల్లాలో 304117 మందికి 132.44 కోట్లు పింఛన్ల పంపిణీ జరుగుతోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. దేశంలో ఈ స్థాయిలో ప్రజలకు పింఛన్లు పంపిణీ చేసే మరో రాష్ట్రం లేదు ఏపీలో పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చుపెడుతున్నారన్నారన్నారు. వృద్ధులు, వితంతువులు రూ.4 వేలు, దివ్యాంగులు రూ.6 వేలు, మంచానికి పరిమితమైన వారు రూ.15 వేలు చొప్పున పింఛన్ అందుకుంటున్నారన్నారు. మహారాష్ట్ర లాంటి పెద్ద రాష్ట్రంలో పింఛన్ల కోసం కేవలం రూ. 8 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారన్నారు. పేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా సామాజిక పింఛన్లకు సీఎం చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. తెలంగాణలో రూ.2 వేలు, మహారాష్ట్రలో రూ.1,200 తమిళనాడులో రూ.1000, కర్నాటకలో రూ.600 మాత్రమే పింఛన్‌గా అందుతోందన్నారు. దీపం పథకంలో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారన్నారు. స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకంలో రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు కేవలం రూ.13500 మాత్రమే ఇచ్చారన్నారు. వైసీపీ పాలనలో ఒక బిడ్డకు మాత్రమే అమ్మఒడి ఇవ్వగా, కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఎంత మంది బిడ్డలుంటే అందరికీ ఇస్తున్నారన్నారు. గిరిజనులు గతంలో ఒక బిడ్డను మాత్రమే స్కూలుకు పంపే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ఎక్కువ మంది పిల్లలను స్కూలుకు పంపుతుండటం సంతోషదాయకమన్నారు. మత్స్యకారులకు వేట విరామ భృతి గతంలో రూ.10 వేలు ఇస్తుండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భారీ బడ్జెట్ అయినప్పటికీ చంద్రబాబు నాయుడు తన అనుభవంతో ఈ పథకాలన్నింటినీ అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇవ్వడంతో పాటు పింఛన్ల కోసం రూ.2700 కోట్లు పంపిణీ చేయడం ఆషామాషీ కాదన్నారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులు, దళితులు పక్కా ఇంటికి రూ.2.30 లక్షలు ఇస్తుంటే వైసీపీ ప్రభుత్వంలో రూ.1.80 లక్షలకు తగ్గించారన్నారు. కేంద్రం ఇచ్చే నిధులకు మాత్రమే పరిమితం చేసి, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయికి ఇవ్వకపోగా జగనన్న కాలనీల పేరుతో హడావుడి చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక గిరిజనులకు రూ.2.55 లక్షలు, దళితులు, బీసీలకు రూ.2.30 లక్షలకు పెంచారు కొత్తగా 5 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. నాణ్యతతో ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు.

# పేదల పాలిట పెన్నిధి సీఎం చంద్రబాబు

## మార్కాపురం ఎమ్మెల్యే సతీమణి వసంత లక్ష్మి

మార్కాపురం, (చైతన్యరథం): మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి తర్లుపాడు మండలంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలపాలిట ఒక వరమని ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పేషెంట్లకు ఇది చాలా స్వాంతన కలిగిస్తుందని తెలియజేశారు. తర్లుపాడు మండలం తుంబేటి పెద్ద కాశయ్య (తర్లుపాడు)కి 32,100 రూపాయలు, మేకల వెంకట లక్ష్మమ్మ (కలుజువ్వలపాడు)కి 80,185 రూపాయలు, దేశబోయిన రంగప్రసాద్ (మంగళకుంట)కి 92,495 రూపాయలు, బత్తుల అభినవ్ (తుమ్మలచెరువు)కి 40,295 రూపాయలు, మొత్తం 2,45,075 రూపాయలు చెక్కులు పంపిణీ చేశారు.





# కలెక్టర్‌ను కలిసిన దర్శి టీడీపీ నేతలు

## నియోజకవర్గ స్థితిగతులను వివరించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, (చైతన్యరథం): ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కొనసాగించడం ఎంతో మంచి నిర్ణయమని దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ నేతలతో కలిసి సోమవారం సాయంత్రం కలెక్టర్ రాజబాబును మర్యాదపూర్వకంగా కలుసుకొని ప్రత్యేకంగా ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించి పాలన సౌలభ్యం కోసం ప్రకాశం జిల్లాలో దర్శి కొనసాగించడం దర్శి అభివృద్ధిలో ఒక మైలురాయిగా డాక్టర్ లక్ష్మీ ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలు నిధుల మంజూరు, వివిధ శాఖలో పోస్టు ల భర్తీ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి మార్కెట్ యాడ్ చైర్మన్ దారం నాగవేణ, సుబ్బారావు, రాష్ట్ర కళాపరిషత్ డైరెక్టర్ ఓబుల్ రెడ్డి, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు చిన్నా, టీడీపీ నాయకులు ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహణ కార్యదర్శి మనం రమేష్, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, తెలుగు యువత కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

# సంక్షేమాభివృద్ధి సాధకుడు సీఎం చంద్రబాబు

## మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



మైదుకూరు, (చైతన్యరథం): మున్సిపాలిటీ 11 వ వార్డు సర్వాయపల్లెలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికీ తిరుగుతూ వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, డయాలసిస్ పేషెంట్లకు, ఇతర లబ్ధిదారులకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ డబ్బులు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ డబ్బులను పెంచి పేదలకు, పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉంటూ భరోసా ఇస్తోందని ఆయన అన్నారు. డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు గతంలో ఉన్న రూ.5 వేల ను రూ.10000కి పెంచి, వారి చికిత్స కొరకు ఇతర అవసరాల కోసం సహాయం అందిస్తున్న కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం వెయ్యి పెంచడానికి 5 సంవత్సరాల సమయం తీసుకున్నారు. గతంలో 1 నెల పెన్షన్ తీసుకోకుంటే వచ్చే నెలలో 2 నెలల పింఛన్ డబ్బులు ఇచ్చేవాళ్ళు కాదని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1 నెల పింఛన్ల డబ్బులు తీసుకోకపోయినా 2 నెలలు తీసుకోకపోయినా, 3 నెలలు కలిపి ఒకేసారి మొత్తంగా పెన్షన్ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనన్నారు. అంతేగాక పెన్షన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే భార్యకు పెన్షన్ ఇవ్వకుండా వితంతు మహిళలకు చేయూతనివ్వకుండా గత వైసీపీ ప్రభుత్వం మోకాలడ్డిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం స్పోజు పెన్షన్ పథకం క్రింద మరుసటి నెలలో వితంతు పింఛన్ మంజూరు చేసి, వితంతు మహిళలను ఆర్థికంగా ఆదుకుందన్నారు.

# సనాతన ధర్మంలో అన్న సమారాధన అత్యంత కీలకం



అమరావతి, (చైతన్యరథం): సనాతన ధర్మంలో అన్న సమారాధనను మించిన సేవా కార్యక్రమం మరొకటి లేదని, సనాతన ధర్మంలో అన్న సమారాధనకు ప్రముఖ భూమిక ఉండటం జరిగిందని అయ్యప్ప సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సిరిపురపు శ్రీధర్ తెలియజేశారు. రాష్ట్ర అయ్యప్ప సేవా సమాఖ్య ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో 4/4 అరండల్ పేట శ్రీ హంపి విరూపాక్ష పీఠ పాలిత శివాలయము నందు అయ్యప్ప స్వాములకు, దీక్షా స్వాములకు 41 రోజులు పాటు నిత్య అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త ఏక ప్రసాద్ తో ప్రారంభింపజేశారు. అయ్యప్ప సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సిరిపురపు వెంకట శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో గత 22 ఏళ్లుగా ఈ "అన్న సమారాధన" కార్యక్రమాన్ని హంపి విరూపాక్ష పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామివారి ఆశీస్సులతో జరుపుతున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సిరిపురపు శ్రీధర్ మాట్లాడుతూ అన్ని భగవత్ దీక్షలలో కఠినమైన దీక్ష అయ్యప్ప దీక్ష అని, ఎంతో శ్రమ, ప్రయాసలతో మండల కాలం(41రోజులు) పాటు అయ్యప్పలు విధిగా దీక్ష నిర్వహించాలని, ఆ సమయంలో దీక్షాదారులు ఎంతో మనశ్శాంతితోను, ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకుంటూ, ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని జీవిత కాలమంతా ఒక క్రమశిక్షణ మైన జీవితాన్ని అలవాటు చేసుకుంటారని అన్ని ఆరాధనలో "అన్న సమారాధనను" మించిన మహత్తరమైన సనాతన ధర్మ కార్యక్రమం ఈ ప్రపంచంలో వేరొకటి లేదని ఈ అన్న సమారాధన పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైనదని, అన్న సమారాధనకు వచ్చే భక్తులను భగవంతునిలా భావించాలని, కుల,మత జాతి వర్గాలకు అతీతంగా, దేశ,విదేశాల్లో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామిని భక్తులు ప్రపంచవ్యాప్తంగా దీక్షలు తీసుకొని అయ్యప్ప స్వామిని పూజిస్తారని, ఇలా ఎక్కడా సాధ్యపడదని, ఇది ఒక అయ్యప్ప భక్తులకు మాత్రమే సాధ్యమని, మండలదీక్ష కాలంలో ఇండ్లలో కుదరని వారి కోసం,ఇబ్బంది పడే వారి కోసం గుంటూరు అరండల్ పేట 4/4 శివాలయంలో దాతల సహకారంతో ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి 41 రోజులపాటు మధ్యాహ్నం సద్ది,రాత్రి భిక్షా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని శ్రీధర్ తెలియజేశారు. ఈ అన్న సమారాధన డిసెంబర్ 1 నుండి జనవరి 10 వరకు దీక్షా దారులు వినియోగించుకోవాల్సిందిగా శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాదు, అర్చకులు కుందుర్తి సుబ్రహ్మణ్యం, భాస్కర్ శర్మ, శ్రీనివాస్ మరియు నిత్య దాతలు డి.యస్.బాబు, బోయపాటి అరుంధతి, మన్నవ మేఘన ,రేజేటి సతీష్, పెరుమాళ్ళ సాయి శ్రీనివాస్ సురేష్, పోలినేని ప్రసాద్, మిట్టపల్లి రాజేంద్ర బాబు, పెద్ది శ్రీనివాస్, ధనేకుల మోహన్, వడ్లమూడి రాంప్రసాద్, మేడేపల్లి రాము, మటుపల్లి సుబ్బారావు, సంగం శ్రీనివాస్ రెడ్డి, దేవరశెట్టి సురేష్, అట్ల జయభారత్రెడ్డి, పులివర్తి రాము, డప్పు నాగేశ్వరావు, శబరి,నాని, బాజీ,ఫణి, శ్రీను తదితరులు పాల్గొన్నారు



రొద్దం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులతో కలసి ఉచిత బస్సు ప్రయాణం గురించి , అభిప్రాయాలు అడిగి తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత



జీవకోనలో ఇంచార్జీ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీజీబీసీ చైర్మన్, తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ



నెల్లూరులో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, 47 డివిజన్ ఇంఛార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో జోరు వానలోనూ ఇంటింటికీ వెళ్ల పెన్షన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

# సంక్షేమాభివృద్ధికి చిరునామా సీఎం చంద్రబాబు పాలన

## పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా

విజయవాడ, (చైతన్యరథం): సెంట్రల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్ కస్తూర్బాయ్ పేట, అంబేద్కర్ కాలనీ రెడ్ సర్కిల్, 26 వ డివిజన్ చుట్టుగుంట ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు లబ్ధిదారులకు ఇంటికే వెళ్లి వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఆరోగ్య నిమిత్తం ఇచ్చే "ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు" పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 1,10,000 నూతన వితంతు పెన్షన్లను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల్లో తన నిబద్ధతను చాటుకుంటోందన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ, సంక్షేమ కార్యక్రమాలను విస్మరించకుండా పేద, అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలను ఉన్నతం చేయడానికి కూటమి ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తుందన్నారు. భారతదేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా, ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు పెన్షన్‌లు అందిస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం, అధికారంలోకి రాగానే పెన్షన్‌ను 4000 రూపాయలకు పెంచామన్నారు. మాట ఇచ్చినట్లుగా, మొదటి నెల నుండే పెన్షన్‌లు పెంచి, నాలుగు వేల రూపాయలు ఇస్తున్నామన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే పెన్షన్‌దారులు ఇంటి దగ్గరకి కాకుండా, కార్యాలయాలకు వెళ్ళవలసి వస్తుందని చాలామంది భావించారని, కానీ ఉదయం 6:00 గంటలకే ఇంటి దగ్గరకే పెన్షన్‌లు వస్తున్నాయని తెలిపారు. వృద్ధులు, వితంతువులకు 4000 రూపాయలు, వికలాంగులకు 6000 రూపాయలు, అలాగే బెడ్-రిడెన్ అయిన వారికి 10,000 రూపాయలు, తలసేమియా బాధితులకు 15,000 రూపాయలు పెంచి ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. ఈ చర్య పేదలు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులలో ఆత్మవిశ్వాసాన్ని, నమ్మకాన్ని పెంచిందన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ఒక నియోజకవర్గంలో ప్రజలను కలిసి, అక్కడే పెన్షన్‌లు అందించడం అనేది చరిత్రలో దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి 30,600 కోట్ల రూపాయల పెన్షన్‌లు అందిస్తున్నామన్నారు. ఈ 18 నెలల్లో ఇప్పటివరకు 50,000 కోట్ల రూపాయలు పెన్షన్ల రూపంలో ప్రజలకు అందించిన ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేదన్నారు. 200 రూపాయలు ఉన్న పెన్షన్‌ను 4000 రూపాయలకు పెంచిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు అండగా నిలుస్తూ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అధికారాన్ని ఒక బాధ్యతగా స్వీకరించి, ప్రతినెల 1వ తేదీన పెన్షన్‌లు అందిస్తున్నామన్నారు. 24వ డివిజన్‌లో, డివిజన్ పార్టీ అధ్యక్షుడు జడ దుర్గారావు, మురళి మక్కిస్తా అప్పారావు, డివిజన్ నాయకులు మా దుర్గ, మన ప్రభు, రాజు తో కలిసి అంబేద్కర్ సర్కిల్‌లోని అంబేద్కర్ కాలనీలో పెన్షన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు దేవతోటి నాగరాజు, జగదీశ్వరి, 26వ డివిజన్ ఇంచార్జ్ వల్లభనేని సతీష్, ఇజ్జడ దుర్గారావు, గడ్డం రాజు, గాజుల రవి, తోట పాండు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# కుట్రదారు.. హసీనాయే!

- బంగ్లా రైఫిల్స్ తిరుగుబాటుపై దర్యాప్తు కమిషన్
- నివేదికలో భారత్‌పైనా తీవ్ర ఆరోపణలు

బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణ శిక్ష వేసిన విషయం తెలిసిందే. కాగా 16 ఏళ్ల క్రితం బంగ్లాదేశ్‌లో జరిగిన రైఫిల్స్ తిరుగుబాటు వెనుక హసీనా ఉన్నట్టు ఆ ఘటనపై దర్యాప్తు చేస్తున్న కమిషన్ తాజాగా ఆరోపించింది. నాడు హసీనాయే స్వయంగా తిరుగుబాటుకు ఆదేశించారని విచారణలో తేలినట్టు పేర్కొంది. 2009లో జరిగిన తిరుగుబాటు సమయంలో బంగ్లా ఆర్మీని బలహీనపర్చేందుకు భారత్ యత్నించిందని కమిషన్ ఆరోపించింది. దీనిపై ఆంగ్లపత్రిక ఏఎఫ్‌పీ వెలువరించిన కథనాన్ని కమిషన్ ప్రస్తావించింది. హసీనా రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత.. 2009లో బంగ్లాలో జరిగిన రెండు రోజుల తిరుగుబాటులో అగ్ర సైనిక అధికారులతో సహ 74మంది మరణించారు.



గతేడాది హసీనా స్వదేశాన్ని వీడిన అనంతరం ఏర్పాటైన యూనస్ ప్రభుత్వం బంగ్లాదేశ్ రైఫిల్స్ తిరుగుబాటుపై దర్యాప్తునకు ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ తిరుగుబాటుపై విచారణ చేసిన కమిషన్ తాజాగా తన నివేదికను విడుదల చేసింది. అందులో హసీనాపై ఆరోపణలు చేసింది. అప్పటి అవామీ లీగ్ ప్రభుత్వ నేతలు కూడా తిరుగుబాటులో ప్రత్యక్షంగా పాల్గొన్నట్టు పేర్కొంది. హసీనా ఆదేశాలతో మాజీ ఎంపీ ఫజ్లే నూర్ తపోష్ దీనిని ముందుండి నడిపించినట్టు వెల్లడించింది. ఆ సమయంలో జరిగిన హత్యలకు హసీనాయే కారణమని ఆరోపించింది.

**భారత్‌పై ఆరోపణలు**

రైఫిల్స్ తిరుగుబాటు సమయంలో హసీనాకు మద్దతుగా నిలిచిన భారత్.. బంగ్లాలో అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నించినట్టు కమిషన్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఆ సమయంలో 921మంది భారతీయులు ఢాకాకు వచ్చారని.. వారిలో 67మంది ఎక్కడున్నారో ఇప్పటికీ తెలియరాలేదని పేర్కొంది. వీటిపై భారత్ ఇంకా స్పందించలేదు. విద్యార్థుల ఆందోళనలతో అనూహ్యరీతిన ప్రధాని పీఠంనుంచి దిగిపోయిన షేక్ హసీనా గతేడాది ఆగస్టు 5న బంగ్లాదేశ్‌ను వీడి భారత్‌కు వచ్చారు. నాటినుంచి ఆమె ఢిల్లీలోని ఓ రహస్య ప్రదేశంలో నివసిస్తున్నారు. ఆమె పలు కేసుల్లో దోషిగా ఉన్నందున తిరిగి బంగ్లాకు అప్పగించాలని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం పలుమార్లు భారత్‌ను కోరింది.

# నల్లులూ.. నేరపరిశోధన గూఢచారులే!

### ఈ కోణంలో మలేసియా శాస్త్రవేత్తల బృందం పరిశోధన

నల్లులే నేర పరిశోధనకు గొప్ప డిటెక్టివ్‌లు అంటున్నారు. మలేసియా శాస్త్రవేత్తలు. అందులో భాగంగానే -మచ్చిక చేసుకున్న నల్లులపై పరిశోధనలు కావిస్తున్నారు. సరిగ్గా ఆలోచిస్తే.. భవిష్యత్తులో అనేక నేరపరిశోధనల్లో ఇవి కీలక గూఢచారులుగా మారే అవకాశముందని, వాటి సాయంతో ఎన్నో కేసులను ఛేదించవచ్చని వీరు నమ్ముతున్నారు. నేరం జరిగినచోట నల్లులుంటే.. బాధితులు లేదా అనుమానితులను గుర్తించేందుకు సహకరిస్తాయన్న కోణంలో ఉత్తర పెనాంగ్‌లోని సైన్స్ యూనివర్సిటీ ఆఫ్ మలేసియా బృందం పరిశోధనలు జరుపుతోంది. యూఎస్ఎం స్కూల్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్ ప్రయోగశాలలో తమ బృందం చాలా ఏళ్లు నల్లులపై అధ్యయనం చేసినట్టు శాస్త్రవేత్త అబ్దుల్ హాఫిజ్ అబ్ మజీద్ పేర్కొన్నారు. నల్లులు మానవుల నుంచి రక్తాన్ని పీల్చిన దాదాపు 45 రోజులవరకు వారి డీఎన్ఏ నల్లుల్లో ఉన్నట్టు పరిశోధనలో గుర్తించారట. రక్తాన్ని పీల్చకపోయినా నిందితులు వాడిన దుప్పట్లు, మంచాలు, దిండులపైన అవి తిరిగినా వారి డీఎన్ఏ నల్లుల్లో ఉంటుందన్నారు.. కొన్ని కేసుల్లో బాధితులు లేదా నిందితుల ఆచూకీ



తెలియనప్పుడు వారుండే స్థలంలో నల్లులుంటే.. వాటినుంచి సేకరించిన డీఎన్ఏ ద్వారా ఎవరనేది గుర్తించవచ్చన్నారు. సాధారణంగా నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ఘటనా స్థలంలోని రక్తపు మరకనుంచి సేకరించిన డీఎన్ఏ ద్వారా నిందితులు, బాధితులకు సంబంధించిన కొన్ని వివరాలను గుర్తిస్తారు. అదేవిధంగా నేర స్థలంలో ఉన్న నల్లుల్లో ఉన్న డీఎన్ఏ ద్వారా బాధితులు లేదా నిందితుల జెండర్, కంటి రంగు, జుట్టు, చర్మం రంగువంటి విషయాలు బయటపడతాయన్నారు. దోమలు, ఈగల మాదిరిగా నల్లులు ఎగరలేవని.. మనుషుల నుంచి ఒక బిందువు పరిమాణంలో రక్తాన్ని పీల్చగానే వాటి కడుపు నిండిపోతుందని శాస్త్రవేత్త తెలిపారు. దీంతో అవి ఎక్కువదూరం కదలలేకపోతాయన్నారు. అందువల్లే నిందితులను గుర్తించడంలో నల్లులు కీలకంగా మారుతాయని తెలిపారు. ఇవి దుప్పట్లు, దిండులలో దాక్కొని ఉంటాయి కాబట్టి, నిందితులకు సాక్ష్యాలను నాశనం చేసే అవకాశం కూడా ఉండదని పరిశోధనా బృందం విశ్లేషిస్తోంది.

### చరిత్ర సృష్టించిన తుర్కియే..

# మానవరహిత ఫైటర్ జెట్‌నుంచి బీవీఆర్ ప్రయోగం

తుర్కియేకు చెందిన ప్రైవేటు రక్షణరంగ సంస్థ బెయికార్ సంచలనం సృష్టించింది. మానవరహిత ఫైటర్ జెట్‌నుంచి ప్రయోగించిన బియాండ్ విజువల్ రేంజ్ (బీవీఆర్) మిసైల్‌తో గగనతలంలోని మరో జెట్ ఇంజన్ ఆధారిత విహంగాన్ని ధ్వంసం చేసింది. రాడార్ ద్వారా టార్గెట్‌ను ట్రాక్‌చేసి మరీ అత్యంత కచ్చితత్వంతో ఛేదించింది. మానవసహిత ఫైటర్ జెట్లకు మాత్రమే సాధ్యమయ్యే ఈ ఫీట్‌ను విజయవంతంగా పూర్తిచేసి సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. సినోప్ ఫైరింగ్ రేంజ్ ప్రాంతంలో కిజిలెల్మా అనే మానవరహిత ఫైటర్ జెట్ ద్వారా ఈ ప్రయోగం నిర్వహించారు. వాస్తవానికి కిజిలెల్మా.. జెట్ ఇంజెన్ ఆధారంగా నడిచే డ్రోన్. అయితే, సాధారణ మానవసహిత ఫైటర్ జెట్ సామర్థ్యాలు అనేకం దీని సొంతం. ఇక తాజా ప్రయోగంలో ఈ జెట్ ప్రయోగించిన గోక్డోగాన్ మిసైల్.. రాడార్ సాయంతో లక్ష్యాన్ని గుర్తించి ధ్వంసం చేసింది. ఫైటర్ జెట్‌లోని అసెల్సాన్ మురాద్ రాడార్ సాయంతో లక్ష్యాన్ని ట్రాక్ చేశారు. అచ్చు మానవ సహిత ఫైటర్ జెట్‌ల తరహా సామర్థ్యం కిజిలెల్మాకు ఉన్నట్టు ఈ ప్రయోగంతో స్పష్టంగా



నిరూపితమైంది. విశ్లేషకులు చెప్పేదాని ప్రకారం, శత్రుదేశాలకు చిక్కకుండా ఉండే సామర్థ్యంలో ఈ ఫైటర్ జెట్ ఇప్పటికే టాప్‌లో ఉంది. బియాండ్ విజువల్ రేంజ్ మిసైల్‌తో గగనతలంలోని లక్ష్యాన్ని ఛేదించడంలో తాజాగా విజయం సాధించింది. వైమానిక యుద్ధ రీతుల్లో ఇదో కొత్త అధ్యాయం. ఇక ఈ ఫైటర్ జెట్‌తో గుట్టుచప్పుడు కాకుండా శత్రుదేశాల గగనతల లక్ష్యాలను టార్గెట్ చేయొచ్చు. ఫైటర్ జెట్స్‌కు 40 కిలోమీటర్లకు మించి దూరాన ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేసే మిసైల్స్‌ను రక్షణ రంగ పరిభాషలో బియాండ్ విజువల్ రేంజ్ మిసైల్స్ అని పిలుస్తారు. అత్యాధునిక బీవీఆర్ మిసైల్స్ 100-150 కిలోమీటర్ల దూరంలోని గగనతల లక్ష్యాలను కూడా ఛేదించగలవు.

డ్రోన్ తయారీలో అగ్రగామిగా ఉన్న బెయికార్ సంస్థ 2023లో ఎగుమతుల ద్వారా ఏకంగా 1.8 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. సంస్థ ఆదాయంలో 90 శాతం వాటా ఎగుమతులదే. గత నాలుగేళ్లుగా తుర్కియేలో టాప్ రక్షణ, ఎయిరోస్పేస్ రంగ సంస్థగా బెయికార్ నిలిచింది.

### నా సహజీవన భాగస్వామికి

## భారతీయ మూలాలు: ఎలాన్ మస్క్



టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ తన కుటుంబం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తన సహజీవన భాగస్వామికి భారతీయ మూలాలున్నాయని స్పష్టం చేశారు. అలాగే తన కుమారుడి పేరులో శేఖర్ పదం ఉందని పేర్కొన్నారు. జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్ 'డబ్ల్యుటీఎఫ్ ఈజ్'లో తన వ్యక్తిగత జీవితం గురించి ఎలాన్ మస్క్ మాట్లాడారు. "మీకు తెలుసో లేదో కానీ నా సహజీవన భాగస్వామి శివోన్ జిలిస్‌కు భారతీయ మూలాలున్నాయి. ఆమెను చిన్న వయసులో దత్తతకు ఇచ్చారు. కెనడాలో పెరిగింది. ఇక, భారతీయ అమెరికన్ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ గౌరవార్థం నా కుమారుడి పేరులో శేఖర్ అనే పదం చేర్చాను" అని మస్క్ వెల్లడించారు. యేల్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన శివోన్.. 2017లో మస్క్ ఆధ్వర్యంలోని న్యూరాలింక్ ప్రాజెక్టులో చేరారు. ఆ ప్రాజెక్టు కింద మానవ మెదడులో ఎలక్ట్రానిక్ చిప్‌ను అమర్చే ప్రయోగాలు చేస్తున్నారు. ఆ సంస్థలో ఆమె డైరెక్టర్ హోదాలో ఉన్నారు. మస్క్-శివోన్‌కు నలుగురు సంతానం. ఇక, ఇదే పాడ్‌కాస్ట్‌లో మస్క్ అపార ప్రతిభగల భారతీయులను నియమించుకొని కొన్నేళ్లుగా అమెరికా చాలా ప్రయోజనాలను పొందిందని వ్యాఖ్యానించారు. వలసలు, వీసాల దుర్వినియోగం, అమెరికాలో స్థిర నివాసం తదితర విషయాలపై ఇటీవల కాలంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న తరుణంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## యూఎస్ వర్సిటీలకు భారీ ఆదాయ కోత

### ట్రంప్ ఎఫెక్ట్‌తో విలవిల్లాడుతున్న వర్సిటీలు



అమెరికాలో ఆగస్టు -సెప్టెంబరు ఫాల్ సీజన్‌లో అంతర్జాతీయ విద్యార్థుల రాక భారీగా తగ్గింది. దీంతో యూనివర్సిటీల ఆదాయంలో బిలియన్ డాలర్ల మేర కోత పడుతుందని కొన్ని నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి. అమెరికా విదేశాంగ శాఖ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ప్రకారం, ఈ ఫాల్ సీజన్‌లో అంతర్జాతీయ విద్యార్థుల అడ్మిషన్లు 17శాతం మేర తగ్గాయి. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న వీసా విధానాల కారణంగా విదేశీయుల రాక భారీగా తగ్గింది. విధానపరమైన అనిశ్చితి, వీసా ఆంక్షల కారణంగా విదేశీ విద్యార్థులు అనేకమంది అమెరికాకు దూరమవుతున్నారని విశ్లేషకులు అంటున్నారు.

అంతర్జాతీయ విద్యార్థుల ఫాల్ సీజన్ అడ్మిషన్స్‌లో బాగా కోత పడటంతో యూనివర్సిటీలు ఈసారి బిలియన్ డాలర్లమేర ఆదాయాన్ని కోల్పోయే అవకాశముంది. ఇది స్థానిక వ్యాపారాలపైనా ప్రభావం చూపనుంది. గత విద్యాసంవత్సరంలో అమెరికాకు విదేశీ విద్యార్థుల ద్వారా 55 బిలియన్ డాలర్లమేర నిధులు సమకూరాయి. ట్యూషన్ ఫీజులతోపాటు విద్యార్థులు చేసే ఇతరత్రా ఖర్చుల కారణంగా అనేక స్థానిక వ్యాపారాలకు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది మొదట్లో అమెరికాలో అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ కోర్సులు చదువుకుంటున్న అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 1.2 మిలియన్లు. వీరిలో భారతీయులు, చైనీయులే టాప్‌లో ఉండేవారు. మొత్తం విద్యార్థుల సంఖ్యలో వీరి వాటా సుమారు 6 శాతం. అయితే, ఫారిన్ స్టూడెంట్స్ రాక భారీగా తగ్గుతుండటంతో అమెరికా యూనివర్సిటీలపై భారీ ప్రభావం తప్పదని అనేక నివేదికలు చెబుతున్నాయి.

# పెరుగుతున్న దిత్వా మృతులు

- శ్రీలంక జాతీయ విపత్తు నిర్వహణ కేంద్రం వెల్లడి
- 'ఆపరేషన్ సాగర్ బంధు'తో ఒకింత ఉపశమనం

శ్రీలంకలో దిత్వా తుపాను సృష్టించిన బీభత్సం నష్టం రోజురోజుకీ పెరుగుతోంది. భారీ తుపానిధాటికి వరదలు వెల్లువెత్తి.. కొండచరియలు విరిగిపడి.. భారీ ప్రాణనష్టం సంభవించటం తెలిసిందే. దిత్వా దెబ్బకు ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 334కి పెరిగింది. మరో 370మంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్టు శ్రీలంక జాతీయ విపత్తు నిర్వహణ కేంద్రం (డీఎంసీ) వెల్లడించింది. దాదాపు 11.18 లక్షలమందిపై విపత్తు ప్రభావం పడిందని పేర్కొంది. మరోవైపు 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో శ్రీలంకలో భారత్ చేపడుతున్న సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఐఎన్ఎస్ విక్రాంత్, రెండు చేతక్ హెలికాప్టర్లతోపాటు 80మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని శ్రీలంకలో తుపాను సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. అంతకు ముందురోజు వాయుసేనకు చెందిన సీ-130జే, ఐఎల్ 76 విమానాలు 21 టన్నుల సహాయ సామగ్రిని శ్రీలంకకు తరలించడం తెలిసిందే. కొలంబో విమానాశ్రయంలో చిక్కుకున్న 323మంది భారతీయులను రవాణా విమానాల్లో ఇప్పటికే భారత్‌కు తరలించారు. వరద ప్రాంతాల్లో చిక్కుకున్న భారతీయుల్లో 45మందిని భారత వాయుసేన (ఐఏఎఫ్) హెలికాప్టర్లు కొలంబోకు తరలించాయి. ప్రభావిత ప్రాంతాలకు 57మంది శ్రీలంక సైనికుల్ని కూడా ఐఏఎఫ్ తరలించింది. శ్రీలంకలో చిక్కుకున్న భారతీయులెవరైనా అత్యవసర హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.



# టెస్ట్‌ల్లోకి తిరిగి రాను..!



టెస్ట్‌ల్లోకి తిరిగి వస్తాడనే వార్తలకు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ముగింపు పలికాడు. టెస్ట్‌ల్లోకి తిరిగి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశాడు. రాంచీ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లి సూపర్ సెంచరీ(135)తో అదరగొట్టాడు. విరాట్ విశ్వరూపంతో భారత్ 349 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇక ఈ మ్యాచ్ లో టీమిండియా 17 పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. ఇటీవలి ఆస్ట్రేలియా టూర్‌లో మూడో వన్డేలో విరాట్ తన 'వింటేజ్ ఫామ్'ను గుర్తు చేశాడు. ఆ మ్యాచ్ లో 78 పరుగులతో అజేయంగా నిలిచాడు. అదే ఫామ్‌ను సద్వేశంలో కొనసాగిస్తూ ..సౌతాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో సెంచరీతో రెచ్చిపోయాడు. ఆరంభం నుంచీ దూకుడుగా ఆడుతూ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. తనలో ఇంకా చాలా ఆట ఉందనేలా విరాట్ ఇన్నింగ్స్ సాగింది. ఇదే సమయంలో టెస్టుల్లో విఫలమైవుతున్న భారత జట్టులోకి విరాట్ రీఎంట్రీ ఇస్తాడనే వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా జరిగాయి. తాను టెస్టుల్లోకి పునరాగమనం చేస్తున్నానంటూ చక్కర్లు కొడుతున్న వార్తలకు విరాట్ కోహ్లీ ఫుల్‌స్టాప్ పెట్టేశాడు. రాంచీ వన్డేలో అద్భుతమైన శతకం చేసిన విరాట్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఈ ప్రశ్నకు సమాధానం ఇచ్చాడు. భవిష్యత్తులోనూ ఒకే ఫార్మాట్‌లో ఆడతావా? మళ్లీ పునరాలోచన చేసే అవకాశం ఏమైనా ఉందా? అని వ్యాఖ్యాత అడగ్గా... తాను ఒక ఫార్మాట్‌లోనే ఆడతానని స్పష్టం చేశాడు. దీంతో టెస్టుల్లోకి రీ ఎంట్రీ అంటూ ఇప్పటి వరకు సాగుతోన్న ప్రచారానికి చెక్ పడినట్లైంది. కోహ్లీ మాట్లాడుతూ...' గత 16 ఏళ్లుగా దాదాపు 300కి పైగా వన్డేలు ఆడాను. బంతితో నేనెప్పుడూ టచ్‌లోనే ఉన్నాను. ప్రాక్టీస్ సమయంలోనూ హిట్టింగ్ చేయడంపై దృష్టిపెడతాను. నెట్స్‌లో నిర్విరామంగా 2 గంటలపాటు ప్రాక్టీస్ చేస్తే ఆ ప్రభావం తప్పకుండా మ్యాచ్‌లో ఆటతీరుపై పడుతుంది. ఆడుతూ ఉంటే ఫామ్‌లోకి రావడం పెద్ద కష్టమేం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో నాకు ఉన్న అనుభవం మొత్తాన్ని వినియోగించాల్సిన అవసరం ఉంది. నేనెప్పుడూ శారీరకంగా ఫిట్‌గా ఉంటా. మానసికంగానూ సిద్ధమై మ్యాచ్‌లు ఆడేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తుంటా. అలానే నేను ఒక ఫార్మాట్ లోనే ఆడతాను' అని కోహ్లీ తెలిపాడు. ఫిట్‌నెస్ విషయంలో సమస్యలేదు. మానసికంగా దృఢంగా ఉంటే అద్భుతంగా ఆడేయచ్చునన్నాడు.

ఇలాఉంటే టెస్టుల నుంచిరిటైర్మెంట్ వెనక్కి తీసుకోవాలని విరాట్ కోహ్లిని బీసీసీఐ అడిగినట్లు సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగింది. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో భారత్ వైట్‌వాష్‌కు గురైన సంగతి తెలిసిందే. దీంతో కోచ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌పై వేటు వేయాలని డిమాండ్‌లు కూడా వచ్చాయి. ఈ క్రమంలో విరాట్‌ను మళ్లీ టెస్టుల్లో ఆడించాలని అభిమానులు బీసీసీఐకి విజ్ఞప్తి చేశారు. ఇటు బోర్డు కూడా సుముఖంగానే ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా వాటిపై బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. అవన్నీ పుకార్లేనని, అందులో ఎలాంటి వాస్తవం లేదని కొట్టిపడేసింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ.. "విరాట్ కోహ్లీ గురించి ఏదైతే అనుకుంటున్నారో.. అవన్నీ పుకార్లే.. ఈ విషయం గురించి విరాట్‌తో ఎలాంటి సంప్రదింపులు జరపలేదు. కాబట్టి, అనవసరమైన వాటిని ప్రచారం చేయొద్దు. ఆ చర్చే లేదని స్పష్టం చేశాడు.

## ఇషాన్ వరల్డ్ రికార్డు



దేశవాళీ టీ20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2025లో భారత యువ క్రికెటర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సాధించాడు. టీ20 ఫార్మాట్లో ఇంత వరకు ఏ ఆటగాడికి సాధ్యం కాని ఫీట్‌తో వరల్డ్ రికార్డ్‌ను సృష్టించాడు. ఈ టోర్నీలో ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా ఆదివారం త్రిపుర జట్టుతో ఝార్ఖండ్ తలపడింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో... టాస్ ఓడి.. మొదట బ్యాటింగ్‌కు దిగిన త్రిపుర నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. విజయ్ శంకర్ (41 బంతుల్లో 59), బిక్రమ్ కుమార్ దాస్ (29 బంతుల్లో 42), కెప్టెన్ మణిశంకర్ (21 బంతుల్లో 42) రాణించారు. ఝార్ఖండ్ బౌలర్లో వికాస్ సింగ్, అనుకూల్ రాయ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

అనంతరం లక్ష్యఛేదనలో ఝార్ఖండ్ 17.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 185 పరుగులు చేసి.. 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (50 బంతుల్లో 113 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగాడు. ఈ సెంచరీలో 10 ఫోర్లు, 8 సిక్సులు ఉన్నాయి. మరో బ్యాటర్ విరాట్ సింగ్ (40 బంతుల్లో 53 నాటౌట్) హాఫ్ సెంచరీతో కిషన్ కు అండగా నిలిచాడు. సెంచరీతో దుమ్మురేపిన ఇషాన్ కిషన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

టీ20 ఫార్మాట్లో కెప్టెన్‌గా, వికెట్ కీపర్‌గా వ్యవహరిస్తూ ఇషాన్ కిషన్ సాధించిన మూడో శతకం ఇది. తద్వారా క్రికెట్ ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్ గా ఈ ఇషాన్ నిలిచాడు. గతంలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2018-19 సీజన్‌లో కూడా ఇషాన్ కిషన్ ఝార్ఖండ్ సారథిగా, వికెట్ కీపర్‌గా ఉంటూ రెండు శతకాలు బాదాడు. అంతకు ముందు ఆస్ట్రేలియా దిగ్గజం ఆడం గిల్‌క్రిస్ట్ టీ20 ఫార్మాట్లో మిడిల్‌సెక్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్లకు కెప్టెన్‌గా, వికెట్ కీపర్‌గా ఉంటూ రెండు సెంచరీలు చేశాడు. పాకిస్థాన్ ఆటగాడు మహమ్మద్ రిజ్వాన్ కూడా ముల్తాన్ సుల్తాన్స్ తరఫున కెప్టెన్‌గా, వికెట్ కీపర్‌గా ఉంటూ 2 సెంచరీలు చేశాడు.

## వారిద్దరూ లేకుంటే వరల్డ్‌కప్‌ను మరిచిపోవాల్సిందే..!



భారత స్టార్ క్రికెటర్లు.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి కచ్చితంగా 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడుతారని, అందులో సందేహమే అక్కర్లేదని టీమిండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అన్నాడు. రాంచి వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి వన్డే మ్యాచ్లో ఈ జోడీ అద్భుత ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే. కోహ్లి భారీ సెంచరీతో (137) చెలరేగిపోతే, రోహిత్ (57) అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. ఈ నేపథ్యంలోనే కృష్ణమాచారి శ్రీకాంత్ మాట్లాడాడు. కోహ్లి, రోహిత్ ఆట అద్భుతం. వీరిద్దరూ లేకుండా 2027 వన్డే వరల్డ్‌కప్ ప్రణాళికలు సఫలం కావు. వీరిద్దరూ ఉండాల్సిందే. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదని తన యూట్యూబ్ ఛానల్లో శ్రీకాంత్ స్పష్టం చేశాడు. "రోహిత్, కోహ్లి ఇద్దరూ 20 ఓవర్లపాటు క్రీజులో ఉంటే. ప్రత్యర్థులకు విజయావకాశాలు గల్లంతే. రాంచి వన్డేలోనూ అదే జరిగింది. వారిద్దరూ చక్కగా బ్యాటింగ్ చేశారు. వారి భాగస్వామ్యమే ఇండియాను విజేతగా నిలిపింది. అయితే దక్షిణాఫ్రికా మంచి పోరాట పటిమను ప్రదర్శించింది" అని పేర్కొన్నాడు. వారిద్దరూ కేవలం పరుగులు సాధించడం మీదే కాదు.. ఫిట్‌నెస్‌పై కూడా దృష్టి పెడుతున్నారు. ప్రస్తుతం వీరు ఒక ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నారు. అలాంటి సమయంలో రిథమ్ కొనసాగించడం కష్టం. కానీ వారిద్దరూ ఫామ్లోనే ఉన్నారు. నా ఉద్దేశంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి 2027 వన్డే వరల్డ్ కప్ కోసం 1, 3 స్థానాలను ఇప్పటికే ఫిక్స్ చేసుకున్నట్లే. వారు లేకుండా మనం గెలవలేమని శ్రీకాంత్ విశ్లేషించాడు. వారిద్దరూ లేకుండా మనం 2027 వన్డే వరల్డ్ కప్ గెలవలేమని శ్రీకాంత్ తేల్చిచెప్పాడు.

## వన్డేల్లో విరాట్ టాప్..



వన్డేల్లో విరాట్ కోహ్లినే టాప్ ప్లేయర్ అని దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అన్నాడు. రాంచీ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి భారీ శతకం బాదాడు. ఇది అతడికి వన్డేల్లో 52వ సెంచరీ. దీంతో అంతర్జాతీయంగా ఒక ఫార్మాట్లో ఎక్కువ సెంచరీలు బాదిన క్రికెటర్‌గా అవతరించాడు. ఇంతముందు ఈ రికార్డ్ సచిన్ (టెస్టుల్లో 51 సెంచరీలు) పేరు మీద ఉండేది. కోహ్లి ఇది వరకే వన్డేల్లో సచిన్.. అత్యధిక సెంచరీల (49) రికార్డును అధిగమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విరాట్‌ను టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశంసలతో ముంచెత్తాడు. ఎవరైతే విరాట్ కోహ్లితో ఆడారో.. వారందరూ అతడు వన్డేల్లో గ్రేటెస్ట్ అని అంగీకరిస్తారు. రికీ పాంటింగ్ సైతం వన్డేల్లో విరాట్ బెస్ట్ అని కితాబిచ్చాడు. ఆస్ట్రేలియన్ క్రికెటర్ల నుంచి పొగడ్తలు అందుకోవడం చాలా కష్టం. సచిన్ రికార్డును అధిగమించాడంటేనే.. కోహ్లి అంటే ఏంటో అర్థం చేసుకోవచ్చునని సునీల్ గవాస్కర్ అన్నాడు. టీ20, టెస్ట్ క్రికెట్‌కు ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లి ప్రస్తుతం కేవలం వన్డే క్రికెట్‌పైనే ఫోకస్ చేసిన విషయం తెలిసిందే. అతడు 2027 వన్డే వరల్డ్‌కప్‌లో టీమిండియా తరఫున ఆడటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. ప్రస్తుత సిరీస్ లో భాగంగా దక్షిణాఫ్రికాతో రెండో వన్డే రాయపూర్ వేదికగా డిసెంబర్ 3న జరగనుంది. మొదటి వన్డేలో విజయం సాధించిన భారతజట్టు సిరీస్లో 1-0తో ముందంజలో ఉంది.

## సేఫ్టీ క్లియరెన్స్ వస్తేనే...



బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ -2026 మ్యాచ్‌లు జరగడం కష్టంగానే కనిపిస్తోంది. ఈ స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటే ముందుగా సేఫ్టీ క్లియరెన్స్ నివేదికను అందజేయాలని కర్ణాటక ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ)కి ఆ రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారిక నోటీసును జారీ చేసింది. స్టేడియంకు సంబంధించి వివరణాత్మక నిర్మాణ భద్రత నివేదికను సమర్పించాలని ఆదేశించింది. నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్ ధ్రువీకరించిన నిపుణులతో నివేదికను రూపొందించాల్సి ఉంటుంది. ఈ నివేదిక ఆధారంగానే చిన్నస్వామి మైదానంలో మ్యాచ్‌లకు అనుమతి ఇవ్వాలా.. వద్దా అనే విషయంలో కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఛాంపియన్‌గా నిలవగా.. ఈ ఏడాది జూన్ 4న చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అప్పుడు స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందగా.. 50 మందికి పైగా గాయపడిన ఘటన విషాదం రేపిన విషయం తెలిసిందే. తొక్కిసలాట ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖెల్ డి. కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ వేసింది. ఈ కమిషన్ చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని తేల్చింది. ఇందులో పెద్ద కార్యక్రమాలు నిర్వహిస్తే జనాలను అదుపు చేయలేక మళ్లీ తొక్కిసలాట లాంటి పరిస్థితులు ఏర్పడతాయని, నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించింది. తొక్కిసలాట జరిగినప్పటి నుంచి ఈ మైదానంలో మ్యాచ్‌లు నిర్వహించడం లేదు. ఇప్పుడు తిరిగి మ్యాచ్‌లు నిర్వహించాలంటే పెద్ద ఈవెంట్లు నిర్వహించడానికి స్టేడియంలో ప్రేక్షకుల గ్యాలరీలు, మొత్తం నిర్మాణం సురక్షితంగా ఉందని నిరూపించాలి. స్టేడియంకు సేఫ్టీ క్లియరెన్స్ ఉంటేనే ఐపీఎల్ -2026 లో మ్యాచ్‌లకు అనుమతిస్తామని కర్ణాటక ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆర్సీబీ ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించింది. పుణెలోని మహారాష్ట్ర క్రికెట్ సంఘం (ఎంసీఏ) స్టేడియంలో 2026 ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహణపై సమాలోచనలు చేస్తోంది.

## వాళ్లు రాస్తారు.. నేను నవ్వుకుంటుంటాను



టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌తో డేటింగులో ఉన్నట్టు వచ్చిన రూమర్స్‌పై మృణాల్ ఠాకూర్ స్పందించారు. 'ఇలాంటి రూమర్స్ వినడానికి హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ సోషల్ మీడియా వేదికగా తనపై జరిగిన ప్రచారానికి చెక్ పెట్టారు. ఇంతకుముందు.. నటుడు ధనుష్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్టు ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ అప్పుడే ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. మృణాల్‌పై రూమర్స్ రావడం ఇదే తొలిసారి కాదు. ఓ టాలీవుడ్ నటుడిని మృణాల్ వివాహం చేసుకోనున్నారంటూ కొంతకాలం క్రితం నెట్టింట చర్చ జరిగింది. తన మూవీ (జెర్సీ హిందీ రీమేక్) ప్రమోషన్స్‌లో మాట్లాడుతూ ఓ ప్రముఖ క్రికెటర్‌పై అభిమానం వ్యక్తం చేయగా.. ఆ క్రీడాకారుడితో ఆమెకు రిలేషన్షిప్ ఉన్నట్లు జాతీయ మీడియాలో వార్తలు రావడం గమనార్హం. సినిమాల విషయానికొస్తే.. 'సన్నాఫ్ సర్దార్ 2'తో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చారు మృణాల్. బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటున్నారు. 'దో దీవానే శహర్ మే' సహా మరో రెండు హిందీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో అడివి శేష్ సరసన నటిస్తున్న 'డెకాయిట్' హిందీలోనూ విడుదల కానుంది. అల్లు అర్జున్– అట్లీ కాంబినేషన్లో రూపొందుతున్న సినిమాలో ఓ హీరోయిన్‌గా మృణాల్ ఎంపికైనట్టు వార్తలొచ్చాయి. దీనిపై అధికారిక ప్రకటన లేదు.

### భూతశుద్ధి సంప్రదాయంలో

## ఒక్కటైన సమంత -రాజ్



హీరోయిన్ సమంత వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. సోమవారం తెల్లవారుజామున కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో ఉన్న లింగభైరవి ఆలయంలో సమంత–రాజ్ నిడిమోరు వివాహబంధంతో ఒక్కటయ్యారు. వీరిద్దరూ భూతశుద్ధి పద్ధతిలో వివాహం చేసుకున్నట్లు ఈశా సంస్థ చేసిన ప్రకటనతో.. ఇప్పుడు అందరి దృష్టి ఆ సంప్రదాయంపై పడింది. భూతశుద్ధి వివాహం గురించి తెలుసుకొనేందుకు నెటిజన్లు ఆసక్తి చూపిస్తున్నారు. భూతశుద్ధి వివాహ సంప్రదాయం యోగ విధానంలో వేలాది పురాతన కాలంనుంచీ కొనసాగుతోన్న అత్యంత పవిత్రమైన వివాహ పద్ధతి. ఇందులో పేరుకు తగ్గట్టుగానే ఆలోచనలు, భావోద్వేగాలు లేదా భౌతికతకు అతీతంగా దంపతులమధ్య లోతైన బంధాన్ని ఏర్పరిచేందుకు రూపొందించిన విశిష్టమైన ప్రక్రియే ఈ వివాహం. లింగ భైరవి ఆలయాల్లో ఎంపిక చేసిన ప్రదేశాల్లో నిర్వహించే ఈ వివాహ క్రతువు వధూవరుల దేహాల్లోని పంచభూతాలనూ శుద్ధి చేస్తుందని నమ్మకం. వారి దాంపత్య ప్రయాణంలో సామరస్యం, శ్రేయస్సు, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా దేవీ అనుగ్రహాన్ని ప్రసాదిస్తుందని నమ్ముతారు. సాధారణంగా హిందూ జంటలకు చేసే సంప్రదాయ మంత్రోచ్చారణలతోపాటు వధూవరుల శరీరం, మనసు, జీవశక్తి స్థాయులను సమన్వయం చేసే యోగిక క్రతువులతో ఈవివాహం జరుపుతారు. ఈశా ఫౌండేషన్ మాత్రమే ఈ వివాహాలను చేస్తుంది. ఈ క్రతువులో వివాహ జంటకు ప్రాథమికస్థాయిలో లోతైన బంధం ఏర్పడుతుందని విశ్వాసం.

## సక్సెస్‌కు నెంబర్లు కొలమానం కాదు



సినిమా ఫలితాన్ని బాక్సాఫీస్ నంబర్ల ఆధారంగా నిర్ణయించే సంప్రదాయం దురదృష్టకరమని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమీర్‌ఖాన్ అన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని, ఇప్పుడు ఆ నంబర్లకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. "బాక్సాఫీస్ నంబర్ల విషయంలో దర్శకనిర్మాతలు పారదర్శకత పాటించాలి. ఎన్ని స్క్రీన్లలో రిలీజ్ చేశారు.. ఎంత కలెక్షన్లు వచ్చాయనే ప్రతి విషయం ప్రేక్షకులకు తెలియాలి. విదేశాల్లో అలాంటి పద్ధతే ఉంది. గతంలో నేను వీటిగురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ, ఇప్పుడు ప్రేక్షకులకు దీనిపై ఆసక్తి పెరిగింది కాబట్టి నేనూ ఆలోచిస్తున్నా. నంబర్ల ఆధారంగా సినిమా ఫలితాలను అంచనా వేయడం దురదృష్టకరం. అంచనాలు ఎలా ఉన్నప్పటికీ మంచి సినిమాలను మాత్రమే ప్రేక్షకులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు" అని ఆమిర్ స్పష్టం చేశారు. ఇక ఇటీవల మరణించిన బాలీవుడ్ హీరో ధర్మేంద్రతో ఉన్న అనుబంధాన్ని ఆమిర్ గుర్తుచేసుకున్నారు. ఆయనను కలవడం తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని క్షణమన్నారు. తన సినిమాల ఎంపికల గురించి ఆమిర్ మాట్లాడుతూ.. "నాకు బాల్యం నుంచే కథలపట్ల ఆసక్తి ఎక్కువ. అదే నన్ను మంచి సినిమాల దిశగా నడిపించింది. ఈ రోజుల్లో చాలామంది తదుపరి ఏమి తీయాలి.. మార్కెట్లో ఏ సినిమాలు నడుస్తున్నాయి అని ఆలోచిస్తున్నారు. కానీ నేను ఎప్పుడూ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకొని కథల్ని ఎంపిక చేసుకోలేదు" అని తెలిపారు.

## యుఫోరియా.. మొదలైంది!



భూమిక, సారా అర్జున్, గౌతమ్ వాసుదేవ్ మేనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'యుఫోరియా'. కొత్త కాన్సెప్ట్‌తో గుణశేఖర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. నీలిమా గుణశేఖర్ నిర్మాతగా వ్యవహరించనున్న సినిమా వచ్చే ఏడాది ఫిబ్రవరి 6న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీజర్‌ను తాజాగా విడుదల చేశారు. మాదకద్రవ్యాల వల్ల యువత ఎదుర్కొనే సమస్యల ఆధారంగా 'యుఫోరియా' తెరకెక్కినట్టు అర్థమవుతోంది.



## పెళ్లి సలహాలివ్వను

ప్రస్తుతమున్న జనరేషన్‌కు తాను వివాహం గురించి సలహాలు ఇవ్వబోనని నటి జయా బచ్చన్ అన్నారు. జీవితాన్ని ఆస్వాదించాలని వారికి చెబుతానన్నారు. సినీ, రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసుకున్న జయా బచ్చన్ తాజాగా ఈతరం పిల్లల గురించి 'వి ది విమెన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. తన మనవరాలు నవ్య నవేలి నందా వివాహం గురించి మాట్లాడారు. "నవ్య ఇప్పుడే పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టం లేదు. జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించాలని చెబుతాను. ఆమెకు మరికొన్నిరోజుల్లో 28 సంవత్సరాలు నిండుతాయి. నేటితరం పిల్లలకు మనం సలహాలు ఇవ్వలేం. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. చిన్నపిల్లలు చాలా తెలివైన వారు. అన్ని విషయాల్లో మనల్ని మించిపోయారు. ఇక, వివాహం అంటే ఇలానే ఉండాలి అని చట్టబద్ధమైన నిర్వచనాలు లేవు. అలా నిర్వచించాల్సిన అవసరం కూడా లేదు. ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడుండాలంతే" అని జయాబచ్చన్ తెలిపారు. అమితాబ్–జయాబచ్చన్ మనవరాలు నవ్యకు సోషల్‌మీడియాలో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె సినిమాల్లోకి వచ్చే అవకాశం ఉందని ఇప్పటికే పలు సందర్భాల్లో వార్తలు రాగా.. అందులో నిజం లేదని, తనకు యాక్టింగ్ అంటే ఇష్టం లేదని నవ్య ఓ సందర్భంలో స్పష్టం చేశారు. తన స్నేహితులతో కలిసి 'ఆరా హెల్త్' అనే ఆన్‌లైన్ హెల్త్‌కేర్ పోర్టల్‌ను ప్రారంభించారు. మహిళల కోసం ప్రత్యేకంగా ప్రారంభించిన ఈ ఆన్‌లైన్ వేదికగా ఎన్నో శారీరక, మానసిక రుగ్మతలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తున్నారు.

## జూటోపియా 2 -వసూళ్ల తుపాను

ఒక్కోసారి కొన్ని సినిమాల వసూళ్లు వింటే.. దానిపై పరిజ్ఞానం ఉన్నవాళ్లకూ ఒకింత షాకింగ్ అనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ దగ్గర భారీ గ్రాఫిక్స్, భారీ యాక్షన్ లేదా మోషన్ కాప్చర్‌లాంటి సినిమాలు రికార్డు వసూళ్లు సాధిస్తుంటాయి. కానీ ఇక్కడ సర్‌ప్రైజింగ్ విషయమేంటంటే.. వీటినిమించి యానిమేషన్ సినిమాలు వరల్డ్ బాక్సాఫీస్ దగ్గర ఊహించని నంబర్స్ చేసినవీ ఉన్నాయి. ఈ ఏడాదిలోనే చైనాకి చెందిన 'నే జూహ్' అనే యానిమేషన్ సినిమా ఏకంగా 2 బిలియన్ డాలర్స్‌కి పైగా రాబట్టింది. అంటే ఇది అవతార్–2 రేంజ్ వసూళ్లు. దీనిబట్టి యానిమేషన్ సినిమాల హవా ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇక మరో యానిమేషన్ సినిమా వరల్డ్ బాక్సాఫీస్ దగ్గర సంచలనం సెట్ చేస్తుంది. ఆ సినిమానే 'జూటోపియా 2'. హాలీవుడ్‌కి చెందిన ఈ సినిమా కేవలం చైనాలోనే ఒక్క రోజులో 104 మిలియన్ డాలర్స్‌కి పైగా రాబట్టిందట. అంటే ఇది మన కరెన్సీలో ఏకంగా 930 కోట్లకి పైగా వసూళ్లన్న మాట. అంతేకాకుండా చైనా మార్కెట్‌లో ఇది కేవలం ఒక్కరోజు వసూళ్లే కాకుండా అవెంజర్స్ ఎండ్ గేమ్ డే 1 రికార్డు గ్రాస్‌ని క్రాస్ చేసి కొత్త రికార్డు సెట్ చేసిందని అంటున్నారు. ఇదంతా కేవలం ఒక యానిమేషన్ సినిమా చేయడం గమనార్హం. దర్శకులు జేరెడ్ బుష్ అలాగే బైరన్ హోవార్డ్‌లు తెరకెక్కించిన ఈ సినిమా లాంగ్ రన్‌లో ఇంకెన్ని సంచలనాలు సెట్ చేస్తుందో చూడాలి.



## లోకేష్.. ఈజ్ వెయిటింగ్!

కోలీవుడ్ సినిమా స్టార్ దర్శకుల్లో లోకేష్ కనగరాజ్ ఇమేజ్ వేరు. తన గత రెండు సినిమాలు అనుకున్న రేంజ్ అంచనాలు అందుకోకున్నా.. తర్వాత తనను‌నుంచి ఏ టాప్ స్టార్‌తో సినిమా చేయాలనుకున్నా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా వినిపించడం ఖాయం. నిజానికి లోకేష్ కనగరాజ్ ఖైదీ–2 చేయాలని చాలామంది కోరుకుంటున్నారు. కానీ లోకేష్ ప్లానింగ్ మరోలా ఉందంటూ రూమర్స్ వినిపిస్తున్నాయి. తాను ముగ్గురు బిగ్‌స్టార్స్‌కి మన సొంతనుంచి కథలు చెప్పినట్టు టాక్. ఇప్పటివరకు తాను వర్క్‌చేయని కంప్లీట్ కొత్త స్టార్స్‌కి స్క్రిప్ట్ రెడీ చేసి చెప్పాడట. ఇలా తెలుగునుంచి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్.. అలాగే తమిళ్‌లో అజిత్ కుమార్‌కి నరేషన్ ఇచ్చినట్టు సమాచారం. ఈ ముగ్గురులో ఎవరూ ఇంకా లోకేష్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు లేదు. కానీ ఇస్తే మాత్రం.. ఎవరితో చేసినా బాక్సాఫీస్ బ్లాస్టేనని చెప్పడానికి సందేహం అక్కర్లేదు. మరి ఈ ముగ్గురులో ఎవరు లోకేష్‌ని ఓకే చేస్తారో చూడాలి.

